సంచలన వార్తా పత్రిక
లీడర్
SANCHALANA VAARTHA PATRIKA LEADER
సోమవారం • 5 మార్చి 2018 । సంపుటి : 20 సంచిక : 217 । ఎడిటర్ : వి.వి.రమణమూర్తి । 8 పేజీలు । వెల : రూ. 2.00
Published from Visakhapatnam, Rajahmundry and Hyderabad
Read / Share / Follow
www.leaderepaper.com
www.facebook.com
/leaderramanamurthy/

పిచ్చుకలపై ప్రేమతో..



పిచ్చుకల సంతతి పెరగడానికి కృషి చేద్దాం అనే నినాదంతో పౌర గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆరాధన హోమ్‌కు చెందిన పిల్లలు ఇలా ప్రదర్శన చేస్తున్న చిత్రం.

3లో

పోలీసుల చెలగాటం... డాక్టర్‌కు ప్రాణసంకటం





జెట్టి గోపీనాథ్



నిక్కుదల నరేంద్ర (ఎ1 ముద్దాయి)



రాచూరి శ్రీలక్ష్మి



రాచూరి వినోద్‌కుమార్ (ఎ2 ముద్దాయి)



నిక్కుదల కిరణ్ (ఎ3 ముద్దాయి)



జె. విద్యాసాగర్, ఎస్.ఐ. (ఎ4 ముద్దాయి)

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : ఆయన ఒక విక్రమార్కుడు. తనకు జరిగిన అన్యాయం గురించి ఐదేళ్ళ నుంచీ అలుపెరగని పోరాటం చేస్తూనే వున్నాడు. తనపై పోలీసులు అక్రమంగా కేసులు పెట్టినా చలించలేదు. సాక్షాత్తు ఒక ఐ.పి.ఎస్. ఆఫీసర్ బెదిరించినా చతికిల పడలేదు. తిరుపతి పోలీసులు ఒక యువతి 'వల'లో పడి నరకం చూపించినా నరనరాల్లో రక్తం ఉప్పొంగిందే తప్ప చల్లబడలేదు. తన నిజాయితీని నిరూపించుకోవడం కోసం తిరుపతి పోలీసుల్ని చట్టంతోనే చిత్తు చిత్తుగా వెంట తరుముతూ వారి పాలిట సింహస్వప్నంగా నిలిచిన ఆ విక్రమార్కుడు గురించి తెలుసుకోవాలనుకుంటున్నారా? అయితే ఆయన మాటల్లోనే ఆ కథ చదవండి...

డాక్టర్ భాస్కర్ జన్యుశాస్త్రంలో సీనియర్ వైద్యులు. ఈ శాస్త్రంలో ఆంధ్రప్రదేశ్ లోనే ఆయన్ను మించిన వారు లేరు అని అందరూ అంటుంటారు. ఆయన తన సంపాదనలో సింహభాగం సోషల్ సర్వీస్ కార్యక్రమాలకే ఉపయోగిస్తూ ఉంటారు. ఇంకా మెడికల్ పి.జి సీట్లు పొందగోరే విద్యార్థులకు ఉచితంగా జెనిటిక్స్ విభాగంలో కోచింగ్ ఇస్తూ వస్తుంటారు. "ఆయన కోచింగ్ ఇస్తే సీటు తప్పనిసరి" అని భావం ఉండడం వల్ల అందరూ డాక్టర్ భాస్కర్ దగ్గర కోచింగ్ పొందాలని ఉబలాట పడతారు. ఇందులో భాగంగా 2013-2014లో విజయవాడలో ఉచిత కోచింగ్ ఇస్తుండేవారు. నెల్లూరుకు చెందిన రాచూరి శ్రీలక్ష్మి అనే విద్యార్థిని కూడా కోచింగ్ పొందింది. ఆ క్రమంలో రాచూరి శ్రీలక్ష్మి మనసు భాస్కర్ పై పడింది. ఇక అక్కడి నుంచి భాస్కర్ కష్టాలు మొదలయ్యాయి. అర్ధరాత్రి, అపరాత్రి అని లేకుండా ఫోన్ చేసి తను ప్రేమిస్తున్నానని, పెళ్ళి చేసుకోవాలని లేదంటే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించడం మొదలు పెట్టింది. దీంతో భాస్కర్ ఏమి చేయాలో అర్థం కాక 2014 మార్చి నెలలో విజయవాడ లోని మాచవరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. "అమ్మాయి కదా జాగ్రత్తగా వుండాలి." అంటూ కేసుల వరకూ పోకుండా పోలీసులు రాచూరి లక్ష్మిని పిలిపించి వార్నింగ్ ఇచ్చి పంపేశారు. అయినప్పటికీ ఆమె భాస్కర్‌ను విడిచిపెట్టలేదు. డాక్టర్ భాస్కర్ ఇచ్చిన కోచింగ్ వలన సదరు శ్రీ లక్ష్మికి తిరుపతి వెంకటేశ్వర మెడికల్ కాలేజిలో శ్రీ లక్ష్మికి ఎం.ఎస్.

మిగతా 2లో ▶

బాబు... దుబారా

- రాష్ట్రంలో మేడిపండు పాలన
- రెండింతల ఆర్థికలోటుకు ప్రభుత్వమే కారణం
- పెట్టుబడుల సదస్సుల వలన ఒరిగిందేమిటీ?
- ప్రత్యేక హోదాపై బాబు ప్రత్యక్షంగా పోరాటానికి దిగాలి
- మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకులు సి. రామచంద్రయ్య



విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మేడిపండు పాలన సాగుతోందని మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకులు సి. రామచంద్రయ్య అన్నారు. వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు దుబార ఖర్చుల వలన రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దయనీయంగా మారిందని చెప్పారు. ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం వుండటం సిగ్గుచేటు అన్నారు. రూ. లక్ష 25వేల కోట్లు చంద్రబాబు అప్పుచేశాడని రాష్ట్రం లోటు బడ్జెట్‌ను రెండింతలు చేశాడన్నారు. విచ్చల విడిగా అప్పులు చేసి రాజధాని అమరావతిలో తాత్కాలిక భవనాలకు, హంగులకు విశాఖపట్నంలో అనవసరం సంబరాలు, ఉత్సవాల పేరుతో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రప్రభుత్వం అప్పులకు

మిగతా 3లో ▶

మన్యంలో బంద్ విజయవంతం



అరకులోయ, న్యూస్‌లీడర్: రాష్ట్ర గిరిజన సంఘం పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఏజెన్సీ బంద్‌లో భాగంగా ఆదివారం విశాఖ ఏజెన్సీలో పాడేరు, అరకు ప్రాంతాలలో బంద్ నిర్వహించారు. ఈ నేపథ్యంలో బంద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్, ఆర్టీసీ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఏజెన్సీలో ఆదివారం ఉదయం నుంచి ఆర్టీసి బస్సులు తిరగలేదు. బంద్‌కు సంబంధించి గిరిజనసంఘం నాయకులు ముందుగా వివిధ వ్యాపార సంస్థ

మిగతా 2లో ▶

నీరవ్, చోక్సీకు ఎన్‌బీడబ్ల్యూ



ఢిల్లీ : దేశవ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన వజ్రాల వ్యాపారులు నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీల వ్యవహారమై న్యాయస్థానం మరో అడుగు ముందుకు వేసింది. పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)కి రూ.12 ,700 కోట్ల మేర ఎగవేసి విదేశాలకు చెక్కేసిన వీరద్దరికి నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారంట్లు జారీ చేసింది. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్‌ఏ) కింద ఏర్పాటైన ముంబైలోని న్యాయస్థానం ఈ వారంట్లు జారీ చేసింది. తమ ఎదుట హాజరు కావాల్సిందిగా పంపించిన సమన్లకు నీరవ్ మోదీ నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రత్యేక కోర్టును ఆశ్రయించింది. నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీలపై నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారంట్లు జారీ చేయాల్సిందిగా గతనెల 27న ఈడీ కోర్టును ఆశ్రయించింది. బ్యాంకు కుంభకోణం కేసులో విచారణ కోసం తమ ఎదుట హాజరు కావాల్సిందిగా సమన్లు పంపినప్పటికీ వారు బేఖాతరు చేశారని కోర్టుకు తెలిపింది. ఈడీ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న కోర్టు నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీలకు నాన్ బెయిలబుల్ వారంట్లు జారీ చేసింది.

స్కామ్‌లో విస్తుపోయే విషయాలు

ఎన్‌బీ స్కామ్‌లో అధికారులు విస్తుపోయే విషయాలను వెల్లడిస్తున్నారు. బ్యాంక్ అధికారుల సాయంతోనే ఈ బడా కుంభకోణం చోటు చేసుకుందని సీబీఐ నిర్ధారణకు వచ్చింది. నీరవ్ మోదీ నుంచి బ్యాంక్ అధికారులు బంగారం కాయిన్లు, డైమండ్ నగలను లంచంగా తీసుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. శనివారం ఈ విషయాన్ని సీబీఐ.. కోర్టుకు తెలిపింది. ఈ కేసులో మొత్తం 14 మందిని అరెస్ట్ చేసిన సీబీఐ వారిని విడివిడిగా విచారణ చేపట్టింది. ఈ క్రమంలో పంజాబ్ నేషనల్ బ్యాంకు సిబ్బంది నీరవ్ మోదీ నుంచి లంచం స్వీకరించినట్లు తెలిపింది. ముంబై బ్రాంచ్ ఫోరెక్స్ విభాగపు మేనేజర్ యశ్వంత్ జోషి నీరవ్ మోదీ నుంచి 60 గ్రాముల చేసే రెండు బంగారు కాయిన్లను, ఒక జత గోల్డ్, డైమండ్ ఇయర్ రింగ్స్‌ను తీసుకున్నట్లు అంగీకరించినట్లు సీబీఐ కోర్టుకు

మిగతా 2లో ▶

విమానానికి తప్పిన పెను ప్రమాదం



హైదరాబాద్ : శంషాబాద్ విమానాశ్రయంలో తృటిలో ఘోర ప్రమాదం తప్పింది. అత్యవసరంగా ల్యాండై, ఇంధనాన్ని నింపుకొని తిరిగి బయలు దేరిన ఆ విమానం కొద్ది సేపటికే ప్రమాదం పొంచివుండడంతో విమానాశ్రయ సిబ్బంది అప్రమత్తం కావడంతో ఘోర ప్రమాదం తప్పింది.వివరాల్లోకి వెళితే. చౌకవిమానయాన సంస్థ సిటీలింక్‌కు చెందిన విమానం ఒకటి ఆదివారం ఉదయం జెడ్డా(సౌదీ అరేబియా) నుంచి జకార్తా(ఇండోనేషియా)కు బయలుదేరింది. అయితే, మార్గం మధ్యలోనే ఇంధనం నిండుకోవడంతో పైలట్ దాన్ని హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్

మిగతా 3లో ▶

శ్రీదేవి గురించి మరిన్ని చెప్పిన బోనీ



ముంబయి : ప్రముఖ సినీ నటి స్వర్గీయ శ్రీదేవిని ఇంకా అభిమానులు మరచిపోలేకపోతున్నారు. శోకసంద్రం నుండి బయటపడలేకపోతున్నారు. ఈమె మృతి సైతం పలు సందేహాలకు తావివ్వడంతో అభిమానుల్లో మరింత ఉత్కంఠత రగులుతునే వుంది. వాస్తవాలేమిటో ఇప్పటికీ ఆరా తీస్తునే వున్నారు. మేనల్లుడు మోహిత్ మార్వా వివాహం నిమిత్తం కుటుంబంతో కలిసి దుబాయ్ వెళ్లిన శ్రీదేవి అక్కడి హోటల్‌లో ప్రమాదవశాత్తు బాత్‌టబ్‌లో పడి కన్నుమూశారు. ఆమె చనిపోయి సరిగ్గా వారం కావస్తున్నా.... ఇంకా

మిగతా 2లో ▶

జగమేమాయ!



మనల్ని అడిగేవారెవరు సార్... ఆ కల్తీ మద్యం కూడా మనమే సప్లయ్ చేస్తే ఇంకా దండుకోవచ్చు..!

మాణిక్యం కన్నా మనీ మిన్న



నీతికి పాతర.. ఓహో ఓటరా!

(ప్రత్యేక ప్రతినిధి)

అర్థబలం, అంగబలం, దోపిడీ, దౌర్జన్యం, మోసం, దగా..ఇవన్నీ వుంటేనే నేటి రాజకీయాల్లో నిలదొక్కుకోగలమని నిరూపించారు.. త్రిపుర రాష్ట్ర ప్రజలు. ఆరు పర్యాయాలు రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసి, తనకంటూ ఏమీ దాచుకోని నిజాయితీపరుడైన మాణిక్ సర్కార్ ఈ ఎన్నికల్లో ఓటమిపాలు కావడం జాతీయంగా చర్చకు దారితీసింది. కరుడుగట్టిన కమ్యూనిస్టు నాయకుడిగా, నీతి, నిజాయితీకి నిలువటద్దంగా నిలిచిన మాణిక్ జాతీయ స్థాయిలో అత్యంత నీతివంతుడైన ముఖ్యమంత్రిగా ఖ్యాతి గాంచారు. స్వార్థ, స్వప్రయోజనాలను పక్కనబెట్టి, తాను నమ్మిన సిద్ధాంతాన్ని, తనను నమ్మిన ప్రజల నమ్మకాన్ని వొమ్ముచేయకుండా పాలన సాగించిన మాణిక్ ఆరు



పర్యాయాల్లో ఎప్పుడు ఎలాంటి అవినీతి ఆరోపణలు ఎదుర్కొనలేదు. మచ్చలేని సర్కారు నడిపిన ఘనత కూడా ఆయనకే దక్కుతుంది. అయితే తాజాగా ఆ రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో

మిగతా 3లో ▶

సంచలన వార్తాపత్రిక

లీడర్

క్లాసిఫైడ్స్

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏ విధమైన సంబంధంలేదు. - మేనేజ్‌మెంట్

విశాఖపట్నం | సోమవారం 5-3-2018 | Minimum 1 week | రోజుకి రూ.40/- మాత్రమే Size : 1x3

CONTACT : 92466 21490 / 92982 05388 | 5% GST EXTRA

నీరవ్, చోక్సీకు ఎన్‌బీడబ్ల్యూ

(మొదటిపేజీ తరువాయి)

తెలిపింది. వీరితోపాటు మరికొందరి నుంచి కూడా తాము లంచం స్వీకరించినట్లు అంగీకరించారు. దీంతో బ్యాంక్ సిబ్బంది సహకారంతోనే ఈ బడా స్కామ్ చోటు చేసుకున్నట్లు సీబీఐ స్పష్టతకు వచ్చింది. జోషితోపాటు మరో నలుగురు పీఎన్‌బీ అధికారులు, ఇద్దరు బ్యాంక్ ఆడిటర్లు, మోదీ సహాయకుడు ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. వీరి నుంచి మరింత సమాచారం రాబట్టేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఇదిలా ఉంటే రూ.12,600 కోట్ల పీఎన్‌బీ కుంభకోణంలో ముంబై కోర్టు మోదీ, చోక్సీలపై నాన్ బెయిల్‌బుల్ వారంట్లను జారీ చేసిన సంగతి తెలిసిందే.

మన్యంలో బంద్ విజయవంతం

(మొదటిపేజీ తరువాయి)

యాజమాన్యాలకు తెలియచేయడంతో స్వచ్ఛందంగా ఏజెన్సీలోని పలు హోటల్స్, లాడ్జిలు ఉదయం నుండే మూసివేసి బంద్‌కు సహకరించారు. టిఫిన్ సెంటర్లు తెరవకపోవడంతో పర్యాటకులు కాస్త ఇబ్బంది పడ్డారు. పలు కిరాణా, ఇతరత్ర వ్యాపార సంస్థలు సైతం మూసివేశారు. రెవెన్యూ డివిజన్ కేంద్రమైన పాడేరులో బంద్ నిర్వహిస్తున్న గిరిజన సంఘం నాయకుల్ని పోలీసులు అరెస్టులు చేశారు. పాడేరు ఐటీడీఏ పరిధిలోని 11 సబ్ ప్లాన్ మండలాల్లో సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు.ఒక వైపు ఆర్టీసీ బస్సులు తిరగకపోగా, మరో వైపు ప్రైవేటు వాహనాలను కూడా ఆందోళనకారులు తిరగనీయకపోవడంతో పలువురికి ఇబ్బందులు తప్పలేదు.బంద్ సందర్భంగా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. అరకులోయలో144 సెక్షన్ విధించడంతో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. అయితే కొన్ని ప్రైవేటు వాహనాలను నిలువరించేందుకు మధ్యాహ్నం కొందరు కార్యకర్తలు ప్రయత్నించగా పోలీసులు దానిని అడ్డుకోవడంతో పోలీసులకు,నిరసనకారులకు మధ్య చిన్న వాగ్వివాదం చోటు చేసుకుంది. మొత్తంమీద మధ్యాహ్నం 2 గంటల వరకు బంద్ సంపూర్ణంగాను, ప్రశాంతంగానూ కొనసాగింది.వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన బంద్‌లో పాల్గొన్న పలువురు గిరిజన నాయకులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదాతోపాటు గిరిజన యూనివర్శిటీలు ఏర్పాటుకు తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బోయ వాల్మీకులను ఎస్టీల్లో చేర్చడాన్ని ఉపసంహరించుకోవాలని, విశాఖకు రైల్వేజోన్ కావాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. పలు గిరిజన గ్రామాల్లో సీపీఐ, సీపీఎంతో పాటు, గిరిజన సంఘాలు ఆధ్వర్యంలో ప్రదర్శనలు నిర్వహించి తమ డిమాండ్లపై నినాదాలు చేశారు.ఆయా కార్యక్రమాల్లో ఉభయ కమ్యూనిస్టు పార్టీలకు చెందిన నాయకులుతో పాటు, గిరిజనులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

శ్రీదేవి గురించి చెప్పిన బోనీ కపూర్

(మొదటిపేజీ తరువాయి)

అభిమానుల్లో అనుమానాలు పోలేదు. తొలుత గుండెపోటుతో చనిపోయారన్నారు. ఆ తర్వాత హోటల్ గదిలోని బాత్‌టబ్‌లో పడి మృతిచెందారని ధృవీకరించారు. అయితే ఆ రోజు రాత్రి శ్రీదేవి ఉన్న గదిలో ఏం జరిగింది? తదితర విషయాలను ఆమె భర్త బోనీకపూర్ తన స్నేహితుడు, సినీ విశ్లేషకుడు కోమల్ నహతాకు వివరించారట. ఈ విషయాలన్నీ కోమల్ తన బ్లాగ్‌లో రాశారు. 'దుబాయ్‌కి ప్లాన్ చేసుకుని వెళ్లాలనుకోలేదు. మోహిత్ పెళ్లయ్యాక జాన్వి(పెద్ద కూతురు)కు దుస్తులు కొనడానికి శ్రీదేవి కొన్ని రోజులు దుబాయ్‌లోనే ఉంటానంది. దాంతో నాకు లఖ్‌నవూలో నుండి ఇండియా వచ్చేశాను. ఫిబ్రవరి 24న ఉదయం శ్రీదేవి నాకు ఫోన్ చేసింది. నన్ను చాలా మిస్సవుతున్నానని చెప్పింది. అదే రోజు సాయంత్రం నేను దుబాయ్ వస్తున్నట్లు శ్రీదేవికి చెప్పలేదు. అయితే శ్రీదేవికి ఒంటరిగా ఉండే అలవాటు లేదు. అందుకే 'తొందరగా దుబాయ్‌కి బయలుదేరు డాడీ' అని జాన్వి నాకు చెప్పింది.' 'ఫిబ్రవరి 24న సాయంత్రం 6.20 గంటల సమయంలో దుబాయ్ చేరుకున్నాను. అయితే శ్రీదేవికి సర్‌ప్రైజ్ ఇద్దామనుకుని నా లగేజీని కాస్త లేటుగా గదిలో పెట్టమని బెల్‌బాయ్‌కి చెప్పాను. నా వద్ద ఉన్న డూప్లికేట్ తాళం చెవితో గది తలుపు తీశాను. శ్రీదేవి నన్ను చూసిన సంతోషంతో ఆలింగనం చేసుకుంది.

పోలీసుల చెలగాటం... డాక్టర్‌కు ప్రాణ సంకటం

(మొదటిపేజీ తరువాయి)

(జనరల్ సర్జరీ) సీటు వచ్చింది. అయినా భాస్కర్‌ను శ్రీ లక్ష్మి విడిచిపెట్టలేదు. రోజుకు 20 నుంచి 30 కాల్స్, ఫోన్ ఆన్సర్ చేయకపోతే వంద వరకూ మిస్సిడ్ కాల్స్ చేస్తుండడంతో 2014 సెప్టెంబర్ లో తిరుపతి వెళ్ళి ఆ కళాశాల ప్రొఫెసర్ అండ్ అప్పటి జనరల్ సర్జరీ డిపార్ట్‌మెంట్ హెచ్.ఒ.డి ఎన్.వి. రమణయ్యను కలసి, "మీ స్టూడెంట్ ఇలా చేస్తూ నన్ను ఇబ్బంది పెడుతోంది" అని భాస్కర్ ఫిర్యాదు చేశాడు. ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ లేకపోవడంతో ఫోన్లోనే ఈ విషయాన్ని ఆయన దృష్టికి కూడా తీసుకువచ్చారు. అయినా వాళ్ళు పట్టించుకోలేదు. దీంతో శ్రీ లక్ష్మి మరింత అక్కసు పెంచుకుంది. భాస్కర్ ను తన గుప్పెట్లో పెట్టుకోవాలంటే 'మైండ్ గేమ్' మొదలు పెట్టడం తప్పదని గ్రహించింది. వెంటనే ప్లాన్ రెడీ అయింది. తన చెల్లిలి భర్త నిక్కదుల నరేంద్ర తో కలసి ఫేస్‌బుక్‌లో డాక్టర్ భాస్కర్ పేరు మరియు ఫొటో తో నాలుగు దొంగ అకౌంట్లు ప్రారంభించారు. భాస్కర్ పోస్ట్ చేస్తున్నట్టే రోజు మెస్సేజీలు, పోస్ట్‌లు పెట్టేవారు. ఇదంతా శ్రీలక్ష్మి వెనుక నుండి నడిపించింది. అంతేకాదు 'డాక్టర్ భాస్కర్‌తో పెళ్ళి కూడా అయింది' అని కూడా పోస్టు పెట్టారు. ఇది ఎలాగో తెలుసుకొని డాక్టర్ భాస్కర్ ఇక్కడి విశాఖ మహారాణి పేట పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేసారు. దీన్ని సైబర్ పోలీసు స్టేషన్‌కు రిఫర్ చేశారు. అయితే అక్కడ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ సత్యనారాయణ కేసును దర్యాప్తు చేసారు. ఇదిలా ఉండగా ఐ.పి.ఎస్. అధికారి, అప్పటి తిరుపతి జిల్లా ఎస్.పి. గోపీనాథ్ జెట్టి సారధ్యంలో ఒక తప్పుడు ఫిర్యాదును సిద్దం చేసి శ్రీ లక్ష్మి ఒక తప్పుడు కేసును భాస్కర్ పై బనాయించింది. 2015 జనవరి లో చిత్తూరు ఎస్.పి గోపీనాధ్ జెట్టి పంపించారని చెప్పి తిరుపతి స్పెషల్ బ్రాంచి సబ్ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్ విశాఖ వచ్చి డాక్టర్ భాస్కర్‌ను తిరుపతి తీసుకెళ్ళడానికి ప్రయత్నించారు. అయితే అప్పటికే ఈ కేసు పూర్వపరాలు విశాఖ పోలీసులకు తెలుసు గనుక భాస్కర్ ఇక్కడి పోలీసు అధికారులను సహాయం కోసం సంప్రదించారు. అయితే సైబర్ క్రైమ్ సత్యనారాయణ, ఏడీసీపీ వరదరాజులతో భాస్కర్ మాట్లాడినా ఉపయోగం లేకపోయింది. ఎస్.పి పిలిస్తే వెళ్ళాల్సిందే అంటూ వరదరాజులు చెప్పారు. అంతేకాదు "వెళ్ళి మీ నిర్ధోషిత్వం నిరూపించుకోండి" అని ఉచిత సలహా కూడా ఇవ్వడంతో భాస్కర్ నిస్సహాయ స్థితిలో పడిపోయారు. ఎటువంటి కేసునూ రిజిష్టర్ చేయకుండా 2015 జనవరి 19న అనధికారికంగా తిరుపతి తీసుకెళ్ళిపోయారు. అక్కడకు వెళ్ళిన తరువాత 20వ తేదీన శ్రీ లక్ష్మి ఇచ్చినట్టు ఒక రివర్స్ ఫిర్యాదును నమోదు చేశారు.

భాస్కర్‌ను విద్యాసాగర్, ఎస్పీ గోపీనాథ్ జెట్టి ఆఫీసుకు తీసుకువెళ్ళారు. బయలు దేరడానికి ముందే ఎస్పీకి ఫోన్ చేసి "నేను ఎందుకు రావాలి" అని అడిగితే, "ఒక సారి రండి మాట్లాడి పంపించివేస్తాము" అని ఎస్.పి చెప్పాడు. కానీ వాళ్ళతో తిరుపతి ఎస్.పి కార్యాలయానికి వెళ్ళిన తరువాత రాత్రి తొమ్మిది గంటల వరకూ కూడా ఎస్పీ లోనికి పిలవలేదు. ఆ సమయంలోనే రాచూరి శ్రీలక్ష్మి, నిక్కదుల నరేంద్ర, ఇద్దరు పెద్దలు వచ్చారు. స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ నర్సప్ప ముందు కూర్చోబెట్టి తాము చెప్పినట్టు ఎస్పీని అడ్రసు చేస్తూ ఒక పత్రం రాయమని తీవ్రమైన ఒత్తిడి తీసుకువచ్చారు. దానిమీద సంతకం చేయకపోతే ఎర్ర చందనం స్మగ్లర్ అనీ కేసు పెట్టేస్తాం అని బెదిరించారు. శ్రీలక్ష్మి చేసిన రివర్స్ ఫిర్యాదు ప్రకారం అన్ని తప్పులూ తానే చేశానని, రాయించుకున్నారు. విశాఖలో శ్రీ లక్ష్మి మీద పెట్టిన కేసు ఉపసంహరించుకోవాలని భాస్కర్ పై తీవ్రమైన ఒత్తిడి తీసుకువచ్చారు. తలపై తుపాకీ పెట్టి వాళ్ళకు కావలసినట్టు రాయించుకొని భాస్కర్ చేత బలవంతంగా సంతకాలు పెట్టించుకొని తిరిగి విశాఖ తీసుకొచ్చి వదిలేశారు.

తిరిగి విశాఖ వచ్చిన తరువాత అప్పటి పోలీసు కమీషనర్ అమిత్ గార్గ్‌ను కలిసి జరిగిందంతా తెలిపినా ఏమీ ఉపయోగం లేకపోయింది. ఇక 2015 ఫిబ్రవరి ఒకటవ తేదీన, రెండవ తేదీన సబ్ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్ మరల టెలిఫోన్లో భాస్కర్‌ను బెదిరిస్తూనే వచ్చాడు. నీకింకా బుద్దిరాలేదా దయలతచి ప్రాణాలతో వదిలేసాము. శ్రీ లక్ష్మి, ఆమె బంధువులపై పెట్టిన కేసును ఉపసంహరించుకుంటావా? లేదా అంతు తేల్చమంటావా? అంటూ బెదిరించడం మొదలుపెట్టాడు. ఇక ఈ బెదిరింపులకు తట్టుకోలేక మహారాణి పేట పోలీసు స్టేషన్‌లో విద్యాసాగర్ పై భాస్కర్ ఫిర్యాదు చేశారు. అప్పటి సి.ఐ మల్లిఖార్జున్ ఎఫ్.ఐ.ఆర్ వేస్తానని చెప్పి రశీదు ఇచ్చి పంపేశారు. కేసును ఏ మాత్రం దర్యాప్తు చేయకుండా దగా చేస్తూ వచ్చారు. డాక్టర్ భాస్కర్ వీటన్నిటికి లొంగక పోవడంతో మరియు విశాఖ పోలీసులు కూడా తిరుపతి పోలీసులకు సహకరిస్తుండడంతో 2015 ఏప్రిల్ 30న తిరుపతి అర్బన్ ఎస్.పి గోపీనాథ్ జెట్టి డాక్టర్ భాస్కర్ మీద ఏకంగా నిర్భయ కేసును తిరుపతి మహిళా పోలీసు స్టేషన్‌లో భాస్కర్‌పై బనాయించారు.

దీంతో ఆగక మే 22వ తేదీన తిరుపతి స్పెషల్ బ్రాంచి ఎస్.ఐ విద్యాసాగర్ ఇద్దరు కానిస్టేబుళ్ళతో వచ్చి భాస్కర్‌ని ఆ వంకతో అనధికారికంగా అరెస్టు చేయడానికి ప్రయత్నించారు. భాస్కర్ హాస్పటల్ స్టాఫ్ జమాల్‌ను టెర్రాస్ మీదికి తీసుకెళ్ళి డాక్టర్ భాస్కర్ ఆచూకీ చెప్పాలని బెదిరించారు. ఆ సమయంలో డాక్టర్ తన పుట్టినరోజు సందర్భంగా తన బంధువుల ఇంట్లో వున్నారు. అక్కడికి విద్యాసాగర్ బృందం చేరిపోయి ఆ ఇంట్లోకి బలవంతంగా దూరిపోయి భాస్కర్‌ను పట్టుకున్నారు. అదే సమయంలో ఏమిటీ అన్యాయం అంటూ భాస్కర్ బంధువులు 100కి టెలిఫోన్ చేసారు. అయినా స్థానిక త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారు వచ్చి తిరుపతి పోలీసులకు వంతపాడారు. మరల భాస్కర్‌ను తిరుపతి తీసుకెళ్ళారు. ఎస్.పి. గోపీనాథ్ జెట్టి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని స్వయంగా తానే కేసును నడిపించారు. భాస్కర్‌ను అరెస్ట్ చేశారు. ఆ రాత్రికి రాత్రే అడిషనల్ సివిల్ జడ్జి ఇంటికి బలవంతంగా తీసుకెళ్ళి రిమాండ్ ఇప్పించారు. అంతేకాకుండా ఎస్.పి స్వయంగా జైలు సూపరింటెండుతో మాట్లాడి రాత్రికి రాత్రే జైలు తలుపులు తీయించి భాస్కర్‌ను జైళ్ళో పెట్టించాడు. తన స్థాయి కూడా మరిచిపోయిన యువ ఎస్.పి. గోపీనాథ్‌కు సదరు శ్రీ లక్ష్మి విషయంలో ఎందుకు అంత ఆసక్తితో, ఎందుకు అంత అత్యుత్సాహం ప్రదర్శించారో అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. భాస్కర్‌కు తీరని అన్యాయం జరుగుతుందని అక్కడ కొంతమంది పోలీసులే జరుగుతున్న అన్యాయాన్ని గ్రహించి బెయిల్ కోసం ఒక అడ్వకేట్‌ను సూచించడం జరిగింది. రెండోరోజు బెయిల్ కోసం కోర్టులో వాదనలు జరుపుతున్నపుడు డీఎస్పీ స్వయంగా హాజరవడం పట్ల జడ్జి, ఆశ్చర్య పోయారు కూడా. సాధారణంగా ఇటువంటి కేసుల్లో డీఎస్పీ స్థాయి అధికారులు హాజరుకారు. ఇదే విషయాన్ని జడ్జి ప్రశ్నిస్తే ఎస్.పి ఆదేశాలపై వచ్చానని డీఎస్పీ చెప్పారు. అయితే ఎస్పీనే రమ్మనమని జడ్జి ఆదేశించారు. కానీ భయపడి ఎస్పీ హాజరు కాలేదు. దీంతో జడ్జికి మొత్తం కథ అర్థమైపోయింది. బెయిలును అడ్డుకోడానికి ఎస్.పి. గోపీనాద్ జెట్టి గ్యాంగ్ తీవ్రంగా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. చచ్చీ చెడి ఎలాగో భాస్కర్ బెయిల్‌పై బయట పడ్డారు. ఇక ఇక్కడ ఒక్క క్షణం కూడా వుండొద్దు, వెంటనే ఏ వాహనం దొరికితే అందులో తక్షణం ఇక్కడి నుంచి వెళ్ళిపోండి అంటూ అక్కడ కొంతమంది హితవు చెప్పడంతో బతుకు జీవుడా అంటూ భాస్కర్ విశాఖ చేరారు.

సంచలన వార్తాపత్రిక
లీడర్
విశాఖపట్నం సిటీ
విశాఖపట్నం
సోమవారం 5-3-2018

సాగర్‌నగర్ సన్‌రేస్ దాబాలో అగ్నిప్రమాదం

దాబాగార్డెన్స్, న్యూస్‌లీడర్: సాగర్‌నగర్ సన్‌రేస్ దాబాలో ఆదివారం అగ్నిప్రమాదం జరిగింది. చెత్త తగలబడుతుండగా గాలికి నిప్పురవ్వలు ఎగిరి దాబాలో గడ్డితో వేసిన గుడిసెలపై పడటంతో అగ్నిప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. అగ్నిప్రమాదంలో 3 లక్షలు ఆస్తినష్టం జరిగినట్టు దాబా నిర్వాహకులు వెల్లడించారు. అగ్నిమాపక శకటాలతో మంటలను అదుపుచేశారు. అదుపులోకి మంటలు రాకపోవడంతో అగ్నిమాపక సిబ్బంది అతికష్టంపై మంటలను ఆర్పివేశారు

పిచ్చుకల సంతతి పెరగడానికి కృషి

డాక్టర్ సూరపనేని విజయకుమార్


మాట్లాడుతున్న ఏయూ వీసీ ఆచార్య నాగేశ్వరరావు

దాబాగార్డెన్స్, న్యూస్‌లీడర్ : ప్రపంచ పిచ్చుకల పరిరక్షణా రోజును పురస్కరించుకుని పిచ్చుకల సంతతి పెరగడానికి కృషి చేద్దాం అన్న నినాదంతో పిచ్చుకల పరిరక్షణ కార్యక్రమాన్ని డాక్టర్ సూరపనేని విజయకుమార్ అధ్యక్షతన పర్యావరణ మార్గదర్శి వైశాఖి సంస్థ ప్రజా చైతన్య కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం విశాఖపట్నం పౌరగ్రంథాలయంలో ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పర్యావరణ మార్గదర్శి వైశాఖి టీమ్ నగరంలో పిచ్చుకలు కనిపిస్తున్న ప్రాంతాలను చాలా వరకూ గుర్తించిందని తెలిపారు. అలాగే నగరంలోని వివిధ పాఠశాలల్లోనూ, కళాశాలల్లోను ఈ నెల 20వ తేదీ వరకూ పిచ్చుకల పరిరక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచేసిన ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జి. నాగేశ్వరరావు మాట్లాడుతూ మనం ప్రస్తుతం తింటున్న ఆహారం పూర్తిగా పెస్టిసైడ్స్, యాసిడ్స్ తదితర రసాయనా లతో నిండిపోయాయి. కాబట్టి ఆ రసాయనాల వల్ల నానాటికీ పిచ్చుకల సంతతి తగ్గిపోతుందని అన్నారు. మన వంతుగా పిచ్చుకల పరిరక్షణలో భాగంగా ఇళ్ళ ల్లో పిచ్చుక గూళ్ళు ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు. భారత ఇంధన వనరులు, ఆర్థిక శాఖ విశ్రాంత కార్యదర్శి శర్మ, ఏయూ ప్రొఫెసర్ సి. మంజులత ఇంటాక్ ప్రతినిధి రాణిశర్మ సామాజిక కార్యకర్త రామగోపాల్ పబ్లిక్ లైబ్రరీ సెక్రెటరీ డి.ఎస్. వర్మ, రిటైర్డ్ టీచర్ పి. లలిత, ఆరాధనా హోమ్ బాలబాలికలు, గ్రీన్ సోల్జర్స్, పర్యావరణ మార్గదర్శి వైశాఖ ప్రతినిధులు జె. రాజేశ్వరి, కె. రోహిణి, మున్నీషా, కె. మల్లిక, బి. దుర్గాదేవి, పుష్పా, శ్యామలా తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమం మరింత ఉధృతం చేస్తాం

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింగరావు


దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న సీఐటీయూ నేత నర్సింగరావు

దాబాగార్డెన్స్ , న్యూస్‌లీడర్ : విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు సమస్యలు పరిష్కరించక పోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని సిఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్ నర్సింగ్‌రావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జీవిఎంసీ గాంధీ విగ్రహం దరి విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరుగుతున్న రిలేనిరహార దీక్షలు ఆదివారం రాష్ట్రవ్యాప్త ఉద్యమంలో భాగంగా నిరహార దీక్షకు దిగారు. ఈ కార్యక్రమానికి సిఐటీయూ, ఏఐటీయూసీ మద్దతు ఇచ్చారు. ఈ సందర్భంగా నర్సింగ్‌రావు మీడియాతో మాట్లాడుతూ గత 12 రోజు లుగా నిరవధిక సమ్మె చేస్తున్నారని. అయిన ప్రభుత్వం కార్మిక సంఘాల ఐక్య వేదికను చర్చలకు పిలవకుండా కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. ప్రభుత్వ వైఖరిని నిరశిస్తూ విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల న్యాయమైన డిమాండ్లు సమానపనికి సమానవేతం చెల్లించాలని, థర్డ్‌పార్టీ విధనాన్ని, ఫీస్‌రేట్ పద్ధతిని రద్దుచేయాలని, ప్రమాదంలో చనిపోయిన కార్మిక కుటుంబాలకు 20లక్షల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని, ఉద్యోగభద్రత కల్పించాలని కోరుతూ ఈరోజు జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరవధిక నిరాహారదీక్షలను సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నం "సింగరావు ప్రారంభించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సమానపనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత, పీసరేటు, థర్డ్‌పార్టీ విధానం రద్దు, దశలవారీగా కాం ట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం, ప్రమాదాల్లో మరణించిన వారికి రూ.20 లక్షల నష్ట పరిహారం వంటి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరిం చారన్నారు. ఈ సమస్యలపై దీర్ఘకాలంగా ఆందోళన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం స్పందిచటం లేదన్నారు. పక్క రాష్ట్రాలైన తెలంగాణ, తమిళనాడులో విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను సంస్థలో విలీనం చేయడం జరిగిందని, మన రాష్ట్రంలో దీనికి భిన్నంగా కాంట్రాక్టు కార్మికుల పట్ల తీవ్రమైన నిర్లక్ష్యధోరణితో ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వం డిమాండ్ల పరిష్కరించేవరకు పోరాటాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ దీక్షల్లో సీఐటీయూ నగర అధ్యక్షులు ఆర్.కె.ఎస్.వి.కుమార్, పి.మురళి, వి.వి.స్వామి, జి.సంతోష్ , ఎన్.సత్యానందకుమార్ ఆనందపురం, సిహెచ్.సుబ్బారావు, ఎం.ఎ.షరీఫ్, సిహెచ్.శ్రీను, బి.దు ర్గాప్రసాద్, పి.జగదీష్ కశింకోట, వాసు అనకాపల్లి నిరాహారదీక్షలో కూర్చున్నారుఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర కార్యదర్శి పి.మణి, జి.పోలేశ్వ రరావు, ఎం.సూరీడు, డి.అప్పలరాజు, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు పడాల రమణ, రెహ్మాన్, మీటర్ రీడర్స్ యూనియన్ నాయకులు వి.వి.సత్యన్నారాయణ, టి.పరుశురాం, ఎస్.శ్రీహరి, రాము, రాజు, సంతోష్, ప్రవీణ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎంలలో నగదు కొరత తీర్చాలి

భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామమూర్తి



నిరసన తెలుపుతున్న నాస్తికులు

దాబాగార్డెన్స్, న్యూస్‌లీడర్: ఏటీఎంలలో నగదు కొరత తీర్చాలని భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు టి. శ్రీరామమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు జీవిఎంసీ గాంధీ విగ్రహం దరి ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 2016 నవంబర్ 8న నోట్ల రద్దు చేసినప్పటి నుండి ప్రజలు నగదు కొరతను ఎదర్కొంటున్నారని అన్నారు. భారతీయ రిజర్వు బ్యాంకు డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించాలని తలంచి రాష్ట్రానికి నగదు సరఫరా తగ్గించిందన్నారు.దీనివలన సామాన్యులు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. డిపాజిట్ ఖాతదార్లకు రక్షణ కల్పించి, కార్పొరేట్ బడా బాబులు ఎగ్గొట్టిన కోట్లాది రూపాయాల ప్రజలను సొమ్మును వెనక్కి తీసకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వై.నూకరాజు, విజ్ఞానంద్, రాంప్రభు, చలం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడిలో 186 కిలోల గంజాయి పట్టివేత

గాజువాక, న్యూస్ లీడర్ అక్రమార్కులు వక్రమార్గంలో నిర్వహిస్తున్న అక్రమ వ్యాపారాలను అంతే స్థాయిలో పోలీసులు వలపన్ని వారిని కటకటాల వెనక్కి నెట్టుతున్నారు. శనివారం ఇదే తరహాలో అగనంపూడి టోల్ గేటు వద్ద మాటుకాసిన టాస్క్‌ఫోర్స్ అధికారులు వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న 186 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోవడమేకాకుండా గంజాయిని తరలిస్తున్న వాహనాన్ని దానికి ఎస్కార్టుగా వెనక వెలుతున్న మరోవాహనాన్ని పోలీసులు స్వాదీనం చేసుకున్నారు. ఒడిస్సా నుండి విశాఖ మీదుగా ఖాగ్మాండ్ తరలించేందుకు గంజాయిని బొలారో వాహనంలో తీసుకు వస్తుండగా టోల్ గేటు వద్ద సిటి టాస్క్‌ఫోర్స్ దాడులు నిర్వహించి స్వాదీనం చేసు కొన్నారు. దాడుల్లో దొరికిన 186 కిలోల గంజాయిని, నిందుతులను దువ్వాడ పోలీసులకు అప్పగించారు. దువ్వాడ పోలీసులు వారిని విచారిస్తున్నారు.


గంజాయితో పట్టుబడ్డ నిందితులు

విమానానికి తప్పిన పెను ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. అప్పటికే సిద్ధంగా ఉన్న ఎయిర్‌పోర్టు సిబ్బంది.. సిటీలింక్ విమానంలో ఇంధనాన్ని నింపారు. ఇక అది టేకాఫ్ కోసం రన్‌వేపైకి కూడా వెళ్లింది. అంతలోనే ఇంధనం లీకవుతున్నట్లు సిబ్బంది గుర్తించారు. అంతే, క్షణం ఆలస్యం కాకుండా విమానాన్ని నిలిపేయాలని పైలట్‌కు ఆదేశాలు వెళ్లాయి. ఎండకు సైతం భగభగమండే గుణమున్న విమాన ఇంధనం.. రన్‌వేపై ధారలా కారిపోవడంతో ఎయిర్‌పోర్టు ప్రాంగణంలో కలకలం చెలరేగింది. తక్షణమే ఫైరింజన్లను రప్పించి, రన్‌వే మొత్తాన్ని శుభ్రంగా కడిగేశారు. సాంకేతిక నిపుణులు విమానంలో లీకేజీ లోపాన్ని సరిచేశారు. ఒకవేళ ఆ విమానం టేకాఫై ఉంటేగనుక పెనుప్రమాదమే జరిగి ఉండేదని ఎయిర్‌పోర్టు అధికారులు చెప్పారు.దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

త్రీటౌన్ స్టేషన్‌లో నిందితుడి సన్నిహితుల హడావిడి

పోలీసులతో వాగ్వివాదం

విశాఖపట్నం, న్యూస్‌లీడర్: అక్రమాస్తుల కేసులో అవినీతి నిరోధకశాఖాధికారులకు అడ్డుగా దొరికిపోయిన మల్కాపురం క్లస్టర్ రెవెన్యూ అధికారి (వీఆర్వో) సంజీవ్‌కుమార్ సన్నిహితులు ఆదివారం ఉదయం మూడోపట్టణ పోలీస్‌స్టేషన్‌లో హడావిడీ చేశారు. ఏసీబీ అధికారులు శనివారం మల్కాపురంలో సంజీవ్ కుమార్ గృహంతో పాటు ఆయన బంధువుల ఇళ్లల్లో దాడులు నిర్వహించిన విషయం విధితమే. ఈ సందర్భంగా భారీగా అక్రమాస్తులు కూడబెట్టుకున్నట్టు ఏసీబీ దర్యాప్తులో తేలింది. ఈమేరకు ఇంకా దర్యాప్తు కొనసాగుతునే వుంది. ఈ నేపథ్యంలో రెడ్‌హ్యాండ్‌గా పట్టుబడ్డ సంజీవ్‌కుమార్‌ను అరెస్టు చేసి మూడోపట్టణ పోలీసులకు అప్పగించారు. ఈమేరకు సంజీవ్ త్రీటౌన్ స్టేషన్‌లో పోలీసుల అదుపులో వున్నారు.అయితే ఆదివారం ఉదయం సంజీవ్‌ను పరామర్శించేందుకు ఆయన స్నేహితులు నలుగురు స్టేషన్‌కు వచ్చారు. ఈ నేపథ్యంలో వారికి, పోలీసులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో స్టేషన్‌లో సంజీవ్ స్నేహితులు అతి చేసినట్టుగా పోలీసులు ఆరోపిస్తున్నారు. వీరిపై కేసు నమోదుచేసేందుకు త్రీటౌన్‌పోలీసులు సిద్ధమౌతున్నట్టు తెలియవచ్చింది.

రోడ్డు రవాణా సవరణ బిల్లుకు

వ్యతిరేకంగా 6న దేశవ్యాప్త సమ్మె


ఆటోజాతలో మాట్లాడుతున్న రెహమాన్

దాబాగార్డెన్స్,న్యూస్‌లీడర్: కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన రోడ్డు రవాణా సవరణ బిల్లుకు వ్యతిరేకంగా మార్చి6న జరగనున్న దేశవ్యాప్త ఆందోళనలో అన్నిరకాల యాజమానులు పాల్గొనాలని అఖిలపక్ష ఆటో మోటర్ కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు ద్వారకాబస్‌స్టేషన్ దరి ఆదివారం ఆటో జాతాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసి నాయకులు ఎస్.ఎ. రెహ్మాన్ మాట్లాడుతూ సవరణ బిల్లువలన టూ వీలర్ నుండి అన్ని రకాల వాహనాల యజమానులను, డ్రైవర్లను జైలుపాలు, భారీఫైన్లతో మన కష్టార్జితాన్ని లూటీ చేసే విధానాన్ని అందరం వ్యతిరేకించాలన్నారు. మార్చి 5 నుండి జరగబోయే పార్లమెంట్ సెషన్‌లో ఆమోదానికి పెట్టబోతున్నారని, ఈ బిల్లును తక్షణమే రద్దుచేసి రోడ్డు రవాణా రంగానికి రక్షణకల్పించాలని కోరారు. పెట్రోల్, డీజిల్‌ను జిఎస్‌టీ పరిధిలోకి తేవాలని, ట్రాన్స్‌పోర్టు కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్, పెన్షన్‌తో కూడిన సమగ్ర చట్టం చేయాలని కోరుతూ దూశవ్యాప్త ఆందోళనచేయాలని అన్ని ట్రాన్స్‌పోర్టు సంఘాలు, ఫెడరేషన్లు పిలుపునిచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు జి. వామనమూర్తి, కె. సింహాద్రి, సిఐటీయూ నాయకులు డి. అప్పలరాజు, కె. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాబు... దుబారా

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రం కౌంటర్ కూడా ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. అప్పులన్నీ స్వప్రయోజనాలకు తప్ప, ప్రజలకు మేలు జరగలేదని దుయ్యబట్టారు. గతంలో యావత్తు భారతదేశంలో మంచి పరిపాలన ఆంధ్రప్రదేశ్‌లో వుండేదని, అటువంటిది ఆంధ్రప్రదేశ్ పాలన దానికి వ్యతిరేకంగా వుందన్నారు. ప్రభుత్వం ఈ నెల ఒకటవ తేదీ నాటికి 4లక్షల 40వేలు గృహాలు ఏర్పాటు చేశామన్నారని, అయితే ఎవరికిచ్చారో బహిర్గతం చేయాలని రామచంద్రయ్య డిమాండ్ చేశారు. "ఓటు కు నోటు" కేసులో బాబు రెడ్‌హ్యాండ్‌గా దొరికిపోవడం వలనే కేంద్రం నుండి రాష్ట్రానికి రావల్సిన ప్రయోజనాలపై అడగలేకపోతున్నారని ఆరోపించారు. చంద్రబాబునాయుడు తన రాజకీయ అనుభవం 40 సంవత్సరాలు దాటిన సందర్భంగా ఈ మధ్య చాలా పత్రికల్లో తన అనుభవం గురించి వివరిస్తూ తన గొప్పలు మాత్రమే చెప్పుకొని చీకటి కోణాల గురించి ఎక్కడా ప్రస్తావించకపోవడం శోచనీయమన్నారు. గతంలో ఎన్.టి.రామారావు కుటుంబసభ్యులను మచ్చిక చేసుకోవడం కోసం శాసనసభ్యుడు కాకపోయినా హరికృష్ణకి మంత్రి పదవి ఇచ్చారని, కానీ ఇప్పుడు శాసనసభ్యులైనా బాలకృష్ణకు మంత్రి పదవి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. అదేవిధంగా జూనియర్ ఎన్‌టిఆర్‌ను గతంలో అన్ని విధాలుగా ఉపయోగించుకొని ఈరోజు ఏకాకి చేశారని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక హోదా సమస్యపై ప్రతిపక్షాలు,మిగిలిన రాజకీయ పార్టీలపై విమర్శలు మానుకొని ఎంతో శక్తివంతమైన చంద్రబాబునాయుడు ఢిల్లీలో అమరణ దీక్షలో పాల్గొంటే ప్రత్యేక హోదా సాధించుకోవచ్చని రామచంద్రయ్య హితవు పలికారు. చంద్రబాబునాయుడు ప్రతిపక్షంలో ఉండగా కాంగ్రెస్ పార్టీ పాలనలో జరిగిన అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేసేవారని, దానికనుగుణంగా కాంగ్రెస్ పార్టీ గతంలో శ్వేతపత్రం విడుదల చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా ఇప్పుడు చంద్రబాబునాయుడు ప్రభుత్వం కూడా గత నాలుగేళ్ళుగా జరిగిన అభివృద్ధిపై సత్తా వుంటే శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు.కేంద్ర ప్రభుత్వం గతంలో ప్రత్యేక హోదా ఇచ్చిన రాష్ట్రాలకు చట్టం చేసి ప్రత్యేక హోదా ఇవ్వాలని అలాంటప్పుడు మన రాష్ట్రానికి చట్టం తేవాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వానికి, మన రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చేందుకు చిత్తశుద్ధి లేకపోవడం వల్ల కుంటిసాకులు చెబుతోందని తెలియజేశారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌తో సహా అందరూ ప్రత్యేక హోదా కోసం పోరాటం చేస్తున్నప్పటికీ , ముఖ్యమంత్రి చంద్రబాబు ఎందుకు పోరాటం చేయలేదని రామచంద్రయ్య ప్రశ్నించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు బొలిశెట్టి సత్యన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మాణిక్యం కన్నా మనీ మిన్న

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలు ఏ కారణంతో ఆయన సర్కారును కూలదీశారన్నది ఏ ఒక్కరికి మింగుడు పడడం లేదు. నేటి రాజకీయాల్లో అలాంటి నిజాయతీ పరులు ప్రభుత్వాన్ని నడపలేరని భావించారో ? లేదా అధికారపార్టీకి దాసోహమై అటువైపుగా ఓటర్లు అడుగులు వేశారో ? అన్నది ఇప్పుడు సవాలక్ష ప్రశ్నలకు తావిస్తోంది.

అఫిడవిట్లు చెబుతున్న ఆయన ఆర్థిక స్థోమత

గడిచిన ఎన్నికల్లో మాణిక్ సర్కార్ తన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న వాటిని పరిశీలిస్తే ఆయన ఆర్థిక స్థోమత అర్ధమౌతుంది.1998లో తొలిసారి జరిగిన ఎన్నికల్లో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఎం) అధికార పగ్గాలు చేసింది. ఆ సందర్భంలో అత్యంత ఉత్తమమైన నాయకుడిగా, సమర్ధుడుగా గుర్తించి ఆ పార్టీ మాణిక్‌ను ముఖ్యమంత్రిగా ఎన్నుకుంది. అయితే ఆయన ముఖ్యమంత్రి పదవి చేపట్టకముందే వున్నంత నగదు కూడా పదవి చేపట్టాక ఆయన వద్దలేకపోగా, మరింత నగదు తరగడం గమనార్హం. అవేవో లక్షల్లో అంటే అక్షరాల 'తప్పు'లో కాలేసినట్టే. అన్నీ వేలు, వందల్లోనే. 2013 అసెంబ్లీ ఎన్నికల వేళ... ఆయన ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్‌లో.. తనవద్ద కేవలం రూ. 9,700 మాత్రమే వున్నట్టు పేర్కొన్నారు. ఆ రోజుల్లోనే దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు కంటే అత్యంత నిరుపేద ముఖ్యమంత్రి మాణిక్ అని సర్వత్రా గుర్తించారు. తాజాగా జరిగిన ఎన్నికల్లో మాణిక్‌సర్కార్ ధన్‌పూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల సంఘానికి ఆయన వెల్లడించిన ఆస్తులు వివరాలు పరిశీలిస్తే ఖంగుతినాల్సిందే. తన బ్యాంకు బ్యాలెన్స్ అక్షరాల రూ.1520 రూపాయలు మాత్రమే. అంటే 2013-2018 మధ్య కాలంలో రూ.8180 తరిగిపోవడం గమనార్హం. మరో విశేషం ఏమిటంటే ఆ ఐదేళ్లకాలంలో మాణిక్ సర్కార్ ముఖ్యమంత్రిగా పనిచేశారు.

సీఎం వేతనాన్ని దాచుకోలేదు

పేదరికాన్ని అనుభవిస్తున్నప్పటికీ ముఖ్యమంత్రిగా తనకు వస్తున్న వేతనాన్ని కూడా కనీసం ఆయన స్వంత ఖర్చులు కోసం ఉంచుకోలేదు. 69 ఏళ్ల వయస్సు కలిగిన మాణిక్ సర్కార్ కనీసం తనకు కోసం తాను ఏమీ ఆలోచించలేదు. నెలావారీ తన వేతనం 26వేల 315 రూపాయలను సీపీఎం పార్టీ ఫండ్ కింద జమ చేశారు. తనకంటే ప్రతి నెల కేవలం తొమ్మిది వేల రూపాయలు మాత్రమే ముఖ్యమంత్రి హోదాలో ఆయన తీసుకోవడం గమనార్హం. మాణిక్ సర్కార్ సతీమణి పాంచాలి భట్టాచారీ రిటైర్డ్ ప్రభుత్వోద్యోగి. ఆమె చేతిలో మాత్రం 20వేల నగదు వున్నట్టు తెలుస్తోంది. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూపంలో వచ్చిన పన్నెండు లక్షల 15వేల రూపాయల నగదు ఆమె బ్యాంకు ఖాతాలో ఉంది.అంటే ఆరేళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన మాణిక్ సర్కార్ కంటే ప్రభుత్వశాఖలో ఉద్యోగం చేసి సంపాదించుకున్న ఆయన సతీమణి పాంచాలి భట్టాచారే ఆర్థికంగా బెటర్ అని తెలుస్తోంది.మాణిక్‌కు త్రిపుర రాజధాని అగర్తలలో కొద్ది పాటి స్థలం మాత్రమే ఉంది. అది కూడా ఆయన అన్నదమ్ములతో కలిపి కాస్తా వాటే మాత్రమే.

నిరాడంబర జీవనం

నేటి యుగంలో చిన్న పంచాయతీ వార్డు సభ్యుడు సైతం కనీసం బైక్ వుంటే గాని బయటకు రారు. పంచాయతీ సర్పంచ్ అంటే ఆయా గ్రామాల్లో ఓ చిన్నసైజు ఎమ్మెల్యేల్లా ఫీలౌతూ కనీసం స్కార్పియా, లేదంటే ఓ కారేసుకొని మరీ బయట హడావిడీ చేస్తారు. అదే మాణిక్ సర్కార్ విషయంలో మాత్రం పరిస్థితి వేరు దశాబ్దాల కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆయన ఏ రోజూ ఆడంబరాలకు పోలేదు. సామాన్య ప్రజలు కంటే అత్యంత నిరాడంబర జీవితాన్ని గడిపారు. ముఖ్యమంత్రి హోదాలో వున్నప్పటికీ కనీసం సెల్‌ఫోన్ కూడా ఆయన చేతిలో లేకపోవడం విశేషం.రాజధానిలో వుంటే రిక్షా, బయట ప్రాంతాలకు వెళ్లాలంటే రైల్వే జనరల్ కంపార్ట్‌మెంట్‌లోనే ఆయన ప్రయాణం సాగుతుంది. అటు ప్రభుత్వం సొమ్ము వృధా కాకుండా, ఇటు తాను ఆడంబరాలకు

ఎంత తేడా...

వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఎమ్మెల్యే కావాలంటే కోట్లాది రూపాయలు వెనకేసుకోవాలంటూ వ్యూహాత్మకంగా ఐదేళ్లు పాటు దోచుకుతింటున్న నేటి రోజుల్లో మాణిక్ వంటి నేతలు ఇంకా మిగిలే వున్నారా ? అన్న ప్రశ్నలు ఎదురౌతున్నాయి. ఒక పర్యాయం ఎమ్మెల్యే అయితే కనీసం ఐదు తరాలకు సరిపోయినంతగా వచ్చిపడిపోతాయన్నది అందరికీ తెలిసిందే. అదే ముఖ్యమంత్రి పదవి చేపట్టే వ్యక్తి పరిస్థితిని మరి వేరేగా చెప్పనవసరం లేదు. ఒక్కసారి ముఖ్యమంత్రి అయితే కనీసం పది తరాలు వరకు తరగని ఆస్తులు కూడబెట్టుకునే వెసులుబాటు వుందని దేశంలోని అనేక మంది ముఖ్యమంత్రులు నిరూపించారు కూడా. కొందరు తమ ఆశ ఎక్కువై వందలు, వేల కోట్ల రూపాయలు వెనకేసుకొని ప్రస్తుతం పలువురు మాజీ ముఖ్యమంత్రులు, వారి కుటుంబీకులు కోర్టులు చుట్టూ తిరుగుతున్న విషయం కూడా తెలిసిందే. వీరితో పోలిస్తే మాణిక్‌కు వారికి నక్కకి, నాగలోకానికి వున్నంత తేడా వుంది. ఆరు పర్యాయాలు ముఖ్యమంత్రిగా చేపట్టిన మాణిక్ వయస్సు మీరుతున్నా పైసా దాచుకోకపోవడం ఆయన దశాబ్దాల రాజకీయ చరిత్రకు సాక్షాత్కారంగా నిలుస్తోందనడంలో అతిశయోక్తి లేదు.

ఎందుకిలా...

అధికార దర్పణం...ధనప్రవాహం ఎదుట నీతి, నిజాయితీలు కొట్టుకుపోతాయన్నది త్రిపుర ఎన్నికలు రుజువు చేశాయి. కేంద్రంలో అధికార బీజేపీ ధాటికి... పాపం నిరుపేద తాజామాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ నిలవలేకపోయారని తెలుస్తోంది. తమ ఆరాధ్య నాయకుడిగా భావించి మాణిక్ ఆరు సార్లు అవకాశం ఇచ్చిన త్రిపుర ప్రజల్లో ఒక్కసారిగా ఈ మార్పు సవాలక్ష ప్రశ్నలకు తావిస్తోంది.ఆ రాష్ట్ర ప్రజలు, విపక్షాలే మాణిక్ నిజాయితీని ఎలుగెత్తి చాటున్నారు.నిష్పక్షపాతంగా, నిజాయితీగా,సమర్ధవంతమైన పాలన అందించగలిగిన మాణిక్ ఓటమి ఏ ఒక్కరికి మింగుడు పడడం లేదు. మోడీ పాచికలు ముందు మాణిక్ తలవంచకతప్పలేదని తెలుస్తోంది. ప్రజల్లో ఆకస్మిక మార్పు పట్ల అనేక అనుమానాలు కూడా వ్యక్తమౌతున్నాయి. పాపం.. పుణ్యం.. ఆ దేవుడికి ఎరుకగాని త్రిపుర సార్వత్రిక ఎన్నికల్లో నిజాయితీ ఓటమి చెందిందని మాత్రం దేశవ్యాప్తంగా చర్చ సాగుతోంది.

యాత కులస్థులను బీసీ ఏగా పరగణించాలి


దాబాగార్డెన్స్, న్యూస్‌లీడర్: కల్లుగీత కార్మికులను (యాతకులస్థులను) బీసీ ఏ గా పరిగణించాలని యాత సమైఖ్య సంక్షేమ సొసైటీ జిల్లా ప్రతినిధులు డిమాండ్ చేశారు. వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం బీసీ ఎ పరిగణించిందని, మండల కార్యాలయాల ద్వారా కుల ధృవీకరణ పత్రాలు ఇచ్చేదని, క్రమేపి యాత కులస్థులను నిర్లక్ష్యం చేస్తు బీసీ ఎ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులకు, జిల్లా అధికారులకు బీసీ ఎ గా పరిగణించాలని కోరుతూ వినతులు అందజేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు మేడిశెట్టి రమణ, ప్రధాన కార్యదర్శి పంపాన రాంబాబు, మహిళా నాయకురాలు కొల్లి సింహాచలం, పిల్లి రమణ, నాగల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పైడిమాంబకు ఆభరణాలు కానుక



సింహాచలం, న్యూస్‌లీడర్ : చినముషిరివాడ శాంతినగర్ వెలిసిన పుట్ట పైడిమాంబ అమ్మవారికి హేపీ ఇండియా సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు, సంఘ సేవకులు డాక్టర్ తాడి వెంకట సత్యనారాయణ, రామలక్ష్మి దంపతులు బంగారు ఆభరణాలు సమర్పించారు. అలాగే రెండునెలలకు సరిపడ పూజా సామగ్రి కూడా అందజేసారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిమంగళవారం అమ్మవారికి విశేషపూజలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆలయ అర్చకులు , తాడి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన


బీపీ,షుగర్ పరీక్షలు చేస్తున్న వైద్యులు

దాబాగార్డెన్స్,న్యూస్‌లీడర్: శ్రీ విఘ్నేశ్వర వాడ బలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం కొబ్బరి తోటలో ఉచిత బిపి,షుగర్ చెకప్ క్యాంప్ నిర్వహించారు. సంఘం గౌరవ అధ్యక్షుడు గరికిన నూక రాజు, అవంతి కంప్యూటర్స్ డైరెక్టర్ కోన ప్రకాష్‌లు ముఖ్య అతిధులుగా హాజరయి ఈ క్యాంప్ ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అవంతి కంప్యూటర్స్ డైరెక్టర్ కోన ప్రకాష్ మాట్లాడుతూ ఈ సంఘం ఏర్పాటు అయినప్పటి నుంచి ఎన్నో మంచి కార్యక్రమాలు చేపడుతూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు.పేద విద్యార్థులకు స్కూల్‌బ్యాగ్‌లు, నోట్ పుస్తకాలు, మహిళలకు చీరలు,వ ృద్ధులకు దుప్పట్లు ఇలా పలు సేవా కార్యక్రమాలను నిరంతరంగా నిర్వహిస్తూ యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని పేర్కొన్నారు.గౌరవ అధ్యక్షుడు గరికిన నూక రాజు, అధ్యక్షులు బొడ్డు తాతారావు, కార్యదర్శి మారుపిల్లి అప్పన్న మాట్లాడుతూ డాక్టర్ విశ్వనాథ్ సహకారం తో ఈ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. వంద మందికిపైగా బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు అందజేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విశ్వనాథ్, డాక్టర్ శ్వేతా, వాసుపల్లి అమర్ నాథ్, బి.సత్తిరాజు,బి.తాతారావు, గంటా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మహిళావరణం

ఆకాశంలో సగం. అనంతకోటి నక్షత్రాల్లో సగం. అవని అంతా పరివ్యాప్తమైన మహిళావరణం. త్యాగాల పరంపరలో ఆమె చరిత అనుపమానం. మార్పుకోసం జరిగే పోరాటాల్లో, ప్రపంచ గతిని మార్చే పెను విప్లవాల్లో ఆమె పాత్ర అనంతం. అయినా అధికారంలో ఆమె స్థానం నామమాత్రం. విధాన నిర్ణయాలకు ఆమె ఆమడదూరం. ఇంటా బయటా ఆమె లేనిదే రోజు గడవదు. ఆమె శ్రమ చేయనిదే ఒక్క పనీ జరగదు. ఆమె చెమట చిందించనిదే వ్యవసాయం సాగదు. పరిశ్రమల రథచక్రం ముందుకెళ్ళదు. అయినా వేతనాల్లో వ్యత్యాసం. జెండర్ కారణంగా చేసిన పనికి సరిపడా దక్కని ఫలితం. ఇది మానవచరితకే అవమానకరం. ఈ అవమానాల పరంపరనించి విముక్తి కోసం సాగే పోరాటంలో ఆమెతో చేయి కలిపిన పురుషుడే నిజమైన మానవుడు. ఆమెకు అవమానం, తనకు అగౌరవంగా భావించి ఉద్యమించడం మగ ప్రపంచపు కర్తవ్యం. ఈ చైతన్యశీలతతో వ్యవహరించాలన్న దృఢ సంకల్పం మహిళా దినోత్సవాలకు గొప్ప సంఘీభావం. ఓటు హక్కు కోసమే దశాబ్దాల తరబడి మహిళలు ఉద్యమించాల్సి వచ్చింది. అధికారంలో సగభాగం కోసం నిరంతర పోరాటం అనివార్యమైన స్థితి ఎల్లెడలా కనిపించే దృశ్యం. ఏ దేశ చరిత్ర చూసినా మహిళా ప్రాతినిధ్యం నామమాత్రం. మన దేశ పార్లమెంటు, అసెంబ్లీల్లో మహిళల ప్రాతినిధ్యం అతి స్వల్పం. కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో ఒక్క మహిళా మంత్రి కూడా లేరు. విధాన నిర్ణయాల్లో భాగస్వామ్యం కల్పించకుండా మహిళా దినోత్సవాలు జరపబోవడం వైచిత్రి. మహిళా సాధికారత, సమానతల గురించి మాట్లాడటం విడ్డూరం. ఇరవయ్యొకటో శతాబ్దంలోనూ, కొత్త సహస్రాబ్దిలోనూ మహిళలపై అణచివేత ఆగలేదు. నిజానికి మరింత పెరిగింది. సాంకేతిక పురోగతి మహిళల జీవితాన్ని మెరుగుపరచకపోగా మరింత సంక్లిష్టం చేసింది. భూస్వామిక సమాజం మహిళని భోగవస్తువుగా చూసింది. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం విస్తరించిన ప్రపంచీకరణ క్రమంలోనూ మహిళని చూసే దృక్పథంలో మార్పు లేదు. సరళీకృత ఆర్థిక విధానాల నేపథ్యంలో మహిళ, ఆమె శరీరం అమ్మకపు సరుకులుగా పరిణమించాయి. మతం, మార్కెట్ కలగలసి స్త్రీని విలాసవస్తువు స్థితికి దిగజార్చాయి. స్త్రీకి శరీరమే కాదు, మనసు ఉందని వందేండ్ల కిందట చలం చెప్పినా ఇప్పటికీ గుర్తించే పరిస్థితి లేదు. ఆమె ఇష్టానికీ, అభిప్రాయాలకీ కుటుంబంలోనూ, సామాజిక జీవనంలోనూ గుర్తింపు, గౌరవం, సమ్మతి లభించడం లేదు. ఆమె ఆలోచనల్ని సైతం కత్తిరించే అప్రకటిత సెన్సార్‌షిప్ దృశ్యాదృశ్యంగా చెలామణీలో ఉంది. ఆమె వస్త్రధారణ, వ్యవహారసరళిపై నిఘా కొనసాగుతోంది. స్త్రీని మనిషిగా పరిగణించే మానవీయదృష్టి సమాజాన నెలకొనలేదు. అవని అంతటా ఆమె ఉంటుంది. ఆమె అవసరముంటుంది. కానీ అవమానాల్ని తట్టుకుంటూ నిలబడాల్సి రావడం, మనిషిగా తన ఉనికిని చాటుకోడం కోసం నిత్యమూ నిరంతరమూ కలబడాల్సి రావడం పితృస్వామిక సమాజ క్రౌర్యానికి నిదర్శనం. ఇంటికోసం, సమాజం కోసం అరవచాకిరీ చేస్తూ కూడా రెండో తరగతి పౌరురాలిగా బతకాల్సి రావడం స్త్రీ బతుకులోని అతి పెద్ద దైన్యం. ఈ వైనాన్ని గురించి శతాబ్దాలుగా రచయితలు, రచయిత్రులు రాస్తూనే వున్నారు. చరిత్ర పొడుగునా సాహిత్యం, కళల్లో స్త్రీలకు దక్కింది రెండో స్థానమే. తమని తాము నియంత్రించుకునే ఆలోచనల గాడికి స్త్రీల మనోభావాల్ని కట్టిపడేసే సాహిత్యమే శతాబ్దాలుగా రాజ్యమేలింది. ఈ నేపథ్యంలోనే తమ అంతర్లోకాల తండ్లాటని తమదైన స్వరంతో వ్యక్తం చేయాలన్న తపనలోంచే మహిళల సాహిత్యం వెల్లువెత్తింది. మహిళల కంఠస్వరాల్లోని సంవేదనల్ని వినే సందర్భం సమాజంలో నెలకొన్నది. ఈ కంఠస్వరాలు మహిళల కోసమే గాక మొత్తం పీడిత మానవాళి విముక్తి దిశగా పదునెక్కడం ద్వారానే తమ లక్ష్యాన్ని చేరుకుంటాయి. ఈ స్పృహ పెరుగుతున్న కొద్దీ సకల రంగాల్లో ప్రశ్నించే గొంతుల సంఖ్య ఇనుమడిస్తుంది. విభిన్న రంగాల మహిళలు గొంతు సవరించుకుంటూ సామాజికోద్యమాల్లో భాగస్వాములవుతారు. ఈ ఉద్యమాల వెల్లువనే మహిళల సాధికారతనీ, సమానత్వాన్నీ సాధించడానికి తోడ్పడుతుంది. "సగం నీవు సగం నేను విప్లవాకాశంలో" అన్న మావో మాటలు వాస్తవ రూపం దాల్చడానికి పీడిత మహిళలు, పురుషులు సంఘటితం కావడం అనివార్యం. మహిళ బతుకుని బీభత్సం చేస్తున్న మతోన్మాద ధూర్తత్వాన్నీ, మార్కెట్ కౌటిల్యాన్ని ఎదుర్కోడానికి ఇది తప్పనిసరి. చదువులు, ఉద్యోగాలు, సొంత సంపాదనలు మహిళల జీవితంలో పురోగతిగా కనిపించినా, మహిళకు భద్రత లేదు. నిర్భయంగా సంచరించే స్వేచ్ఛ లేదు. ఆమె అడుగుజాడలపై ఆంక్షల పరదాలు తొలగిపోలేదు. ఇంటి నుంచి బయటికి అడుగుపెట్టే మహిళ తిరిగి క్షేమంగా ఇంటికి చేరే వాతావరణం లేదు. క్షణక్షణం తనని తాను, తన ఆలోచనల్ని తాను కూడదీసుకుంటూ బతకాల్సిరావడం కన్నా మించిన దుస్థితి మరొకటి లేదు. ఈ లోకాన ఏ ప్రాణికీ లేని ఈరకమైన భీతి మహిళకే ఉండటం మహావిషాదం. ఈ విషాద బీభత్సం నుంచి విముక్తి కోసం మరో అడుగు ముందుకెయ్యటం మహిళా దినోత్సవాలకు దీప్తీ.. స్ఫూర్తీ..!

దొంగల నోట నీతి సూక్తులు



విజయ్‌మాల్యా, నీరవ్ మోడీ కుంభకోణాల నేపథ్యంలో ప్రభుత్వరంగ బ్యాంకులను ప్రయివేటీకరించాలంటూ కొద్దిరోజులుగా కార్పొరేట్ శక్తులు చేస్తున్న చర్చ విస్మయం కలిగిస్తోంది. దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించి, సామాన్యులకు అండగా నిలిచిన జాతీయ బ్యాంకులను లూటీ చేయడంలో పాత్రధారులుగా వ్యవహరించిన వారే తాజా చర్చకు సూత్రధారులు కావడం కలవరపరిచే పరిణామం. బ్యాంకింగ్ వ్యవస్థను సంక్షోభంలోనికి నెట్టివేసిన ఈ ఆర్థిక నేరాలన్నీ కార్పొరేట్ సంస్థల నిర్వాక ఫలితమే! సొంత లాభాల కోసం ఎంతకైనా తెగించే కార్పొరేట్ యాజమాన్యాలు నిస్సిగ్గుగా ఆ దోపిడీకి పాల్పడ్డాయి. లక్షల కోట్ల ప్రజాధనాన్ని దిగమింగాయి. జాతి కష్టార్జితాన్ని స్వాహా చేసిన ఈ ఘరానా దొంగలను పట్టుకుని కఠినంగా శిక్షించాల్సిన పాలకవర్గాలు వారి అడుగులకు మడుగులొత్తాయి. విదేశాలకు సాగనంపి స్వామిభక్తి చాటుకున్నాయి. జాతి సంపదను కొల్లగొడుతున్న ఈ వ్యాపార, పాలకవర్గ కుట్రను ఎత్తి చూపడానికి బదులుగా తప్పంతా ప్రభుత్వ రంగ బ్యాంకులదే అన్నట్టు, ప్రయివేటీకరణతోనే ఈ సమస్య పరిష్కారం అవుతుందన్నట్టు కార్పొరేట్ మీడియా కథనాలు వండి వారుస్తున్న తీరు దుర్మార్గం.

ప్రయివేటీకరణ వాదన చేస్తున్న వారు, దానిని సమర్థిస్తున్న వారు ఉద్దేశ్యపూర్వకంగానే కొన్ని వాస్తవాలను దాచిపెడుతున్నారు. వీటిలో కీలకమైనది ప్రయివేటురంగానికి జాతి హితం పట్టదన్నది! ఒకప్పుడు ప్రయివేటు యాజమాన్యాలు చేసిన సహాయ నిరాకరణ కారణంగానే బ్యాంకుల జాతీయకరణ అంశం ముందుకు వచ్చింది. ఆ తరువాత దేశ ఆర్థికాభివృద్ధిలో ప్రభుత్వరంగ బ్యాంకులు నిర్వహించిన పాత్ర విస్మరించలేనిది. మారుమూల గ్రామాల్లో బ్యాంకు శాఖలు ఏర్పాటు చేయడం నుంచి, రైతులు, నిరుద్యోగులు, ఇతర అణగారిన వర్గాలకు రుణాలు ఇవ్వడం వరకు


> **పాలకవర్గాల అండదండలతో వ్యవస్థలను నిర్వీర్యం చేయడంతో పాటు, ఇతరులనూ ప్రలోభపరుస్తాయి. ఇక ప్రయివేటు రంగంలో పరిపాలనా విధానా లు బ్రహ్మాండంగా ఉంటాయని వాదించే వారు పాలనా విధానాలు అంత గొప్పగా ఉంటే దివాళా ఎందుకు తీస్తున్నాయని, అప్పులు ఎందుకు ఎగవేస్తున్నా యం టూ ఎస్‌బీఐ చీఫ్ రజ్నీష్‌కుమార్ వేసిన ప్రశ్నలకు జవాబు చెప్పవల్సివుంది. బ్యాంకుల్లో పేరుకుపోయిన మొండి బకాయిలన్నీ ప్రయివేటోళ్ల వేనని, ఒక్క ప్రభుత్వ రంగ సంస్థ కూడా అప్పులు ఎగ్గొట్టలేదంటూ ఆయన చెప్పిన వాస్తవాలను విస్మరించలేం. దేశంలో ఆర్థిక సంస్కరణలు ప్రారంభమైన తరువాత చోటుచేసుకున్న కుంభకోణాలన్నింటిలోనూ కనిపించేది వ్యాపార, పాలకవర్గాల మధ్య పెరుగుతున్న అనైతిక మైత్రే! కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ఈ పరంపర నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్రస్తుత బీజేపీ ప్రభుత్వ హయాంలో పతాకస్థాయికి చేరిందనడంలో సందేహం అక్కర్లేదు.**

జాతీయ బ్యాంకులు కీలకపాత్ర పోషించాయి. అంతెందుకు, నరేంద్రమోడీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పెద్ద ఎత్తున చేపట్టిన జన్‌ధన్ ఖాతాల ఏర్పాటులో కూడా వీటిదే పైచేయి. ప్రయివేటు బ్యాంకులు ఇది తమ పని కాదన్నట్టు వ్యవహరించాయి. ఈ ఒక్క ఉదాహరణే చాలు దేశ ప్రజలకు ఉపయోగపడేవి ఏవో తేల్చుకోవడానికి! ఇక ప్రభుత్వ రంగమంతా అవినీతిమయమంటూ చేస్తున్న ప్రచారం వాస్తవాలను తలకిందులుగా చూపడమే! లాభాలను పెంచుకోవడమే పరమావధిగా భావించే కార్పొరేట్ శక్తులు అవినీతిని పెంచి పోషిస్తాయి. చట్టాలను, నిబంధనలను ఉల్లంఘిస్తాయి. పాలకవర్గాల అండదండలతో వ్యవస్థలను నిర్వీర్యం చేయడంతో పాటు, ఇతరులనూ ప్రలోభపరుస్తాయి. ఇక ప్రయివేటు రంగంలో పరిపాలనా విధానాలు బ్రహ్మాండంగా ఉంటాయని వాదించే వారు పాలనా విధానాలు అంత గొప్పగా ఉంటే దివాళా ఎందుకు తీస్తున్నాయని, అప్పులు ఎందుకు ఎగవేస్తున్నా యంటూ ఎస్‌బీఐ చీఫ్ రజ్నీష్‌కుమార్ వేసిన ప్రశ్నలకు జవాబు చెప్పవల్సివుంది. బ్యాంకుల్లో పేరుకుపోయిన మొండి బకాయిలన్నీ ప్రయివేటోళ్లవేనని, ఒక్క ప్రభుత్వ రంగ సంస్థ కూడా అప్పులు ఎగ్గొట్టలేదంటూ ఆయన చెప్పిన వాస్తవాలను విస్మరించలేం.

దేశంలో ఆర్థిక సంస్కరణలు ప్రారంభమైన తరువాత చోటుచేసుకున్న కుంభకోణాలన్నింటిలోనూ కనిపించేది వ్యాపార, పాలకవర్గాల మధ్య పెరుగుతున్న అనైతిక మైత్రే! కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ఈ పరంపర నరేంద్రమోడీ నేతృత్వంలోని ప్రస్తుత బీజేపీ ప్రభుత్వ హయాంలో పతాకస్థాయికి చేరిందనడంలో సందేహం అక్కర్లేదు. అస్మదీయులకు ఉన్నదంతా దోచిపెట్టి, వారికి అన్ని విధాలా రక్షణ కల్పించే ఆశ్రిత పెట్టుబడిదారీ వ్యవస్థ విశృంఖలత కారణంగానే అన్ని వ్యవస్థలూ పతనావస్థకు చేరుతున్నాయన్నది నిర్వివాదాంశం. ప్రభుత్వరంగ బ్యాంకులకు వేల కోట్ల రూపాయలు ఎగవేసిన విజరుమాల్యా, నీరవ్‌మోడీ నిరభ్యంతరంగా విదేశాలకు వెళ్లిపోవడానికీ, ఆ తరువాత కూడా ఒకదాని వెంట మరొకటిగా వెలుగులోకి వస్తున్న బ్యాంకింగ్ అక్రమాలకూ ఈ విధానాలే కారణం. దోషులను వదిలిపెట్టి, బ్యాంకుల ఆడిటర్లు, నియంత్రణ వ్యవస్థలదే తప్పని సాక్షాత్తు దేశ ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ చెప్పడం అసలు విషయాన్ని పక్కదోవ పట్టించడమే! త్వరలో జరగనున్న ఎన్నికల్లో కార్పొరేట్ల కరుణా కటాక్షాల కోసమే ప్రధానమంత్రి నరేంద్రమోడీ బ్యాంకు కుంభకోణాలపై పెదవి విప్పడంలేదన్న ఆరోపణలనూ తోసివేయలేం.

దేశ ఆర్థిక వ్యవస్థకు దన్నుగా నిలుస్తూ, సామాన్యులకు అండగా ఉంటున్న ప్రభుత్వ రంగ బ్యాంకులను కాపాడుకోవడం అందరి బాధ్యత! దేశాన్ని దర్జాగా దోచుకుతింటున్న దొంగల నోటివెంట వస్తున్న నీతి సూక్తుల్లోని అసలు విషయాన్ని ప్రజానీకానికి చేరవేయడానికి మేధావులు నడుంబిగించాలి. వాస్తవాలను వివరించి ప్రజలను చైతన్య పరచాలి. అభూత కల్పనలు, అసత్యాలతో సాగుతున్న గోబెల్స్ ప్రచారాన్ని నిలువరించడం కోసం అభ్యుదయ, ప్రజాతంత్ర శక్తులు కదలాలి.

బుద్ధుడు సందేశాలు



పరిమితి ఆహారంతోనే..ఆరోగ్యం

దిసమొసలతో తిరగడం దరిద్రంగా, అసహ్యంగా ఉంటుంది. వారి స్థితిని దృష్టిలో పెట్టుకొని, వానాకాలంలో సంఘ సభ్యులందరికీ వస్త్రాలు ఇవ్వాలనే కోరిక కలిగింది. "ఇక రెండవ కోరిక ఎందుకు కలిగిందో చెబుతాను. పొరుగూరునుంచి వచ్చే భిక్షువులు దారులు సరిగా తెలియక, ఆహారం దొరికే తావులు తెలియక తిరిగి, తిరిగి అలిసిపోయి వస్తారు. అందువలన వెలుపలి నుంచి వచ్చే భిక్షువులందరికీ ఆహారం అందించానుకొన్నాను.

"ఇక బయటకు వెళ్లే భిక్షువులు భిక్ష కోసం వెదుకుతూ వెనకబడి పోవచ్చు. వెళ్లదలచిన చోటికి వెళ్లేసరికి ఆలస్యం కావచ్చు. ఆ విధంగా ఇబ్బంది పడి అలసి పోకుండా వారికి బిక్షపెట్టి పంపాలని నా అభిలాష. జబ్బున పడ్డవారికి సరియైన ఆహారం లభించకపోతే జబ్బు ముదురుతుందిగాని తగ్గదు. ఆ విధంగా మరణించే అవకాశం ఉంది. అలాగే వారికి మందులు కూడా కావాలి. వ్యాధి నయమై ఆరోగ్యం పొందాలంటే తగిన ఔషధాలు వారికి ఇవ్వాలి అందుకని వారికి ఆహారం, ఔషధాలు ఇవ్వాలని తలపెట్టాను. తర్వాత పాయసం ఇచ్చే విషయం, పాయసం మంచిదని, అది మనస్సును చురుకుగా ఉంచుతుందని, ఆకలి దప్పులను నివారిస్తుందని జబ్బుపడిన వారికి మందులా పని చేస్తుందని, ఆరోగ్యానికిది పోషకాహారమని మీరు చెప్పగావిన్నాను. అందువలన సంఘానికి నా జీవితకాలమూ పాయసం ఇవ్వాలని నిర్ణయించుకొన్నాను. చివరిది భిక్షువులకు బట్టలు. ఎందుకంటే అచిరవతీ నదిలో భిక్షణులు నగ్నంగా స్నానం చేయడం చూశాను. వారితోపాటు స్నానం చేసే వేశ్యలు భిక్షుణులను ఎగతాళి చేస్తుంటారు. ఇంత చిన్న వయస్సులో శీల సంరక్షణకై తాపత్రయపడటం ఎందుకు? ముసలివాళ్లైనాక అవన్నీ చూసుకోవచ్చు. ఆ విధంగా ఇహలోక సుఖాలు, పరలోక సుఖాలు రెండూ పొందవచ్చు. అని ఆ వేశ్యలు దెప్పుతుంటారు. అందువలన స్త్రీలు నగ్నంగా స్నానం చేయరాదని నాకనిపించి, నగ్నంత్వం మీద రోతపుట్టి, వారికి స్నానార్థం బట్టలు ఇవ్వాలని భావించాను." బుద్ధుడు విశాఖ వరాలు కోరడానికి గల కారణాలు అసాంతం విని, "అయితే ఈ కోరికలు తీర్చుకొన్నందున నీకు కలిగే లాబమేమిటి? ఏ ప్రయోజనం ఆశించి ఈ వరాలు కోరుతున్నావు?" అని అడిగాడు.

దిన ఫలాలు

సోమవారం -5-3-2018

మేషం: శ్రమకు తగిన ప్రతిఫలం దక్కదు. జీవితభాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఆకస్మిక ప్రయాణాలు ఉంటాయి. కొత్త మిత్రుల పరిచయమవుతారు.

వృషభం: ప్రయాణాలలో అప్రమత్తంగా ఉండాలి. కీలక విషయాలలో తొందరపాటు నిర్ణయాలు తగదు. కుటుంబంలో ఏర్పడిన సమస్యలను పరిష్కరిస్తారు.

మిథునం: కొత్త వ్యక్తులు పరిచయమవుతారు. కీలక సమయంలో మిత్రులు సాయం అందిస్తారు. పోటీపరీక్షలలో నిరుద్యోగులు విజయం సాధిస్తారు. ఆనందంగా గడుపుతారు.

కర్కాటకం: కుటుంబంలో ఏర్పడిన వివాదాలను పరిష్కరించుకుంటారు. నూతన గృహనిర్మాణ ఆలోచనలు స్థిరంగా ఉండవు. ప్రయాణాలలో కొత్త మిత్రులు పరిచయమవుతారు.

సింహం: కొత్త పరిచయాలు పెరుగుతాయి. నిరుద్యోగుల ప్రయత్నాలు సఫలమవుతాయి. విందువినోదాలలో పాల్గొంటారు. విలువైన వస్తు, వస్త్రాలను కొనుగోలు చేస్తారు.

కన్య: కొన్ని వ్యవహారాలలో ఏర్పడిన ఆటంకాలను కొంత వరకు అధిగమిస్తారు. ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి. కుటుంబసభ్యులతో కలిసి ఉల్లాసంగా గడుపుతారు.

తుల: రుణ భారం తొలుగుతుంది. మానసిక ప్రశాంతత పొందుతారు. సంతానానికి విద్యా, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. సభలు, సమావేశాలలో చురుకుగా పాల్గొంటారు.

వృశ్చికం: చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది. విలువైన వస్తువులు, ఆభరణాలను కొనుగోలు చేస్తారు.

ధనస్సు: రుణ వత్తిడి నుంచి విముక్తి లభిస్తుంది. ఆకస్మిక ప్రయాణాలు తప్పవు. కొత్త మిత్రుల పరిచయం ఉంటుంది. ఉద్యోగులకు ఎదురైన ఒడిదొడుకులు సమసిపోతాయి.

మకరం: బంధువుల నుంచి ఒత్తిడి ఎదురైనా అధిగమిస్తారు. ఇతరుల విషయాలకు, వివాదాలకు దూరంగా ఉండాలి. చేపట్టిన పనులు నిదానంగా సాగుతాయి.

కుంభం: చేపట్టిన కార్యక్రమాలలో విజయం సాధిస్తారు. ఆత్మీయులతో సంతోషంగా గడుపుతారు. సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. వివాదాలు పరిష్కారమవుతాయి.

మీనం: వ్యవహారాలు సాఫీగా సాగుతాయి. చిన్ననాటి మిత్రుల నుంచి ఆహ్వానాలు అందుకుంటారు. జీవితభాగస్వామి ద్వారా ఆస్థి లాభం పొందుతారు. అనుకూలంగా ఉంటుంది.

ఆరోగ్యం

ఎండ ప్రభావం ఇప్పుడిప్పుడే మొదలవుతోంది. ఆ వేడిని తట్టుకోవాలంటే... ఇప్పటినుంచీ కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. అదెలాగంటే...

జ మంచినీటిని మించిన ఔషధం లేదు. శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా కాపాడేది మంచినీరు మాత్రమే. కాబట్టి ఇప్పటినుంచీ దాహం వేసినా వేయకపోయినా వీలైనంత ఎక్కువగా నీళ్లు తాగడం అలవాటుగా మార్చుకోండి.

● గుప్పెడు పుదీనా ఆకులను తాగే నీటిలో వేసుకుంటే... శరీరం చల్లగా ఉంటుంది. ఈ కాలంలో పుదీనా టీని ఎంచుకుంటే మరీ మంచిది. ఎండ ప్రభావాన్ని కొంతవరకూ తట్టుకోగలుగుతారు.

● నిమ్మరసం కూడా వేసవికి ఔషధం లాంటిది. ఉదయాన్నే గ్లాసు నీటిలో కొద్దిగా నిమ్మరసం, తేనె కలిపి తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారు.

● పెరుగు, మజ్జిగలో శరీరానికి కావలసిన పోషకాలు ఉంటాయి. విటమిన్లూ, పోషకపదార్థాలున్న పెరుగును ఈ కాలంలో ఎంత ఎక్కువగా తీసుకుంటే అంత మంచిది.

● గసగసాలను ఎక్కువగా ఆహారపదార్థాల్లో వాడాలి. వీటిలోని యాంటీఆక్సిడెంట్లు వ్యాధినిరోధక శక్తిని పెంచుతాయి. అంతేకాదు, వేడిని తగ్గించి, శరీరాన్ని చల్లగా ఉంచుతాయి.




పుదీనారసం...సబ్జానీళ్లు!

● కొత్తిమీరను ఆహారంలో అధికంగా తీసు కోవాలి. కొత్తిమీర రసం లేదా వంటకాల్లో దీన్ని వాడినా... శరీరంలోని అధిక ఉష్ణోగ్రత అదుపులో ఉంటుంది.

● వేసవి వేడి నుంచి తప్పించుకోవాలంటే సబ్జాగింజలు మంచి ఔషధంలా ఉపయోగపడతాయి. వీటిని నీటిలో అరగంట సేపు నానబెట్టి, అందులో కాస్తంత నిమ్మరసాన్ని కలిపి తాగితే చాలు. శరీరాన్ని చల్లబరచడమే కాదు, బరువు కూడా అదుపులో ఉంటుంది.

చరిత్రలో మార్చి 5



1827 : ప్రముఖ ఫ్రెంచి గణిత శాస్త్రవేత్త మరియు ఖగోళ శాస్త్రజ్ఞుడు పియర్ సైమన్ లాప్లేస్ మరణం (జ.1749).

1901 : సుప్రసిద్ధ రంగస్థల, సినిమా నటుడు మరియు గాయకుడు కల్యాణం రఘురామయ్య జననం (మ.1975).

1913 : కిరాణా ఘరానాకు చెందిన హిందుస్థానీ సంగీత విద్వాంసురాలు గంగూబాయి హనగల్ జననం (మ.2009).

1931 : గాంధీ- ఇర్విన్ ఒడంబడిక కుదిరింది.

1937 : కథకుడు, నవలాకారుడు, నాటకకర్త, నటుడు అయిన నెమలికంటి తారకరామారావు జననం.

1953 : రష్యా నేత సోవియట్ యూనియన్‌కు బ్యూరోక్రాటిక్ పాలకుడు జోసెఫ్ స్టాలిన్ మరణం (జ.1878).

1987 : రష్యా దేశానికి చెందిన ప్రముఖ టెన్నిస్ క్రీడాకారిణి అన్నా చక్వతడ్జే జననం.

స్టాలిన్ పూర్తి పేరు జోసఫ్ విస్సారినోవిక్ స్టాలిన్ (డిసెంబరు 18, 1878 – మార్చి 5, 1953). అతను క్రమంగా తన అధికారాన్ని పటిష్ఠం చేసుకొని సోవియట్ యూనియన్‌కు బ్యూరోక్రాటిక్ పాలకుడు అయ్యాడు. ఆ కాలాన్ని సోవియట్ యూనియన్ చరిత్రలో స్టాలినిజమ్ అంటారు. ఇతని అసలు ఇంటిపేరు "జుఘాష్విలి". ఇతడు రష్యాకు చెందిన కమ్యూనిస్ట్ నేత మరియు అధ్యక్షుడు. 1922 నుండి 1953లో అతను మరణించేవరకు "సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ" జనరల్ సెక్రటరీగా ఉన్నాడు. 1924లో లెనిన్ మరణానంతరం అధికారం కోసం లియాన్ ట్రాట్స్కీ మరియు స్టాలిన్‌ల మధ్య పోటీ నెలకొంది. ఫలితంగా ట్రాట్స్కీ సోవియట్ యూనియన్ నుండి వెళ్ళగొట్టబడ్డాడు. స్టాలిన్ నాయకత్వంలో వ్యవసాయాన్ని సమిష్టీకరించడం జరిగింది, వేగవంతమైన పారిశ్రామికీకరణ కూడా జరిగింది. స్టాలిన్ యుగంలో ప్రైవేట్ మార్కెట్ పూర్తిగా రద్దు చేశారు. వ్యవసాయ సమిష్టీకరణని భూస్వాములు మరియు మధ్య తరగతి రైతులు తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రతిఘటించిన భూస్వాములు మరియు రైతుల్ని అరెస్ట్ చెయ్యడం లేదా బలవంతంగా పని చేయించడం జరిగింది. సోవియట్ సమాఖ్యలో వ్యవసాయ సమిష్టీకరణ తరువాత గణనీయంగా ఆహారోత్పత్తి పెరిగింది. కానీ రష్యన్ జైళ్ళలో మాత్రం ఖైదీలకి సరైన ఆహారం, మందులు అందక చనిపోయారు. సోవియట్ సమాఖ్య నుంచి ఇతర దేశాలకు కూడా వ్యవసాయ ఉత్పత్తులు ఎగుమతి అయ్యేవి.

శ్రీవేంకటేశ్వర వైభవము

శ్రీ భాష్యకారులవారి ఉత్సవము

సర్వపురుషార్థ ప్రదాన చతురడై వేదపర్వతమని ప్రఖ్యాతి గాంచిన తిరుమలయందు అర్చావతారమున వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామి వారి సన్నిధానమున వేంచేసియున్న శ్రీ భాష్యకారుల వారికి మేషమాసమున ఆరుద్రా నక్షత్రము జన్మనక్షత్రమగుటచే ప్రతి సంవత్సరము ఆ ఆరుద్రా నక్షత్రమునకు ముందుగా 10 దినములుగా ప్రారంభించి శ్రీ భాష్యకారులవారికి ఉత్సవములు జరుగును.

మొదటిదినము శ్రీస్వామివారికి ప్రాత:కాలారాధనము నివేదనము శాత్తుమొర పూర్తి అయిన పిదప అధికారులు అర్చకస్వాములు పరిచారకులు మొదలైనవారు శ్వేతచ్ఛత్రాది మర్యాదలతో పరివారములతో మంగళవాద్యములతో శ్రీవారి శఠారిని వేంచేపుచేసుకుని విమాన ప్రదక్షణముగా శ్రీ భాష్యకారులవారి సన్నిధికి వేంచేయుదురు. అచ్చట శ్రీ భాష్యకారులవారిని ఒక తిరుచ్చియందు వేంచేపుచేసుకుని తిరువీథులు ఉత్సవము జరుపుదురు. ప్రదక్షిణముగా మహాద్వారము వద్దకు రాగానే, ఇహల్‌దోశపడి ఆరగింపుజరిగి విమాన ప్రదక్షిణముగా శ్రీ భాష్యకారులవారు తమ సన్నిధిలోనికి వేంచేయుదురు. పిమ్మట ఇహల్‌గోష్ఠికి వినియోగము జరుగును. శ్రీశఠారి శ్రీవారి సన్నిధిని స్వామివారు ఒక తిరుచ్చియందును వారి కభిముఖముగా శ్రీ భాష్యకారుల వారు మరియొక తిరుచ్చియందును వేంచేసి మహాద్వారము వద్దకు రాగానే శ్రీమలయప్ప స్వామివారికి హారతి అయి శేషహారతి శ్రీభాష్యకారులవారికి జరుగును. పిమ్మట తిరువీథులు ఉత్సవము జరిగి క్రమముగా శ్రీభాష్యకారుల వారి ముఖమండపమునకు శ్రీ మలయప్పస్వామివారు వేంచేయుదురు. అచ్చల శ్రీవారికి ఆరాధనము, నివేదనములు జరిగి హారతి అయిన పిమ్మట శేషహారతి శేషపుష్పహరము శఠారి మొదలగు మర్యాదలు శ్రీ భాష్యకారులవారికి జరుగును. తరువాత ఆరగింపు అయిన ప్రసాదముగోష్ఠికి ఆస్థాన బహుమాన పూర్వకముగా వినియోగము చేయబడును. శ్రీస్వామివారు సన్నిధికి వేంచేయుదురు.

చందన చూర్ణోత్సవము

ఆశ్రితజనకల్పభూరుహమై శ్రీ వేంకటభూధరము నందు



వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామివారికి నిత్యోత్సవములో చందన చూర్ణోత్సవము జరుగును.

శ్రీవారికి ప్రాత:కాలారాధనము మాధ్యాహ్నికారాధనము అయిన పిదప శ్రీ మలయప్పస్వామివారు నిత్యోత్సవమునకై తిరుచ్చిలో మహాద్వారమువద్దకు వేంచేయుదురు. శ్రీ భాష్యకారులవారు వేరొక తిరుచ్చిలో మహాద్వారమువద్దకు వచ్చి శ్రీ మలయప్పస్వామివారకి అభిముఖముగా నుందురు. అప్పుడు శ్రీ మలయప్ప స్వామివారికిని శ్రీభాష్యకారుల వారికిని చందన చూర్ణము అర్చకులు సమర్పించెదురు. వెంటనే శ్రీవారు తమ పరివారముతో చతుర్వీథులలో ఉత్సవమునకు వేంచేయుదురు. ఆ ఉత్సవ సమయంలో ఉత్తర పారుపత్యదారు అనువారు భగవద్భాగవత శేషమగు ఈ చందన చూర్ణమును భక్తజనమునకు యాత్రికులకు వినియోగము చేయుదురు. శ్రీవారు ఉత్సవములో ప్రదక్షిణముగా వచ్చి శ్రీవారి సన్నిధికి వేంచేయుదురు. పిమ్మట శ్రీవారు శ్రీభాష్యకారులవారి ముఖమంపమునకు వేంచేయుదురు. అచ్చట ఆరాధనము తళియుల నివేదనము జరిగి హారతి అయి స్తానబహుమాన పూర్వకముగా గోష్ఠికి వినియోగము జరుగును. తరువాత శ్రీవారు సన్నిధికి వేంచేయుదురు.

శ్రీనృషింహజయన్తి ఉత్సవము

ఆర్తత్రాణ పరాయణుడై వేంకటశైలమునందు అర్చావతారమున వేంచేసియున్న శ్రీవేంకటేశ్వరస్వామివారి సన్నిధానమున చాంద్రమాన ప్రకారముగా వైశాఖశుద్ధ చతుర్దశి శుభవారమున ప్రదోషసమయమున శ్రీనృసింహ స్వామివారికి జయన్తి ఉత్సవము జరుగును.

ఆ దినము శ్రీస్వామివారికి సాయంకాలారాదనము తోమాల అర్చన, తోమాల దోశపడి ఆరగింపు అయిన పిదప అర్చకస్వాములు శ్రీవారి శఠారిని వేంచేపు చేసుకొని పరివారములతో మంగళ వాద్యములతో విమాన ప్రదక్షిణముగా శ్రీ నృసింహస్వామివారి సన్నిధికి వెళ్లెదరు. అచ్చట శ్రీనృసింహస్వామివారికి అభిషేకముచేసి వస్త్రాభరణ పుష్పహారాద్యలంకారములు సమర్పించి ఆరాధనముచేసి తళియలు పానకం, వడపప్పు మొదలగు పదార్థములు నివేదన చేయుదురు. పిమ్మట దివ్య ప్రబంధపారాయణము శాత్తుమొర జరిగి హారతి అయి జియ్యంగారికి బహుమానము జరుగును. ఆరగింపు అయిన పదార్థాములు స్థానబహుమాన పూర్వ కముగా గోష్ఠికి వినియోగము జరుగును. పిమ్మట అర్చక స్వాములు శ్రీవారిని వేంచేసుకొని మంగళవాద్యములతో పరివారములతో ధ్వజప్రదక్షిణముగా శ్రీవారి సన్నిధికి వేంచేయుదురు.

సంచలన వార్తాపత్రిక
లీడర్
అనకాపల్లి

బ్రాండిక్స్ ఆవరణంలో స్వచ్ఛభారత్

అచ్యుతాపురం, న్యూస్‌లీడర్: బ్రాండిక్స్ ఆవరణంలో సుమారు కిలోమీటరు పొడవు స్వచ్ఛభారత్ నిర్వహించారు. పరిసర ప్రాంతాలు చెత్త చెదారాలను, పరిసర ప్రాంతాలు శుభ్ర పరిచారు. బ్రాండిక్స్ స్వచ్ఛభారత్ ఏపీఐఐసీ పరిధిలో ప్రతీ శనివారం ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, కంపెనీ గార్డెన్స్ మహిళలు తదితరులు పాల్గొన్నారు.



విశాఖపట్నం | సోమవారం 5-3-2018



వాలిన విద్యుత్ స్తంభం

కదపరు.. మెదపరు..

ప్రధాన రహదారిలో విద్యుత్ స్తంభం దుస్థితి
నిమ్మకునీరెత్తినట్లు ఉంటున్న పంచాయతీ సిబ్బంది

తుమ్మపాల (అనకాపల్లి), న్యూస్‌లీడర్:
తుమ్మపాల పంచాయతీ సిబ్బంది అలసత్వానికి నిదర్శనమే ఈ విద్యుత్ స్తంభం. గత కొన్ని రోజులుగా ఈ విద్యుత్ స్తంభం అలాగే ఉంటుంది గాని పట్టించుకునే నాధుడే కరువయ్యారు. నాణ్యతాలోపమో లేక ఏ వాహనమైనా గుద్దుకొని పోవడం తేలీదుకాని స్తంభాన్ని సరిచేసే వారే లేరు. దీనివలన వాహనదార్లు క్షతగాత్రులు కావడమో లేక ప్రాణాలు కోల్పోవడమో వంటివి జరిగి జీవితాలు వాలుపోయే పరిస్థితి సిబ్బంది వలన ఏర్పడే పరిస్థితులు దాపురిస్తున్నాయి. రోజూ ఎన్నో వేల వాహనాలు రాత్రింబవళ్లు ఈ మార్గం గుండా ప్రయాణిస్తున్నప్పటికీ అధికారులు ఈ స్తంభాన్ని మరమ్మతులు చేయడం కాని, పూర్తిగా తొలగించడం గాని చేయకపోవడం విడ్డూరంగా ఉందని స్థానికులు అంటున్నారు. నిత్యం విద్యుత్ సరఫరాతో ఉండే ఈ స్తంభాల వలన ఎప్పుడు ఏ ప్రమాదం పొంచి ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ మార్గంలో ఇలాంటి విద్యుత్ స్తంభాలు చాలా వరకు ఇదే స్థితిలో ఉన్నా అధికారులు చూసీచూడనట్లు ఉండడం ఎంతవరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎన్నో లక్షలు వెచ్చించి వీటిని కొనుగోలు చేయడంలో ఉన్న శ్రద్ధ వీటిని సంరక్షించే బాధ్యత పంచాయతీవారు వహించకపోవడం దారుణమని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికీ రాత్రి సమయాల్లో వీధి దీపాలు వెలగకపోయినా ఏదో విధంగా రాకపోకలు సాగిస్తున్నారు. ఏకంగా విద్యుత్ స్తంభమే వాలిపోవడం మంచి పరిణామం కాదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

పంచాయతీ వారు స్పందించాలి



ఇన్ని రోజులుగా రోడ్డుపైనే స్తంభం ఈ విధంగా వేలాడుతున్నా దీనిని పట్టించుకునేవారు లేకపోవడం చాలా దారుణం. పంచాయతీ సిబ్బంది చూసీ చూడనట్లుగా ఉంటున్నారు తప్ప స్తంభాన్ని మరమ్మతులు చేయడంలేదు. ఇప్పటికైనా స్పందించాలి.

చదరం చిన్న,
వైఎస్సార్ సీపీ నాయకుడు, తుమ్మపాల

సొంతింటి కలను నిజం చేయడమే చంద్రబాబు ధ్యేయం

రాష్ట్ర మున్సిపల్ పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ

అనకాపల్లి టౌన్, న్యూస్‌లీడర్:
రాష్ట్రంలో ప్రతి పేదవాడికి సొంతింటి కలను నిజం చేయడమే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రథమ ధ్యేయమని రాష్ట్ర మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ అన్నారు. ఆదివారం ఉదయం సత్యనారాయణపురం మెగా లేఅవుట్‌లో నిర్మాణమవుతున్న ఇళ్లను వచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటైన విలేకరుల సమావేశంలో మంత్రి నారాయణ మాట్లాడుతూ 2019 మార్చి నాటికి రాష్ట్రంలో ఐదు లక్షల ఇళ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందన్నారు. తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకులు, స్వర్గీయ అన్న ఎన్టీఆర్ పార్టీని స్థాపించి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ప్రతి పేదవాడికి కూడు, గూడు, వస్త్రం కల్పించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. అంతకు ముందు కాంగ్రెస్‌హయాంలో ఈ రాష్ట్రంలో పేద ప్రజలకు పక్కా గృహాలను ఇచ్చే పరిస్థితులే ఉండేవి కావన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇళ్ళు నిర్మించి ఇవ్వడం తప్ప మౌలిక వసతులను కల్పించడంలో విఫలం చెందారన్నారు. సత్యనారాయణపురం మెగా లేఅవుట్‌లో మొదటిదశగా 2520 ఇళ్లను మరో మూడు నెలలు నాటికి పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయడం జరుగుతుందన్నారు. ఇళ్లను నిర్మించి ఇవ్వడమే కాకుండా ఇక్కడ నివసించే వారికి పూర్తి మౌలిక వసతులను కల్పించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా ఈ మెగా లేఅవుట్ ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆస్పత్రి, కమ్యూనిటీహాల్, పార్కు, క్రీడా



విలేకరుల సమావేశంలో మట్లాడుతున్న మంత్రి నారాయణ, పక్కన ఎమ్మెల్యే పీలా

మైదానం, మార్కెటింగ్ తదితర వసతులను కూడా కల్పించడం కూడా జరుగుతుందని ఆయన తెలిపారు. అన్ని సదుపాయాలను కల్పించిన తరువాతనే లబ్ధిదారులకు ఇళ్లను అందజేస్తామని తెలిపారు. విశాఖజిల్లాలో లక్షా 50వేల మంది ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని, ఇందులో 59వేల దరఖాస్తులను ఎంపిక చేశామని ఆయన తెలిపారు. విశాఖ సిటీలో స్థల సమస్య ఉందని భూసేకరణ జరిగిన వెంటనే అక్కడ కూడా ఇళ్ల నిర్మాణ పనులను చేపట్టడం జరుగుతుందన్నారు. 2020 నాటికి రాష్ట్రంలో ప్రతి



ఇళ్లను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

ఒక్కరికి సొంతింటి కలను నిజం చేయడమే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ధ్యేయమని మంత్రి నారాయణ అన్నారు. కొప్పాక ఇండస్ట్రీయల్ ఏరియాలో 1085 ఇళ్లను త్వరలో అర్బన్ హౌసింగ్ స్కీంలో నిర్మించనున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. ఆదివారం ఉదయం నిర్మాణం చేపట్టనున్న స్థలాన్ని పరిశీలించేందుకు ఎమ్మెల్యే పీలాతో కలిసి పర్యటించారు.

ప్రత్యేక హోదా విషయమై మంత్రి నారాయణను విలేకరులు ప్రశ్నించగా......
ప్రత్యేక హోదా విషయమై మంత్రి నారాయణను వివరణ కోరగా ప్రత్యేక హోదా వచ్చే వరకు తెలుగుదేశం పార్టీ తరపున పార్లమెంట్‌లో మా పోరాటం ఆగేది లేదని మంత్రి నారాయణ అన్నారు. ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన నిధులపై ప్రధాని మోదీని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 29 సార్లు కలిశారని అయినప్పటికీ రాష్ట్రానికి రావాల్సిన నిధుల విషయంలో అన్యాయం జరిగిందన్నారు. 2014 విభజన చట్టంలో పొందుపరిచిన హామీలన్నింటిని అమలు చేయాలని పలుమార్లు కోరడం జరిగిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు మొదటి నుంచి కేంద్రాన్ని ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరుతూ వచ్చారని, అయినప్పటికీ దేశంలో ఏ ఒక్క రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వడం లేదని అందువల్ల ప్రత్యేక హోదాతో సమానమైన ప్రత్యేక ప్యాకేజిని ఆంధ్రప్రదేశ్‌కు ఇస్తామని ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు చెప్పడం జరిగిందని ఆయన తెలిపారు. ఇప్పుడు ఇచ్చిన హామీని నిలుపుకోకపోవడంతో కేంద్రంపై తమ పార్లమెంట్ సభ్యులచే ఒత్తిడిని పెంచామన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల వాంఛ అయిన విశాఖ రైల్వేజోన్‌ను ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటికీ ఆ హామీని నిలుపుకోకపోవడం అన్యాయమని మంత్రి నారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ, జీవీఎంసీ కమిషనర్ హరినారాయణన్, యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్, డీఈ సౌభాగ్యరాజు, ఏఈ ప్రభాకర్, ప్రాజెక్టు ఇంజనీర్ రాజగోపాలం, మేనేజర్ వెంకటరావు, అనకాపల్లి జీవీఎంసీ జోనల్ కమిషనర్ షేక్ సుభాని, టీడీపీ నాయకులు మళ్ల సురేంద్ర, మళ్ల శ్రీనివాసరావు, యల్లపు వెంకటరావు, కాండ్రేగుల శ్రీనివాసరావు, కాండ్రేగుల చిన్న, ఆదారి జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే



ఆలయ మండపంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, న్యూస్‌లీడర్:
ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయాన్ని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేయనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఉదయం 4.21 గంటలకు అమ్మవారి రాజగోపురం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు కోట్ల 25 లక్షల రూపాయల నిధులతో అమ్మవారి రాజగోపురాన్ని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ముందుగా తెల్లవారుజామున మూడు నుంచి నాలుగు గంటల వరకు వేదపండితులు రేజేటి చక్రవర్తి ఆధ్వర్యంలో గణపతి హోమాన్ని నిర్వహించి పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ సుజాత, దేవాదాయశాఖ డీఈ సైదా, ఏఈ రామకృష్ణ, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బుద్ధ నాగజగదీశ్వరరావు, కొణతాల వెంకటరావు, మళ్ల సురేంద్ర, బీఎస్ఎంకె జోగినాయుడు, ఆదారి జగన్నాథరావు, దేవస్థానం మాజీ చైర్మన్ పీలా వెంకట జగ్గారావు, జిల్లా తెలుగు మహిళా ప్రచార కార్యదర్శి కొణతాల రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రాంతంలో బీజేపీ సంబరాలు



మల్కాపురం, న్యూస్‌లీడర్:
జీవీఎంసి 48 వార్డు రామకృష్ణపురంలో శనివారం బీజేపీ రెండు రాష్ట్రాల్లో విజయం సాధించిన సందర్భంగా, బీజేపీ నగర ఓబీసీ ఉపాధ్యక్షుడు శరగడం పత్నిరావు, కేకుకట్ సంబరాలు చేసుకొన్నారు. త్రిపుర, నాగాలాండ్‌లో విజయ సాధించిన బీజేపీ 2019 ఎన్నికలో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షుడు పి.తాతాజీ, బీజేపీ కార్యకర్తలు జి.ఎస్.సి.గుప్త, ఆర్.కె.తివారి, పి.ఉదయకుమార్, ఏ.కె.సూక్ష జీవదేకర్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన



దాబాగార్డెన్స్, న్యూస్‌లీడర్:
క్షయ వ్యాధి సోకకుండా పలు జాగ్రత్తలు, సూచనలు పాటించవల్సినవాటిపై అవగాహన వుండాలని ప్రతినిధులు పేర్కొన్నారు. క్షయ వ్యాధి నివారణకు అవగాహన కార్యక్రమం పెద్ద జాలరిపేటలో నిర్వహించారు. ఎరల్ట్ విజన్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం తేజస్విని థియేటర్స్ ఆర్ట్స్ విశాఖ కళాకారులు వ్యాధి నివారణ, జాగ్రత్తలు పై వారి గళం ద్వార వినిపించి ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే నాటిక కూడా ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాకారులు దివాకర్ వంకాయల, దప్పు ప్రసాద్, బల్ల లోకేశ, పెంద్యాల లలిత, నీలకంఠం కృష్ణవేణి పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం

గోపాలపట్నం, న్యూస్‌లీడర్:
కళింగ వైశ్య సంక్షేమ సంఘం గోపాలపట్నంలో 30 పడకల ఆసుపత్రిలో మెగా రక్తదాన శిబిరాన్ని బ్యాంకు ద్వారా కళింగ వైశ్య సభ్యులతో పాటు యువకులు ఈ రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తాన్ని అందజేశారు. విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ కులసంఘాలు కూడా సామాజిక సేవలో పాల్గొని అందరికీ మార్గదర్శకం కావాలన్నారు. ప్రసూతి వైద్యాలయం చైర్మన్ చింతల భాస్కర్, కార్యవర్గ సభ్యులు, ఆసుపత్రి డాక్టర్ సుజాత, ఎఎస్ రాజా డాక్టర్లు అఖిల్, మేనేజర్, రామ్ రవిశంకర్ పాల్గొన్నారు.



ప్రభుత్వ స్థలాలు కబ్జా



గోపాలపట్నం, న్యూస్‌లీడర్:
చెరువు గర్భాలను,ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికారులే కబ్జాదారులతోచేయి కలిపితే ఇంకేముంది. రాత్రికి రాత్రే కోట్లాది రూపాయల ప్రభుత్వ భూమి కబ్జా జరుగుతుంది. ఈ విషయంపై 66వ వార్డు వైసీపీ అధ్యక్షుడు దొడ్డి కిరణ్ ఆధ్వర్యంలో కొంతమంది జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. దొడ్డికిరణ్ మాట్లాడుతూ 66వ వార్డులో వందలాది ఎకరాల విలువైన ప్రభుత్వ భూములున్నాయని స్థానిక నేతలు కొంతమంది ఈ భూములు కబ్జా చేస్తున్నా అధికారులు వచ్చి చూడటమే తప్ప చర్యలు తీసుకోలేనందునే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామ న్నారు. కలెక్టర్ ఈ ఫిర్యాదుపై స్పందించి చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. ఎన్టీఆర్ హౌసింగ్ స్కీమ్ పేరుతో ఖాళీ పోరంబోకు స్థలాల్లో ఇళ్లు ఉన్నట్లు చూపించి ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారని అందుకు ఇళ్లు ఉందా లేదా.. ఇది ప్రభుత్వ స్థలమా కాదా అనే తనిఖీ నిర్వహించకుండా కబ్జాదారులతో హౌసింగ్ అధికారులు, జీవీఎంసీ అధికారులతో చేతులు కలిపారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ స్థలాలను కాపాడే బాధ్యత అధికారులు తీసుకోవాలన్నారు.

ఎస్సీకాలనీలో దళిత-తేజం తెలుగుదేశం



మల్కాపురం, న్యూస్‌లీడర్:
మల్కాపురం జీవీఎంసి 49 వార్డు ఎస్సీకాలనీలో అంబేద్కర్ విగ్రహం వద్ద దళితతేజం-తెలుగుదేశం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పశ్చిమ నియోజక వర్గ ఎమ్మెల్యే పి.గణబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళితల సమస్యలు కోసం తెలుగుదేశం పార్టీ కృషి వల్లనే అంబేద్కర్ ఆశయాలు నేరవేరుతాయన్నారు. అనంతరం 49 వార్డు టీడీపీ అధ్యక్షుడు మజ్జి సోమేశ్ మాట్లాడుతూ 49 వార్డులో తెలుగుదేశం పార్టీ చేసినా అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పుచ్చ విజయకుమార్, టీడీపీ సినియర్ నాయకులు శీరం పైడిరాజు, కాకర రమణ, టీడీపీ అర్బన్ జిల్లా కార్యదర్శి కాకి పొలిరెడ్డి, ఆది, 49 వార్డు, ఎస్సీసెల్ భూలోకరావు, పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలి



అభివృద్ధికి నోచుకోని స్టేషన్ రోడ్డు


ఎలమంచిలి, న్యూస్‌లీడర్:
ఎలమంచిలి మున్సిపాల్టీలో పట్టణంతో పాటు పల్లెల్లో కూడా ప్రజలు వినోదం కోసం పార్కులు నిర్మాణం చేపడతామని గత మూడు సంవత్సరాల నుంచి మాటలు తప్ప పనులు ప్రారంభం కాలేదని ప్రజలు విసుగు చెందుతున్నారు. గత రెండు సంవత్సరాల క్రితం ఎలమంచిలి పట్టణంలో కొమ్మయ్య గుండం చెరువు చుట్టూ పార్కుతో పాటు ప్రజలు మార్నింగ్ వాక్ చేయడానికి అనుకూలంగా వాకింగ్ ట్రాక్ కూడా నిర్మిస్తామని రెండు సంవత్సరాల క్రితం 11 లక్షలు నిధులతో నిర్మాణం చేయడానికి కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు. తరువాత కాలంలో ఆ నిధులు చాలవు. భారీ బడ్జెట్‌తో నిర్మాణం చేస్తానన్నారు. ఇప్పుడు ఆ జాసే లేదు. ఇక స్టేషన్ రోడ్డు ఎప్పటి నుంచో డబుల్‌రోడ్డు వేసినా అభివృద్ధి లేదని రోడ్ల మధ్యలో గార్డెన్ ఏర్పాటు చేసి ఆహ్లాదకరంగా ఉండేందుకు రోడ్డు మధ్యలో పిట్రమెన్స్ లైట్లు వేయడానికి 20 లక్షలు ఖర్చుతో పనులు చేపట్టారు. రోడ్డు మధ్యలో ట్రెంచ్ నిర్మించి గార్డె కోసం కాగితంపూల మొక్కలు పెంచారు తప్ప ఆహ్లాదకరమైన గార్డెన్ లేదు. ఆ లైట్లు సంగతి పాలకులు అధికారులు మరిచిపోయారు. మున్సిపాలిటీలో వినోదానికి అవసరమైన ప్రదేశాలు లేకపోయినా ఇంటి పన్ను వసూలులో ఈ పన్ను కూడా కలిపి వసూలు చేస్తారు కాని ఎలమంచిలి మున్సిపాల్టి ఏర్పడి సుమారు ఎనిమిది సంవత్సరాలు గడిచినా ప్రజలు వినోదాలకు అవసరమైన పార్కులు, స్టేడియంలు కళావేదికలు నిర్మాణంలో వెనుకబడి ఉందనే చెప్పాలి దీనిపై దృష్టిసారించాలని ప్రజల కోరిక.

6న ఆటో కార్మికుల దేశ వ్యాప్త ఆందోళన

అనకాపల్లి, న్యూస్‌లీడర్:
ఆటో కార్మికులపై దాడులకు వ్యతిరేకంగా ఈ నెల ఆరున జరగనున్న మోటార్ కార్మికుల ఆందోళన జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయం ఎదురుగా ఆటో స్టాండ్‌ల వద్ద సమావేశం నిర్వహించారు. అనంతరం సంబంధిత వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వామనమూర్తి మాట్లాడుతూ దేశ వ్యాప్త ఆందోళనలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఆటో కార్మికులు ప్రదర్శనలు, నిరసనల్లో పాల్గొనాలని ఆయన కోరారు. నూతన రవాణా రోడ్డు బిల్లును ఉపసంహరించుకోవాలని, డ్రైవర్లకు తెలియకుండా ఫోటోలు తీసి కేసులు పెట్టడం ఆపాలని, పెట్రోలు, డీజిల్ జీఎస్టీ పరిధిలోకి తీసుకొచ్చి ధరలు తగ్గించాలని తదితర డిమాండ్లు పరిష్కరించాలని, ఆటోలకు మీటర్లు పెట్టవద్దని ప్రధాన డిమాండ్‌తో ఆందోళన చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు వైఎస్ భద్రం, జిల్లా కార్యదర్శి కోన లక్ష్మణ, ఆటో సంఘ నాయకులు అప్పలరాజు, ఎం.ఎ.నాయుడు, నాగరాజు, సత్యనారాయణ, అర్జునరావు, పైడిరాజు, రాము, సూర్యనారాయణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సుందరం విజయ్‌సేన ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

అచ్యుతాపురం, న్యూస్‌లీడర్:
అచ్యుతాపురం కేంద్రంలో దివ్యాంగుల ఆశ్రమ పాఠశాలలో సుందర విజయకుమార్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఆదివారం జరిగింది రక్తదాన శిబిరానికి యువత భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుందర విజయకుమార్ మాట్లాడుతూ యువతకు రక్తదాన మీద అవగాహన కల్పించి ప్రతి మనిషిలో రక్తం హెచ్‌బీ ఎంత, ఎంత వరకు ఉండాలని వివరిస్తూ డాక్టర్లు అవగాహన కల్పించారు రక్తదానం చేయడంవల్ల సగటు మనిషికి ప్రాణాలు కాపాడవచ్చు అన్నారు. ఈ ఆశయాన్ని యువత ఎక్కువగా ప్రజల్లోకి తీసుకెళ్లి తెలిసినట్లు చేస్తే మరీ ఎక్కువగా ప్రజల స్పందించి వాళ్లు కూడా ఈ స్ఫూర్తి తీసి రావొచ్చన్నారు ఈ కార్యక్రమంలో సుందరవిజయ సేన్ సభ్యులు కాలేజీ విద్యార్థులు ఎక్కువగా పాల్గొన్నారు.



చంద్రన్నబీమా అందజేత

ఎన్ఏడీ, న్యూస్‌లీడర్:
స్థానిక జీవీఎంసీ 42 వార్డు కరాసకి చెందిన బసవ నరసింగరావు (40) అనారోగ్యంతో రూ. 1.95 లక్షలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులకు పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పి గణబాబు బీమా సహాయాన్ని అందచేశారు. రూ.5 వేల బీమా సహాయాన్ని మృతుని బంధువులకు వారి ఖాతాల్లో ఇటీవల జమ చేశామని బీమా మిత్ర సభ్యురాలు భవానీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు కామాకుల నాగేశ్వరావు, నగర టీడీపీ కార్యదర్శి వెంకు మహంతి చంద్రశేఖర్, వార్డు కార్యదర్శి బలభద్రరాజు, బీమా మిత్ర సిబ్బంది, జన్మభూమి కమిటీ సభ్యులు స్థానికులు మహిళలు పాల్గొన్నారు.



శారదా గ్రంథాలయంలో మామ్ సినిమా ప్రదర్శన

అనకాపల్లి, న్యూస్‌లీడర్:
పట్టణంలోని రావుగోపాలరావు కళాక్షేత్రం ఎదురుగా గల శారదా గ్రంథాలయంలో ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు ప్రముఖ నటి స్వర్గీయ శ్రీదేవి సంతాప సభను అనకాపల్లి ఫిలిమ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పీఎస్ అజయ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె నటించిన మామ్ అనే సినిమాను ప్రదర్శిస్తున్నట్లు ఆయన తెలిపారు.

సెంట్రల్ లైటింగ్ ప్రారంభం



ప్రారంభిస్తున్న కమిషనర్ హరినారాయణ్, ఎమ్మెల్యే బండారు

పరవాడ, న్యూస్‌లీడర్:
మండలంలోని 56వ వార్డు పరిధిలో గల మర్రిపాలెం జంక్షన్ వద్ద సెంట్రల్ లైటింగ్‌ను జీవీఎంసీ కమిషనర్ హరినారాయణ్ చేతులు మీదుగా ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ కోటి 75లక్షల రూపాయల వ్యయంతో ఈ సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. అగనంపూడి వంతెన నుంచి సాలాపువానిపాలెం జీపీఆర్ లేఅవుట్ వరకు ప్రజల సౌకర్యార్థం చక్కని లైటింగ్ ఏర్పాటు చేశామని, మరో పది రోజుల్లో లంకెలపాలెం నుంచి ఫార్మాసిటీ మీదుగా పరవాడ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసి కమిషనర్ చేతులమీదుగా ప్రారంభిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో 56వ వార్డు తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి రౌతు శ్రీను తదితర నాయకులు పాల్గొన్నారు.

త్రిపుర, నాగలాండ్ విజయంపై బీజేపీ హర్షం

మాడుగుల, న్యూస్‌లీడర్:
భారత ప్రధాని నరేంద్రమోదీ, అమిత్‌షా కృషి ఫలితంగా త్రిపుర, నాగలాండ్ రాష్ట్రాలలో బీజేపీ ఘన విజయం సాధించిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పుట్టా రాంబాబు ఆదివారం ఉదయం అన్నారు. కేజేపురం గ్రామంలో ఆయన మాట్లాడుతూ ఇందిరాగాంధీ పరిపాలనలో 18 రాష్ట్రాలలో కాంగ్రెస్ పరిపాలించిందని నరేంద్రమోదీ ప్రధాని అయిన తరువాత 20 రాష్ట్రాలలో బీజేపీ పరిపాలన చేస్తుందన్నారు. కమ్యూనిస్టులకు కంచుకోటగా ఉన్న త్రిపురలో ఆ కంచుకోటను బీజేపీ బద్దలకొట్టిందన్నారు. 2013లో త్రిపుర రాష్ట్రంలో బీజేపీకి 1.5శాతం మాత్రమే ఓటర్లు ఉండేవారని, 2018నాటికి బీజేపీ 38 స్థానాలను గెలుచుకొని ఎనిమిది స్థానాలు మిత్ర పక్షాలు గెలిచే విధంగా చేసి బీజేపీ విజయం సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు పాలకుర్తి సూర్య ప్రకాశరావు, పొలమరశెట్టి రామునాయుడు, సూరిశెట్టి జగదీష్, శ్రీనాథు శేఖర్, పాలకుర్తి సూర్యనారాయణ పాల్గొన్నారు.

పెండింగ్ వ్యవసాయ కనెక్షన్లు మంజూరు చేస్తాం

రోలుగుంట, న్యూస్‌లీడర్: సాగునీటి మోటారు కనెక్షన్‌ల కోసం రైతులు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి ఏప్రిల్ నెలలో కనెక్షన్‌లు ఇస్తామని విద్యుత్ శాఖ నర్సీపట్నం డివిజన్ ఏడిఇ పి.సత్యనారాయణ తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న 50 యూనిట్ల రాయితీని 70కి పెంచిందన్నారు. ఉచితంగా సరఫరా చేసిన ఎల్ఈడి బల్బులు పని చేయకుంటే వాటిని పెదబడ్డేపల్లిలో ఏర్పాటు చేసిన విద్యుత్ సేవా కేంద్రానికి తీసుకెళ్లి కొత్త బల్బులు మార్చుకోవచ్చన్నారు. అలాగే పాత పంపుసెట్‌ల స్థానంలో ఉచితంగా కొత్త పంపుసెట్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

సంచలన వార్తాపత్రిక
లీడర్
ఉత్తరాంధ్ర జోన్
విశాఖపట్నం
సోమవారం 5-3-2018

తాటిపూడిలో బోటు షికారుకు సన్నాహాలు

విజయనగరం, న్యూస్‌లీడర్ : జిల్లా కలెక్టర్ వివేక్‌యాదవ్ అదేశాల మేరకు తాటిపూడి రిజర్వాయర్‌లో బోటు షికారుకు సన్నాహాలు కల్పించేందుకు జిల్లా రెవెన్యూ అధికారి జె.వి.మురళి, జిల్లా పర్యాటక అధికారి అనిత, సెట్విజ్ సీఈఓ ఎం. సత్యనారాయణ తదితర అధికారుల బృందం తాటిపూడి రిజర్వాయర్‌ను సందర్శించి పర్యాటకులకు బోటు షికారు సధుపాయాలు కల్పించేందుకు అధ్యయనం చేసారు.

ఎయిర్‌పోర్టులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి

కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజు


ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అశోక్ గజపతిరాజు

విజయనగరం, న్యూస్‌లీడర్ : దేశంలో విమానాశ్రయాలను ప్రయాణీకుల కోసం మాత్రమే కాకుండా సరకు రవాణా, విమానాల మరమ్మత్తులు తదితర అన్ని అవసరాలకు గరిష్ఠ స్థాయిలో వినియోగించుకోవాల్సి వుందని కేంద్ర పౌరవిమానయాన మంత్రి పి.అశోక్ గజపతిరాజు అన్నారు. దేశంలో కొత్తగా నిర్మించే ఎయిర్‌పోర్టులను ఈ దిశగా రూపొందిస్తున్నామని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా విమాన ప్రయాణీకుల పెరుగుదల మన దేశంలోనే అధికంగా వుందని మంత్రి పేర్కొన్నారు. దేశంలోని మిగిలిన రాష్ట్రాలతో మన రాష్ట్రంలో విమానయాన రంగంలో ప్రయాణీకుల పరంగా, విమాన సేవల పరంగా పెరుగుదల అధికంగా వుందన్నారు. విజయనగరం జిల్లాలోని భోగాపురం, నెల్లిమర్ల, రామభద్రపురం, బాడంగి, మెరకముడిదాంలలో నిర్మించనున్న ఐదు శాఖ గ్రంథాలయ భవనాలకు మంత్రి జిల్లా కేంద్రంలోని గ్రంథాలయ సంస్థ కేంద్ర కార్యాలయం వద్ద శంకుస్థాపన చేశారు. ఒక్కొక్కటి రూ.12.30 లక్షల వ్యయంతో ఐదు భవనాలను నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎల్.ఏ. మీసాల గీత, జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్, మునిసిపల్ చైర్‌పర్సన్ ప్రసాదుల రామకృష్ణ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొద్దల నరసింగరావు, జెడ్పీటీసీ సభ్యులు కొంపిల్లి రమణ, ఐవిపి రాజు ౹ పాల్గొన్నారు.

రఘులో ఇండియన్ ఐడల్ రేవంత్ సందడి

ఆడి పాడిన ఇంజనీరింగ్ విద్యార్థులు


వేదికపై పాడుతున్న ఐడల్ రేవంత్

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : రఘు విద్యా సంస్థల నిర్వహణలో రెండు రోజుల మేథో, సాంకేతిక, సాంస్కృతిక ఉత్సవం చక్రవ్యూహ 2018ను శనివారం ఉదయం విద్యాసంస్థల చైర్మన్ కలిదిండి రఘు ప్రారంభించారు. శనివారం ఉదయం నుంచి కళాశాలలో పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, రోబోటిక్ పోటీలు, వర్క్‌షాప్, రంగోలి, ఐఓటి, లాజిక్ క్రేకర్,ఇ వేస్ట్‌తో కళారూపాలు తయారు చేయడం వంటి విభిన్నకార్యక్రమాలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల మేధస్సుకు పదును పెడుతూ, సృజనను వెలికితీసే విధంగా కార్యక్రమాల నిర్వహణ జరిపారు.సాంస్కృతిక కార్యక్రమాలకు ఇండియన్ ఐడల్ రేవంత్ హాజరయ్యాడు. తన గళంతో తెలుగు, బాలీవుడ్ సినీ గీతాలను ఆలపించి అలరించాడు. రేవంత్‌తో విద్యార్థులు సైతం గళం కలిపారు. కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సాంస్కృతిక వేదికపై రాక్‌బాండ్, గీతాలాపన, నృత్య పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. రెండు రోజుల వార్షిక కార్యక్రమంలో తమ విద్యాసంస్థల విద్యార్థులతో పాటు ఇతర కళాశాలల విద్యార్థులు పెద్దసంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు.

విమానాశ్రయానికి సింహాద్రిఅప్పన్న పేరు పెట్టాలి


మంత్రికి వినతి పత్రం అందిస్తున్న సంఘం సభ్యులు

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : ఉత్తరాంధ్ర జిల్లాల్లో విశాఖ మహా నగరానికి దగ్గరగా ఉన్న భోగాపురంలో నిర్మిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతనంగా నిర్మిస్తున్న అంతర్జాతీయ విమానాశ్రయానికి శ్రీ వరహాలక్ష్మి నరసింహస్వామి దేవాలయం దగ్గరలో ఉన్నది. అందు వలన నూతనంగా నిర్మిస్తున్న అంతర్జాతీయ విమానాశ్రయానికి సింహాద్రి అప్పన్న అంతర్జాతీయ విమానాశ్రయంగా నామకరణం చేయాలని కోరుతూ శ్రీ సింహాద్రి అప్పన్న ప్రచార సమాఖ్య, మాధవధార, విశాఖపట్నం వారు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రివర్యులు పైడికొండల మాణిక్యాల రావుకు వినతిపత్రాన్ని అందించారు. ఈ విషయంలో నా సహకారం ఉంటుందని మంత్రి అన్నారు ఈ కార్యక్రమంలో ప్రముఖ అధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, సమాఖ్య కమిటీ సభ్యులు సనపల నారాయణస్వామి, పొన్నాడ రాంబాబు, సనపల భానుప్రకాష్, సనపల రమేష్ కుమార్, పేడాద సత్తిబాబు, చౌదరి కళ్యాణ కుమార్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు నిరంతర అధ్యయనం చేయాలి

ఏయూ వీసీ ఆచార్య నాగేశ్వరరావు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ నాగేశ్వరరావు

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : ఉపాధ్యాయులు నిరంతరం అధ్యయనం చేయాలని తద్వార మాత్రమే నూతన ఆర్థిక విధానాలను అవగతం చేసుకోవడం సాధ్యమని ఏయూ వీసీ ఆచార్య నాగేశ్వరరావు అన్నారు. యూజీసీ-హెచ్‌ఆర్‌డీసీ కేంద్రంలో ఏర్పాటు చేసిన అర్థశాస్త్రంలో ప్రత్యేక రిఫ్రెషర్ కోర్సు తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు నేడు సాంకేతికత బాగా అభివృద్ధి చెందిందని దానికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత గురువులపైనే వుందన్నారు. ఈ క్యార్యక్రమానికి మన రాష్ట్రం నుంచే కాకుండా తమిళనాడు, కర్నాటక,గోవా, మహారాష్ట్రలను చెందిన ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో యూజీసీ-హెచ్‌ఆర్‌డీసీ డైరెక్టర్ ఆచార్య పి.విశ్వనాధమ్, కోర్సు కో ఆర్డినేటర్ ఆచార్య ఎం.ప్రసాదరావు, ఆచార్య ఎన్ఏడీ . పాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి కళా వెంకట్రావు కుమార్తె వివాహం


వధూవరులతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, తదితరులు

విశాఖపట్నం: విద్యుత్తు శాఖ మంత్రి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కిమిడి కళా వెంకట్రావు ఏకైక కుమార్తె సాయిని అన్నపూర? యశస్విని వివాహ మహోత్సవం శనివారం రాత్రి విశాఖలో కన్నుల పండువగా జరిగింది. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల క్రీడా మైదానంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికలో ఈ వివాహ వేడుక జరిగింది. వధువు యశస్విని, వరుడు వీరవెంకటవరుణ్‌లను ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు ఆశీర్వదించారు. మంత్రి కళా వెంకట్రా వు ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించారు. వివాహ వేడుకకు శ్రీకాకుళం జిల్లాకు చెందిన మంత్రి అచ్చెన్నా యుడు, విప్ కూన రవికుమ్మా, ఎంపీ రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యేలు రమణమూర్తి, కలమట వెంకటరమణ, ఎమ్మెల్సీ శత్రుచర్ల, ఎస్పీ త్రివిక్రమవర్మ, ఐటీడీఏ పీవో శివశంకర్, తదితరులు పాల్గొన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున తెదేపా నాయకులు హాజరయ్యారు.

ప్రత్యేక హోదా కోసం సీపీఎం ఛలో ఢిల్లీ



పోస్టర్ విడుదల చేస్తున్న సీపీఎం నేతలు


విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : అంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని హక్కులు, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ 20 ఫిబ్రవరి 2014న రాజ్యసభ సాక్షిగా ఇచ్చిన హామీలు, 2014 ఎన్నికల వేళ భారతీయ జనతాపార్టీ అంధ్రప్రదేశ్ మెనిపెస్టోలో పొందు పరి చిన అంశాలు నాలుగు సంవత్సరాలు పూర్తి కావొస్తున్నా ఇప్పటికి అమలుకు నోచుకోలేదు. అందుకే ప్రత్యేహోదా, విభజన హామీలు అమలు చేయాలని వామపక్ష పార్టీల ఆందోళనలో భాగం గా మార్చి 6,7 తేదీల్లో ఛలో ఢిల్లీ కార్యక్రమానికి సిపిఎం విశాఖ జిల్లా కమిటీ సభ్యులు వి.వి.శ్రీనివాసరావు, ఎస్.వి. నాయుడు, కార్యకర్తలు కె.నర్సయ్య, పి.రామన్న బయలుదేరి వెళుతున్నట్టు ఆపార్టీ జిల్లా కార్యదర్శి లోకనాథం తెలిపారు.

మరుగు దొడ్ల నిర్మాణాలపై కలెక్టర్ అసంతృప్తి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : నిర్ణీత గడువులో మరుగు దొడ్ల నిర్మాణాలను పూర్తిచేసి బహిరంగ మలవిసర్జన రహిత జిల్లాగా విశాఖను తీర్చిదిద్దలేకపోయారని మండలాల ప్రత్యేక అధికారులు, రెవిన్యూ డివిజనల్ అధికారులు, మండల స్థాయి అధికారులపై జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ తీవ్ర అసంతృప్తిని, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. రానున్న వారం రోజుల్లో 10 వ తేదీకల్లా మరుగుదొడ్ల నిర్మాణాలను అన్నింటినీ పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రతి రోజూ టెలీ కాన్ఫరెన్సు నిర్వహిస్తూ మరుగుదొడ్ల నిర్మాణాల ప్రగతిని సమీక్షిస్తాని, వీటి నిర్మాణాల్లో ఏమాత్రం అలక్ష్యం వహించినా పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. శనివారం మండలాల ప్రత్యేక అధికారులు, రెవిన్యూ డివిజనల్ అధికారులు, మండల స్థాయి అదికారులతో కలెక్టర్ వీడియోకాన్ఫరెన్సు నిర్వహించి మరుగుదొడ్ల నిర్మాణం, జియోట్యాగింగ్ పనుల ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 15 కల్లా మరుగుదొడ్ల నిర్మాణాలను పూర్తిచేయాలని గడువు విదించినప్పటికీ నేటి వరకూ పూర్తిచేయకపోవడానికి కారణాలేంటని అధికారులను ఆయన నిలదీశారు. మండల ప్రత్యేక అధికారులు, రెవిన్యూ డివిజనల్ అధికారులు క్షేత్ర స్థాయిలో తరచుగా పర్యటిస్తూ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, సకాలంలో పూర్తయ్యేలా పర్యవేక్షించాలని ఆదేశించారు.

10 పరీక్ష కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి: పీవో


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పీఓ

సీతంపేట న్యూస్‌లీడర్ .మార్చి 15 నుంచి జరిగే 10వ తరగతి కేంద్రంలలో అన్ని సౌకర్యాలు కల్పించాలని ఐటిడిఏ పీఓ శివశంకర్ కోరారు .శనివారం ఐటిడిఏ సమావేశంలో ఆశ్రమ పాఠశాలల ,గురుకుల ప్రధానోపా ధ్యాయులతో పీవో సమావేశమయ్యారు . ఈ సందరభ్రంగా పీవో మాట్లాడుతూ పరీక్షలకు విద్యార్థులను మానసికంగా సిద్ధం చేయాలని అన్నారు.అన్ని పరీక్ష కేంద్రాలకు సీసీ కెమెరా అమర్చాలని కోరారు . ఈ సమావేశంలో డిడి సీతారామయ్య ,డిప్యూటీ డిఈఓ రామ్మోహన్ ఆయన పలువురు అధికారులు పాల్గొన్నారు .

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా కేజీబీవీలు

మంత్రి గంటా శ్రీనివాసరావు

భీమునిపట్నం,న్యూస్‌లీడర్ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అన్ని అధునాతన వసతులు, సౌకర్యాలతో కె.జి.బి.వి.లు ఉన్నాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. రూ.1.25 కోట్లతో భీమిలిలో నిర్మించిన కె.జి.బి.వి.ని మంత్రి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో 352 కె.జి.బి.వి.లు ఉన్నాయని, ఒక కె.జి.బి.వి. మినహా మిగిలిన అన్ని కె.జి.బి.వి.లకు సొంత భవనాలు ఉన్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగానున్న 352 కె.జి.బి. వి.ల్లో 6 నుండి 10 వ తరగతి విద్యార్థులు సుమారు 70 వేల 400 మంది విద్యను అభ్యశిస్తున్నట్లు మంత్రి తెలి పారు. ఇప్పటి వరకూ వీటిలో కొన్నింటిలోనే ఇంటర్మీ డియట్ విద్యను ప్రవేశ పెట్టడం జరిగిందని, వచ్చే ఏడాది నుండి అన్ని కె.జి.బి.వి.ల్లో ఇంటర్మీడియట్ విద్య ను ప్రవేశ పెడుతున్నట్లు మంత్రి తెలిపారు. వీటన్నింటిలో క్వాలిఫైడ్ టీచర్లు ఉన్నారని, మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. చదువుతో పాటు క్రీడల్లో కూడా విద్యార్థులు రాణిస్తున్నారన్నారు. విద్యార్థి దశ నుండే లక్ష్యాలను నిర్దేశించుకొని కృషిచేస్తే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని విద్యార్థులకు ఆయన సూచించారు. ఉపాధ్యాయులు కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ విద్యార్థులకు చక్కగా గైడ్ చేస్తే ఉత్తమ ఫలితాలతో పాటు మంచి పౌరులుగా ఎదుగుతారని ఆయన అన్నారు. భీమిలి వెళుతూ మార్గం మధ్యలోనున్న చేపలుప్పాడు బి.సి.వెల్ఫేర్ వసతి గృహాన్ని మంత్రి ఆకస్మిక తనిఖీచేశారు. వసతి గృహ నిర్వహణ అధ్వాసంగా ఉండటాన్ని మంత్రి గమనించి బీసీవెల్ఫేర్ ఆఫీసర్ కృష్ణారావుపై ఆగ్రహాన్ని వ్యక్తంచేశారు కృష్ణారావుపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆశాఖ ఉప సంచాలకులను ఆదేశించారు.

చౌకధరల దుకాణాలలో డిస్‌ప్లే బోర్డులు తప్పని సరి


మంత్రి పత్తిపాటి పుల్లారావు



విశాఖపట్నం, న్యూస్‌లీడర్ ప్రతి ఒక్క చౌకధరల దుకాణాలలో తప్పని సరిగా నిత్యావసర సరుకుల పంపిణీ వివరాలకు సంబందించిన డిస్ ప్లే బోర్డును పెట్టాల్సిందిగా రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి పత్తిపాటి పుల్లారావు అన్నారు. సీతమ్మధార సర్కిల్ 2 పరిధిలోగల 206 ఎఫ్ పీ షాపును మంత్రి ఆకస్మిక తనిఖీ చేసారు. అక్కడ గల బియ్యం, కందిపప్పు, నూనె తదితరాలను పరిశీలించారు. ఈ పోస్ మిషన్ వాడుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదవారికి నాణ్యమైన నిత్యావసర సరుకులను సబ్సిడీ ధరలకే అందించడానికే కృషి చేస్తున్నదన్నారు. అన్ని చౌక ధరల దుకాణాలలో ఈ పోస్ మిషన్ వాడకం తప్పనిసరియన్నారు. రేషన్ కార్డు దారులకు ఈ పోస్ మిషన్ వాడకం పై అవగాహన కల్పించాలన్నారు. నిత్యావసర సరుకులను నిర్దేశించిన సమయంలో తప్పని సరిగా పంపిణీ చేయాలన్నారు. మంత్రి పర్యటనలో జాయింట్ కలెక్టర్ శ్రీమతి జి.సృజన, డి ఎస్ ఓ నిర్మలాబాయి ఇతర అధికారులు పాల్గొన్నారు.

మార్చి నెలాఖరులోగ ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు ఖర్చు చేయాలి

కమిషన్ చైర్మన్ కారెం శివాజి


కారెం శివాజికి వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల అభ్యున్నతికై రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని రాష్ట్ర ఎస్ సి, ఎస్ టి కమిషన్ చైర్మన్ కారెం శివాజి తెలిపారు రాయల్ ఫోర్ట్ హోటల్లో ఎస్సీ, ఎస్టీలకు చెందిన పలువురు తమ వినతులను చైర్మన్‌కు అందజే సారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడు తూ అన్ని ప్రభుత్వ శాఖలలో దళిత గిరిజనులకు కేటా యించిన సబ్ ప్లాన్ కు సంబందించిన నిధులను మార్చి నెలాఖరు లోపల ఖర్చు చేయాల్సిందిగా ఆదేశించడం జరిగిందని, లేనిపక్షంలో వారిపై తగుచర్యలు తీసు కోవడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రతి జిల్లాలో ఎస్.సి, ఎస్.టి బాక్‌లాగ్ పోస్టులను సత్వరమే భర్తీ చేయాలన్నారు. కమిషన్ ద్వారా పంపిన సిఫార్సులను పరిశీలించి సత్వరమే బాధితులకు న్యాయం చేయాలన్నారు. విద్యార్థులకు కుల ధృవీకరణ పత్రాలను ఇవ్వకుండా ఇన్వెస్టిగేషన్ పేరుతో జాప్యం జరుగు చున్నందున వారు నష్టపోతున్నారన్నారు. ఎట్రాసిటి కేసులకు సంబందించి బాధితులకు నష్టపరిహారాన్ని సకాలంలో అందించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ సమక్షంలో ప్రతి నెలాఖరున జిల్లా అధికారులతో పౌర హక్కుల దినోత్సవం నిర్వహిం చాలన్నారు. అన్యాక్రాంతమైన దళిత, గిరిజన భూములను పరిశీలించి వారికి అప్పగించాలన్నారు. ప్రతి జిల్లాలో దళిత గిరిజన విద్యార్థుల డ్రాపౌట్స్ నియంత్రించే విధంగా సర్వశిక్ష అభియాన్, డీఈఓ, సాంఘీక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖల అధికారులు సంయుక్తంగా సమీక్షించి డ్రాపౌట్స్ ను తగ్గించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర , ప్రభుత్వ రంగ సంస్థలలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ ను పాటించాలన్నారు. చైర్మన్ శనివారం పర్యటనలో భాగంగా సుమారు 150 వినతులను స్వీకరించారు. వాటిలో ముఖ్యంగా భూ సంబందిత, ఉద్యోగాలు, ఎట్రాసిటి కేసులు, విద్యార్థుల సమస్యలపై వినతులను తీసుకోవడం జరిగిందన్నారు. కమిషన్ చైర్మన్ తో పాటు సభ్యులు సివేరి సోమ , ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటి సభ్యులు మల్లేటి సన్యాసయ్య, సుజాత, పలువురు దళిత నేతలు పాల్గొన్నారు.

జిల్లా సీఆర్‌పీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక




విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : విశాఖ ఫోరం చైల్డ్ రైట్స్ నూతన కమిటీ ఎన్నిక ఆంధ్రా యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ భవనంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో జరిగింది. ఫోరం నూతన అధ్యక్షునిగా ప్రొఫెసర్ ఆర్డీ.సంపత్ కుమార్, ఉపాధ్యక్షునిగా నరవ ప్రకాశరావు, కార్యదర్శిగా బి.హరి, సహకార్యదర్శులుగా రహిమున్నీసా బేగం, డి.వీరభద్రరావు, ట్రెజరర్‌గా వి. హేమాసుందరరావు, సభ్యులుగా ఉజ్వల స్వరూపకుమార్, దేవిడ్‌రాజు, డాక్టర్ శశిప్రభ, డాక్టర్ వై.రమేష్, దిలీప్‌కుమార్ పాత్రో, అబ్దుల్ రఫీక్ ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు గొండు సీతారాం, కె.గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో ఎన్‌సీసీ సర్టిఫికేట్ పరీక్ష




విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : ఆంధ్రా యూని వర్సిటీలో 13వ అంధ్రా బెటానియన్‌కు చెందిన 144 మంది కెడిట్లకు ఈ ప్రాటికల్ పరీక్షలు నిర్వహించారు, ఈ పరీక్షలు కల్నన్ శ్రీనివాస్, కల్నల్ అమిత్ శర్మ, ఎస్‌కె.నాయక్ ఆధ్వర్యంలో విశాఖపట్నం గ్రూప్ కమాండర్ వి.వి.ఎస్ రాజు పర్యవేక్షణలో జరిగాయి ఈ పరీక్షలో కెప్టెన్ ఎన్.రామకృష్ణ, కెప్టెన్ టి.బ్రహ్మానందరెడ్డి, కళ్యాన్ అశోక్‌తో పాటు పలువురు ఏఎన్‌ఓలు, పీటీ స్టాప్ హాజరయ్యారు.

మహిళా దినోత్సవ పోస్టర్ విడుదల


పోస్టర్ విడుదల చేస్తున్న ప్రజానాట్యమండలి సభ్యులు


విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ కళా ప్రదర్శనలను ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో 6,7తేదీలలో కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించనున్నట్టు ఆపార్టీ అధ్యక్ష, కార్యదర్శులు దండు నాగేశ్వరరావు, జి.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ప్రజానాట్యమండలి నగర సహాయ కార్యదర్శులు సుభాషిణి, ఎం.చంటి.ఉపాధ్యక్షులు కె.వెంకటేష్, బొబ్బాది అప్పారావు, దాసరి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అన్ని విభాగాలను ఆధునీకరిస్తాం : పీఓ


ప్రారంబోత్సవం చేస్తున్న పీఓ శివశంకర్

సీతంపేట న్యూస్‌లీడర్ : సీతంపేట ఐటిడిఏ లోని అన్ని విభాగాలను వ్యక్తిగత క్యాబిన్లతోఆధునీకరిస్తామని ఐటడీఏ పీవో శివ శంకర్ తెలిపారు . ఇటీవల వ్యక్తి గత క్యాబిన్లతో ఆధునీకరించిన మెడికల్ విభాగాన్ని పీఓ,ఆయన సతీమణి ఏపీడీ డి.లక్ష్మీ కలిసి ప్రారంభించారు .ఈ సందరర్భంగా పీవో మాట్లాడుతూ ఉద్యోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పనిచేసేందుకు వీలుగా క్యాబిన్లను ఏర్పాటు చేస్తున్నట్లు అన్నారు .దశలవారీగా అన్ని విభాగాలను కార్పొరేట్ స్థాయిలో ఏమాత్రం తగ్గకుండా ఆధునీకరిస్తామని తెలిపేరు .ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఆర్‌డీఏ హెచ్ఓ డాక్టర్ నరేష్‌కుమార్ ,ఏవో.అనందరావు,మేనేజర్ నాగేశ్వరరావు ,పీఏఓ భవానీ శంకర్ తదితరులు పాల్గొన్నారు .

నయన మనోహరంగా హరినామ సంకీర్తన


ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : జిల్లా పరిషత్ ప్రధాన కూడలిలో వేంచేసియు న్న శ్రీ కృష్ణ మందిరం ప్రాంగణంలో గల శ్రీ కృష్ణ చైతన్య మఠం ఆధ్వర్యంలో నగర సంకీర్తన అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. శ్రీ కృష్ణ చైతన్య మఠం ఆచార్యులు త్రిదండి స్వామి బి.ఎస్. కేశవ్ మహారాజ్ నేతృత్వంలో ఫాల్గుణ పూర్ణిమ, శ్రీ చైతన్య మహాప్రభు వు జయంతి సందర్భంగా మందిరంలో శ్రీమాయాపురం నవదీపం దామం నుంచి అనుసరించి వేంచేసియున్న సాధు కొంగువులు, సన్యాసులు, బ్రహ్మాచారులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ మహాప్రభు, నిత్యానంద ప్రభువు ఉత్సవ విగ్రహాల రథోత్సవాలతోపాటు కోలాటం, తప్పెట గుళ్ళు, శాస్త్రీయ, జానపద నృత్యాలు, అఖండ హరినామ సంకీర్తనం, మహా దీప ప్రజ్వలనం కోటి హరినామ జపం, పూజాభిషేకం ప్రసాదాల వితరణతో ఊరేగింపు జిల్లా పరిషత్ నుంచి కలెక్టరేట్, జగదాంబ జంక్షన్, టర్నర్ చౌల్ట్రీ, పూర్ణా మార్కెట్, కురుపాం మార్కెట్ మీదుగా పాత పోస్టాఫీస్ వద్ద ఉత్సవాలు ముగిశాయి.


సంచలన వార్తాపత్రిక
లీడర్
సాహిత్యం
విశాఖపట్నం
సోమవారం 5-3-2018


తనకు ఇష్టమైన పనిని గొప్ప మూర్ఖుడు కూడా పూర్తి చేయగలడు.
కానీ బుద్ధిమంతుడు మాత్రం తాను చేస్తున్న ప్రతి పనిని తనకు
ఇష్టమైన పనిగా మార్చుకుంటాడు.
ఒక దీపానికి వేలాది జ్యోతులను వెలిగించినా దాని కాంతి ఏమాత్రం
తగ్గనట్టే, ఎదుటివారితో సంతోషాన్ని దు:ఖాన్ని పంచుకుంటే
మనకు తరిగేది ఏమీ ఉండదు.



నాయుని కృష్ణమూర్తికి సాహిత్య నివాళి

అరవై ఏడేళ్ళ నాయుని కృష్ణమూర్తి గారు విద్యారంగానికి ఎనలేని సేవలు అందచేశారు. వారి జీవిత కాలంలో విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కన్నా ముందరే పుస్తకాల ప్రచురణ చేసిన సంకల్ప దక్షులు. జయమ్ (మహాభారతం మూలకథ), మహాభాగవతం (మూడు భాగాలు), రామాయణం, ఏంలేదు (కథలు), కథలు, మనసు గుర్రమురోరి మనిషీ (నవల), యామినీ కుంతలాలు (నవల), ప్రలోభం (నవల), ఖేల 333, కాటుక కరిగిపోయింది, విజయవాణి తెలుగు ఇంగ్లీషు నిఘంటువు, తెలుగు ఇంగ్లీషు నిఘంటువు, పుస్తక షణ్ముఖం అభినందన సంచిక (సాకం నాగరాజతో కలిసి), మన బతుకులు మారాలి, ఈ కోతి ఈ డ్రామాకు పనికొస్తుందా? (ఏకాంకిక), వియోగవిభావరి (ఏకాంకిక) వారి రచనలుగా వెలుగు చూశాయి. చిన్నపిల్లల కోసం 125 పుస్తకాలు రూపొందించి విజయవాణి సంస్థలో ముద్రించారు. ప్రాథమిక స్థాయి విద్యార్థులకు అర్థమయ్యే భాషలో వీటిని రూపొందించారు. ఐదున్నర సంవత్సరాలు శ్రమించి విద్యార్థుల కోసం తెలుగు-ఇంగ్లిష్ నిఘంటువును, నాలుగు వేల పదాలతో ఇంగ్లిష్‌లో సచిత్ర నిఘంటువును, ఎనిమిదివేల పదాలతో తెలుగు-ఇంగ్లిష్ విద్యార్థి నిఘంటువును, బొమ్మల నిఘంటువులను రూపొందించారు. ముప్పై ఏళ్ల కిందట 7, 10 తరగతులంటే విద్యార్థులకు భయం. పబ్లిక్ పరీక్షలంటే ఆందోళన. ఆ సమయంలో ఏడోతరగతికి 'మాబడి', పదోతరగతి విద్యార్థుల కోసం 'పాఠశాల' పుస్తకాలను రాసి పిల్లలు సులువైన పద్ధతిలో పరీక్షలకు సిద్ధమయ్యేవిధంగా రూపొందించారు. చెన్నైలో వీటిని ముద్రిస్తే పిల్లలకు ఆర్థికభారం అధికమవుతుందని భావించి చౌడేపల్లెలోనే ముద్రించి గ్రామీణ పిల్లలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇందుకు అవసరమైన ముద్రణాలయం చౌడేపల్లెలోనే ఏర్పాటుచేశారు. జయం మూల మహాభారత కథ నవలగా రాస్తున్న సంగతి వారు సాక్షి పత్రికలో ఒక వ్యాసం రాయగా, ఏది మూల రచనో ఎలా తెలుసుకునే వీలున్నదో అని నేను రాసినది కూడా సాక్షి పత్రికలో వచ్చినప్పుడు, నాయుని కృష్ణమూర్తి గారే స్వయంగా ఫోన్ చేసి, వారి రచనా ప్రణాళిక వివరించారు. నా వ్యాసంలో ప్రస్తావిత అంశాలకు తన దృష్టికోణం ఏమిటో తెలియచేసారు. అలా ఇద్దరమూ ఫోన్లో మాట్లాడు కున్నాము కూడా. వారు చిన్న వయసులోనే, ఇలా కన్ను మూయడం సాహిత్యరం గానికి లోటు . వారి కథా రచన ఎలా ఉండేదో తెలిసేలా, ఒక కథానిక "మాట్లాడరేమండీ?" వారికి నివాళిగా ముద్రిస్తున్నాము. చదవండి.





మాట్లాడరేమండీ

ఆంధ్రప్రభ వీక్లీ 8-1-1997 సంచికలో ముద్రణ

"ఏమండీ.. చచ్చిన తరువాత ఆ దేవుణ్ని నిలదీసి అడగాలి. వచ్చే జన్మలో అయినా నన్ను మొగుడిగా పుట్టించు నాయనా అని. మొగుడయితే దర్జాగా తొమ్మిదింటికే పడక మీదికి ఎక్కేయొచ్చు. వంటిల్లు సర్దాల్సిన అవసరం లేదు. తలుపులన్నీ మూశామో లేదో అని..

అయ్యో.. ముందు తలుపుకు గడి పెట్టలేదేమో..

ఏమండీ ఏమండీ.. కొంచెం లేచి గడి పెట్టానేమో చూసి వస్తారా... అసలే రోజులు బాగుండడం లేదు. ఎక్కడబడితే అక్కడ దొంగతనాలు జరుగుతున్నాయి. ఏమండీ మిమ్మల్నేనండీ.. ప్లీజ్ ఒక్కమారు వెళ్లి చూడండి. ఈ లోపల నేను బాత్రూంలోకి వెళ్లి వస్తాను.

వినబడదు. నా మాట మీకు వినబడదు. నా పిచ్చిగాని పెళ్లయి పదారేళ్లు గడిచింతరువాత కూడా పెళ్లాం మాట మొగుడికి వినబడుతుందా? నేను ఇంతగా గొంతు చించుకొంటున్నా మీకు వినిపించడం లేదు. సరే.. ఇంటికి చుట్టాల్తోనో, స్నేహితుల్తోనో ఎవరన్నా వయసులో ఉన్న ఆడపిల్లలు వస్తే వాళ్లు నంగినంగిగా మాట్లాడినా మీకెలా వినిపిస్తుందండీ? పోయినవారం నా క్లాస్‌మేట్ లావణ్య దాని చెల్లెలు మనింటికి వచ్చారు. వాళ్లు రాకముందే ఎక్కడికో అర్జెంటుగా వెళ్లాలి అని బట్టలు వేసుకొని రెడీ అయిన మీరు వాళ్లను చూసి ఆగిపోయారు. నేను గమనిస్తూనే ఉన్నాను. మీ కళ్లన్నీ లావణ్య చెల్లెలుపైనే. మేము ముందు రూములో కూర్చుని ఏదో మాట్లాడుతున్నాము. మీరేమో బెడ్ రూములో కూర్చుని ఏవో పుస్తకాలు తిరగేస్తున్నట్టు నటిస్తున్నారు. ఆ లావణ్య చెల్లెలు మంచి నీళ్లు అడిగింది. పక్కనే కూర్చున్న నాకయితే దాని నంగి మాటలు సరిగా వినిపించలేదు గాని ఎక్కడో ఉన్న మీకు ఎలా వినిపించింది?ఔ

ఇదిగో ఆ అమ్మాయి మంచినీళ్లు అడుగుతోంది చూడు అని పని కట్టుకొని లేచి వచ్చి చెబుతారా... అమ్మమ్మ! ఏం శ్రద్ధండీ! ఎంత అతిథి మర్యాద! అవన్నీ వినబడతాయి. కంటికి కాస్త నదురుగా కనిపించే అమ్మాయి ఎవరు ఎలా మాట్లాడినా మీకు బాగానే వినిపిస్తుంది. నేను మాట్లాడితేనే మీకు వినబడదు. అరగంట నుండీ కొట్టుకొంటున్నాను. తలుపు గడి వేసుందో లేదో చూడమని.. మీకు వినబడదు. ఇదీ న్యాయంగానే ఉంది. రాత్రి పడుకునే ముందర తలుపు గడి వేసుందో లేదో చూసుకో వాల్సిన బాధ్యత ఇంటి ఇల్లాలిది అని స్థిరమైన అభిప్రాయం, తప్పునాదే.. ఇలాంటి తప్పులు ఎన్ని. ఈ జాడ్యం మీ వల్లనే నాకు వచ్చిందని అనుకొంటున్నాను. మీరు నన్ను ఏ విషయంలోనూ నమ్మరు. మీకు సంబంధించిన నేను కూడా అలాగే అయిపోయాను.

అయినా మీకీ మధ్య చిత్రమైన అనుమానాలు వస్తున్నాయి ఎందుకండీ! నా వయసు ఎంత అనుకొంటున్నారు? నేనింకా బాలా కుమారినా? నలభై ఏళ్లు దగ్గరికొస్తున్నాయి. నేను ఈ వయసులో ఎప్పుడన్నా గుమ్మం ముందు నిలబడుకోవడం తప్పయిపోతుందా? బజార్లో ఎవరన్నా తెలిసినవాళ్లు కనిపిస్తే మాట్లాడ్డం తప్పా?

నేను ఎవరితో మాట్లాడినా వాళ్లు మీ మూలంగా పరిచయం అయిన వాళ్లే కాదా.. అందరూ మీ స్నేహితులే కదా!

ఒక రోజు మీరు మీ స్నేహితుల్లో రాజశేఖర్ చెడ్డవాడని చెప్పారు. నిజమే కావచ్చు. మొన్న ఆ మహాశయుడు మార్కెట్ దగ్గర ఎదురుపడ్డాడు. కల్పించుకొని ఏదో మాట్లాడాడు. నేనెలా దుపులుకొని వచ్చేసేంది? మీరు అతని గురించి చెప్పిన సంగతి నాకేమో గుర్తుంది. అయినా, మర్యాద కోసం నిలబడి మాట్లాడాను. అది మరీ అపరాధం అయిపోయిందా? ఈ ప్రపంచంలో కేవలం పవిత్రమైన వాళ్లతోనే మట్లాడాలంటే సాధ్యమయ్యే విషయమేనా?

ఈ మధ్య స్వామీజీలు కూడా వార్తలలోకి ఎక్కుతున్నారు. పైకెళ్లిన తరువాత మోక్షం ఇప్పించమని లోపలి కెళ్తే ఇక్కడ చూపిస్తున్నారట.

ఎవర్ని నమ్మమంటారు? అయినా, ప్రతి ఒక్కరి జీవిత చరిత్రా తెలుసుకొని తరువాత మాట్లాడలంటే సాధ్యమయ్యే విషయమేనా?

మీ సంగతేమిటి? మీరందరూ పవిత్రమైన వ్యక్తులతోనే మాట్లాడుతున్నారా? అన్ని వేళలూ నేను మీ వెంట ఉండను కాబట్టి మీ సంగతి పూర్తిగా చెప్పలేను. కాని, బజార్లో మీతోబాటు కలిసి వెళ్లేటప్పుడు మీ కళ్లు ఎలా ఎలా ఎవరెవరి మీద పడతాయో నేను చాలామార్లు చూశాను. మీ చూపులకు అర్థం చెప్పమంటే మీరేం చెప్పగలరు? ఏమండీ.. ఒక సంగతీ ఖచ్చితంగా చెబుతాను. వినండి ప్రతి మగవారూ తన పెళ్లాం తప్ప కనబడే ప్రతి ఆడదీ వ్యభిచారి అన్న దృష్టితోనే చూస్తాడు. మీ మగ బుద్ధులు ఈ రోజువి కావు. సృష్టి మొదలయిం దగ్గర్నుండీ మీ ఆటలు ఇలాగే సాగుతున్నాయి.

వేదాలు రాసింది మీరే, పురాణాలు చెప్పింది మీరే, నీతి నియమాలు ఏర్పరచిందీ మీరే! పుణ్యకార్యాలు చేసి స్వర్గానికి వెళ్తే మీ కోసం రంభ, ఊర్వశి, తిలోత్తమ, మేనక ఎదురు చూస్తుంటారా? పవిత్రంగా బతికి చనిపోయే ఆడవాళ్ల సంగతేమిటి? స్వర్గంలో వాళ్ల కోసం ఎవరు ఎదురు చూస్తుంటారు? ఆ ఊహనన్నా భరించగలరా మీరు? మీకు స్వర్గంలో రంభ కావాలి కాని, మీ భార్యకు అదే స్వర్గంలో నలకూబరుడు అవసరం లేదు. ఈ ప్రశ్న నేను అడగడం లేదు. తస్లిమా నస్రీన్ ఎత్తి చూపే వరకూ చాలా మందికి ఇలా అడగాలన్న ఆలోచన రాలేదు. ఈ లోకంలో న్యాయమే నాకు అర్థం కావడం లేదు. ఒక పని మగవాడు చేస్తే తప్పుకాదు. అదే ఆడది చేస్తే తప్పు నాలుగేళ్లు పెళ్లి చేసుకోకుండా ఉంటే డిగ్రీ పూర్తి చేసేదాన్ని. డిగ్రీ ఒకటి చేతిలో ఉంటే నా బ్రతుకు ఎలా ఉండేదో ఏమో.. నా స్నేహితులు అంటూ ఉండేవాఉ. నువ్వు చదివితే పెద్ద ఆఫీసరని అయిపోతావే అని.. ఐఏఎస్సే పాసయి కలెక్టరు అయ్యే దాన్నేమో...

హుఁ... అవన్నీ తలచుకొని ఇప్పుడు బాధపడితే ఏం ప్రయోజనం? దేనికయినా పెట్టి పుట్టాలి అంటారు. నా నుదుటి మీద దేవుడు మొండి చేత్తో రాశాడు.

మంచం కోడు రాసుకొంటోంది. కొంచెం జరుగుతారా... ఈ మంచం పుట్టింటి నుండి తెచ్చానని హక్కుగా మిమ్మల్ని జరగమనడం లేదు. కొంచెం జరగండి. స్థలం సరిపోవడం లేదు. నిద్రపోతూ పక్కకు దొర్లి కింద పడితే మీకే ఇబ్బంది. ఏ ఎముకన్నా విరిగితే తెల్లారి హాస్పిటల్‌కు తీసుకెళ్లాల్సి ఉంటుంది. మీకు ఇబ్బంది అవుతుదని మీ మేలు కోరే చెబుతున్నాను.

అయినా మీరు అంత శ్రమ తీసుకొంటారనే నమ్మకమయితే నాకు లేదు. ఏ ఆటోవాడి చేతిలోనో పదిరూపాయలు పెట్టి హాస్పిటల్ కు తీసుకెళ్లమని చెప్పినా చెబుతారు. మీరు మాత్రం టింగు రంగా అని ఆఫీసుకు వెళ్తారు.

అయినా ఆ ఆఫీసులో ఏం పెట్టారని ఇరవై నాలుగ్గంటలూ దాన్ని పట్టుకొని వేళాడుతూ ఉంటారండీ నాకర్థం కాదు. ఎప్పుడయినా సరదాపడి ఇంకో సెలవు పెట్టండి, ఎక్కడికయినా వెళ్దాం అంటే అమ్మో చాలా పని ఉంది అంటారు. నిజం చెప్పండి, నాకు తెలీక అడుగుతున్నాను. కేవలం పని చెయ్యడం అనే ఇంట్రెస్టుతోనే మీరు ఆఫీసుకు వెళ్తున్నారా? ఎప్పట్నుంచో అనుకొంటున్నాను. ఒకమారు సడన్‌గా మీ ఆఫీసుకు వచ్చి మీ సీటు చూద్దామని.

నా అనుమానం మీ ఆఫీసులో అదేవత్తో త్రిపురసుందరి ఉంటుంది. దాని కోసం మీరు ఆఫీసు, ఆఫీసు అని ఏడుస్తున్నారని అనిపిస్తుంది. అదేదో నిజమో అబద్ధమో తేల్చుకొంటే మీ సంగతి తాడో పేడో నేనూ తేల్చుకోవచ్చు. దానికీ తీరిక దొరక్కుండా ఛస్తున్నాను. కాస్త జరుగుతారా... హమ్మయ్య... ఈ రోజు గ్రహగతులన్నీ బాగా ఉన్నట్టున్నాయి. కొంచెం బెడ్షీటు కూడా ఇవ్వండి....

ఇది డబుల్ బెడ్ షీటే... కొంచెం ఇవ్వొచ్చు... అయినా పెళ్లయిన కొత్తల్లో ఇలా అడుక్కొనే ఖర్మ ఉండేదా? గుప్తుల కాలం స్వర్ణయుగం అన్నట్టు ఏ ఆడదానికయినా పెళ్లయిన తర్వాత మూడేళ్లు జీవితంలో అత్యంత హాయిగా గడిచిపోతాయి. ఏమండీ నిద్రపోయారా అని అడిగే ప్రశ్న ఉండదు. కొంచెం జరుగుతారా అని అడుక్కోవలసిన పని లేదు. బెడ్షీట్ కొంచెం ఇవ్వండి అని ప్రాధేయ పడవలసిన అవసరం అంతకన్నా లేదు. తొమ్మిది కొట్టి కొట్టగానే - ఇంకా పని కాలేదా డియర్ - ఏమన్నా హెల్ప్ చెయ్యమంటావా -

వెధవ పెరుగు దానిక్కూడా తోడు కావాలా? దానికి నాతో పోటీ ఏమిటి? - మొన్న నువ్వు కొనాలి అన్నది ఏది? కాటన్ చీరే కదూ - రేపు సాయంత్రం అయిదింటికి రెడీగా ఉండు. వెళ్లి కొనుక్కొందాం - ఇదిగో నాకు నిద్ర ముంచుకొస్తోంది. ఆ పాత్రలు ఉదయం పనిమనిషి వచ్చి తీస్తుందిలే! నువ్వెందుకు అవస్థ పడతావు - సాయంత్రం ఆఫీసు నుండి వస్తూ మల్లెపూలు తెచ్చాను. చూళ్లేదా అద్దం ముందు పెట్టాను.

ఈ డైలాగులన్నీ ఎక్కడికి పోయాయండీ... అసలు సంగతి మరచిపోయాను. ఇవ్వాళ మన దాంపత్య జీవనంలో చారిత్రాత్మకమైన దినం. మీరు... మీ చేతుల్తో స్వయంగా ఎంపిక చేసి నాలుగు మామిడి పళ్లు ఇంటికి తెచ్చారు. నా జన్మ ధన్యమయిపోయింది. ఈ బ్రతుక్కి ఇంత అదృష్టం ఉంటుందని నేను అనుకోలేదు.

ఏం పళ్లు తెచ్చారండీ... ఏం పళ్లు తెచ్చారు? అసలు మీకేమయినా బుద్ధుందా? అసలు అవి మామిడి పళ్లేనా? సీజను అయిపోయేటప్పుడు కళ్లు మూసుకొని ఎవరన్నా కొంటారా?

మిమ్మల్ని ఎవరు అడుక్కొన్నారు పళ్లు తెమ్మని... ఇంటికి కావలసినవి అన్నీ మీరే తెస్తున్నారా? రెండ్రోజులకోమారు నేను మార్కెటుకు తెల్లారి పూటే ఛస్తున్నాను కదా! ఈ సీజన్లో ఇప్పటికి నేను పదమూడు సార్లు మామిడిపళ్లు తెచ్చాను. తండ్రీ బిడ్డలు బాగానే మెక్కారు కదా... మళ్లీ అంత డబ్బు పోసి మిమ్మల్ని మామిడి పళ్లు తెమ్మన్నది ఎవరు?

పైగా కిలో పదహారు రూపాయలా.. అమ్మో అమ్మో కుళ్లిపోయిన ఆ మామిడి పళ్లకు పదహారు రూపాయలు పోసి వచ్చారు. మొన్న నేను మా తమ్ముణ్ని చూసి వస్తాను అంటే ఛార్జీలు లెక్క పెట్టారు. నెలకు ఇంతయితే సంవత్సరానికి ఎంత, జీవితం మొత్తానికి ఎంత అని వేలల్లో లెక్కలు తేల్చారు. ఇంకా నయం... ఏడు జన్మలు మన దాంపత్యం గ్యారంటీ అని మొత్తానికి లెక్కలు వెయ్యలేదు.

అంత కళ్లు మూసుకుని ఎవరన్నా బేరం చేస్తారండీ...

మాట్లాడరేమండీ... మీరెందుకు మాట్లాడుతారు? నా చేతవాగించడంలోనే ఉంది మీ గొప్పతనం అంతా.

మీ ప్రతిభా పాటవాలలో కొంత భాగం పిల్లల పెంపకంలో కూడా చూపించవచ్చు కదా...

మీ పుత్రికా రత్నానికి పదహారేళ్లు నిండిపోయా యన్న సంగతి తమరికి గుర్తుందా... ఎప్పుడూ ఆఫీసు, మీ పనులు అంటూ ఉండిపోతే చాలా? పిల్లల విషయమేమిటి అని ఎప్పుడన్నా ఆలోచించారా?

అంతర్జాలంలో అంతర్జ్వలన కవిత్వం



"ఇలా రువ్వుదామా రంగులు"? అంటూ తన యాభై ఒక్క కవితల సమాహారంగా తొలి కవితా సంపుటితో సాహిత్య ప్రపంచంలోకి అడుగు పెడుతున్న కవి కోగంటి విజయబాబు. కవితాసంపుటి అయితే మొట్ట మొదటిది గానీసాహిత్యాభిమానులకి, ఈయన కలం, కవిత్వం సుపరిచితమే. అందులోకీ అంతర్జాలంలో కవిత్వం చదివే వాళ్ళకి కోగంటి విజయ్ బాబు ని పరిచయం చేయనవసరం లేదు.

"ఒక అమృత బిందువు/ జారి దోసిట పడితే ఏమవుతుంది?/చిట్టి చేతులతో మెడను చుట్టుకుపోయే/ మల్లె చెండంత
చిన్న తల్లవుతుంది."

అంటూ పద లాలిత్యంతో, హృదయాన్ని నెమలి కన్నుతో తాకి పులకింతలు రేపినట్టు కవిత్వాన్ని పలికించ గలిగిన కవి కోగంటి విజయ్ బాబు. అక్షరంతో అక్షరం కలిసి అంతరంగంలో అంటుకున్నప్పుడు జ్వలనమై రగిలిన భావ జాలాన్ని సున్నితంగా వినిపిస్తూ నీటి లోని అలల్లా అనుభూతులను కదపగలగడం, విజయ్ బాబు ప్రత్యేకత. తను రాసిన కవిత్వంలో ఎక్కువ భాగం అంతర్జాలంలో పంచుకునే ఈ కవికి తొలి దశలో గేయాలు రాసిన అనుభవం ఉన్నది.

ఆధునిక వచన కవిత్వాన్ని..ఇలాగే ఉండాలి.. ఇలాగ ఉండ కూడదు.. అని చెప్పగలిగే పద్ధతులు, పరిమితులు ఏవీ లేవు. అను భూతి అనేది పాటకుడికీ, పాటకుడికీ, మధ్యన మారుతుంటుంది. ప్రస్తుతం రాస్తున్న కవులలో చాలామంది నూతన అభివ్యక్తితో అను భూతి ప్రధానంగా కొత్త ఒరవడితో కవిత్వాన్ని రాస్తున్నారు.విజయ్ బాబు తొలికవిత అచ్చయిన 2003 నుండీ తనదైన శైలిలో స్వంత గొంతు వినిపిస్తున్న కవి. లోపలి మాటలకు ముసుగులు తొడగకుండా అచ్చంగా అలా అక్షరాలలోకి మార్చి కవిత్వం చేయడం ఈ కవికి ఇష్టం. అనవసరమైన ఆవేశం, నినాదాలూ, సమాజం మొత్తాన్ని కవిత్వం తోనే రాత్రికి రాత్రి మార్చేయ్యాలన్న ఆరాటం ఆదర్శాలను పదే పదే వల్లించడం వంటివి ఈ కవిత్వంలో ఎక్కడా కనిపించవు.

"నా బాల్యపు గతంలా కురిసి /కవ్వించి కరిగిపోయిన /వానను చూస్తుంటే /శిశిరపు మోడైన నా గుండెకు / ఓ అసూయ, ఓ ఆశ ..." అంటూ తన తొలి కవిత తోనే వాన కురిసే మనోహర దృశ్యాన్ని కళ్ళ ముందు ఉంచిన కవి

బాల్యపు గతంలా కవ్వించి కరిగిపోయిన వానను చూస్తే, ఒకప్రక్క అసూయా మరొక ప్రక్కన ఆశ, పరస్పర విరుద్ధ భావనల మధ్యన ఊగిసలాడుతున్న గుండెని ఊరడించాలన్న ప్రయత్నం ..కవి స్వభావాన్ని పట్టి ఇస్తుంది.

"పరుగు పందాలనుండి/విరామం ప్రకటించి /మనుష్యుల ముఖాలని ప్రేమగా చూడల"నుకునే కవి మనసును మరబొమ్మ చేసి ఆడించే గారడీ పలకలని మూసేద్దాం అంటు పిలుపునిస్తాడు. కృత్రిమంగా, ఆర్థిక బంధాలుగా అవకాశ వాదాలుగా మారిపోతున్న మానవసంబంధాల పట్ల ఏవగింపుతో... "సీతాకోక చిలుక లైనదాక/గొంగళ్ళయి పట్టుకునే /అవసరాల నవ్వులూ/తట్టుకోలేని అభిమానాలు /పై పై పెదవి పలకరింతలు" హిపోక్రసీ ని భరించలేని కవితత్వాన్ని చాటుతుంది.

"నేను అరాచకాన్ని,అవకాశ వాదాన్ని /ఒక భయ చరాన్నిఅభయ చరాన్ని /అర్థం మారిన ఉభయ చరాన్ని కూడా /అందుకే నాహం త్వమేవ.." .అంటూ స్వార్థ పూరిత మానవ స్వభావాన్ని తప్పు పడుతూ మార్పుని ఆశించే కవి విజయ్ బాబు .

ఆంగ్లభాషాధ్యాపకుడైన విజయ్ బాబు పైన ఆంగ్ల కవిత్వం ప్రభావం కూడా అంతో ఇంతో లేకపోలేదు.జీవన నైపుణ్య బోధకుడిగా పలుమార్లు ఉపాధ్యాయులకు శిక్షణ నందించిన అనుభవంలోంచి మనుష్యుల మధ్యన అరమరికలు లేని ఆప్యాయతలనీ, అహంభావ ఆధిపత్యాలు లేని నిష్కల్మష స్నేహాన్నీ, హృదయాల మధ్య వారధులు వేసే ప్రేమపూర్వక కరచాలనాన్ని కల గంటూ కవిత్వమై కలవరిస్తాడు.

ఇలాంటి సమయంలోనే "మనసు ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరి అయి/ మనసుకి నచ్చినవారితో /నింగి నేలను టేక్ చోటు వరకూ/ కలిసి నడవాలని" అనుకుంటాడు. "ముందుకు మాత్రమే తిరిగే /కాలచక్రపు ఇరుసు మీద / ఊగిసలాడే జీవితానికి ఏంకావాలి?" అని ప్రశ్నించుకుని ఒక మమకారపు ఆసరా అంటూ జవాబును తనే చెప్పడం ఈ కవి ప్రత్యేకత.

"అడవిని సృష్టించింది మనమే కదా /అంధకారాన్ని చీల్చాల్సిందీ మనమే". అంటూ బాధ్యతలను సున్నితంగా గుర్తు చేస్తూ హెచ్చరించినా... "బతకు/గురుతుగా /మారేంత వరకే కదా/మనిషి మనుగడ" అంటూ జీవన సారాన్ని తాత్వికతతో విడమరిచి చెప్పినా... "పలకరించి చూడు/ఓ మల్లియ పరిమళించే పాట /గొంతు విప్పవచ్చు అంటూ ఆశాభావాన్ని రగిలించినా.. మనిషి మీద, మానవత్వం మీద అంతు లేని ప్రేమ గల కవిగా తన అక్షరాలలో దర్శనమిచ్చే కవి ఇతడు.

అన్నదమ్ముల మధ్యన పంపకాలలో ఇల్లు కూలుతోన్నప్పుడు "పంచాయితీ కొచ్చిన పెద్దలనీ /పై రవీలు చేస్తోన్న మమ్మల్నీ / ఆనందం కోల్పోయిన ఇంటినీ చూసి / ఆవిరౌతోన్న కళ్ళతో అమ్మ" అంటూ ఒక మాతృమూర్తి తన కళ్ళముందే ఇంటితో పాటు ముక్కలైపోతోన్న అనుబంధాలను చూడలేక పడే ఆవేదనని ఆర్ద్రంగా పట్టుకున్న ఒడుపు అభినందనీయం.

"చినుకంత పరిమళం " " దాహం తీర్చ కలిగే సంద్రాలు" వంటి పదప్రయోగాల విషయంలో కొంత జాగ్రత్త అవసరం అనిపిస్తుంది. "ఒక దశ లోంచి /మరొకదశ లోకి ప్రవేశించాలంటే /అవశేషాల్లెకుండా దహించాల్సిందే/నివురయ్యేలా నిశ్శేషమవ్వాల్సిందే". అన్న స్పష్టమైన అవగాహన ఉన్న విజయ్ బాబు, కుహనాల తలలు తిరిగేలా రంగులు రువ్వుతూ స్వేచ్ఛ ఎగిరి, విస్మయ పరుస్తూ జ్వలించగలిగిన సత్తా ఉన్న కవే.. కల్తీ లేని సంతోషపు రంగులు పులుముకుని ఆనంద కేళిగా బ్రతుకు హోళీని జరుపుకోవడానికి కలాన్ని దువ్వుతూ ..అక్షరాలూ రువ్వుతూన్న ఈ కవి భవిష్యత్తులో మరింత శక్తివంతమైన కవిత్వాన్ని అందించాలని కోరుకుంటూ తొలి కవిత సంపుటిని మనసారా స్వాగతిద్దాం ..సాహిత్య ప్రపంచంలోనికి.

-గరిమెళ్ళ నాగేశ్వరరావు
9951573059

ప్రతి సోమవారం

రైటర్స్ అకాడమీ

వారం వారం విపుల సాహిత్య విహారం



మునిపల్లె రాజు కవిత

ఇటీవల మునిపల్లె రాజు, ప్రముఖ సాహితీ వేత్త, కథకులు, కేంద్ర సాహిత్య అకా డెమీ పురస్కారంతో బాటు మరెన్నో తెలుగు సాహిత్య రంగ ప్రసిద్ధ పురస్కారాలు పొందిన 93 ఏళ్ల వయసులో, హైదరాబాద్ లో ఇరవై నాలుగు ఫిబ్రవరిన కన్ను మూశారు. వారు కథలతో బాటు కొంత కవిత్వం కూడా సంపుటాలుగా వెలువరించారు. వారి ఒక ప్రసిద్ధ కవిత . వారి సంస్మరణలో భాగంగా, రైటర్స్ అకాడెమీ పాఠకుల కోసం, అందిస్తున్నాము.

చితి మీద కవి

ఏ గంటలూ మ్రోగడం లేదు.
బజార్లు రద్దీగానే ఉన్నాయి
ఆఫీసులు మూతపడలేదు
సంతాప దినాలు ప్రకటింపబడలేదు
వాహన సంచారం యధాప్రకారం అస్తవ్యస్తంగానే ఉంది
సినిమాహాళ్ళు ఎప్పటిలాగే కిక్కిరిసి ఉన్నాయి

శవయాత్ర సాగుతోంది... అయితే
ముందు బేండు మేళాలు మోగటమూ లేదు
వెనుక గుర్రపు సవారీలు అనుసరించడమూ లేదు.
పాడె మీద కవి ఏం పట్టనట్టు పరున్నాడు
శవవాహకులు నలుగురూ పిడికిళ్లు బిగించి నడుస్తున్నారు.

జండాలు అవనతం కాలేదు.
కొందరు ఇరుగు పొరుగు వాళ్ళూ,
తోటి కవులు మరికొందరూ కనిపిస్తున్నారు.
అతని ప్రచురణ కర్తలు కనపడటం లేదు
ఫొటోగ్రాఫరు జాడలేదు
కాకపోతే ఒకరిద్దరు విమర్శకులూ
బాధ్యత మరువని ఓ విలేఖరీ వెంటనడుస్తున్నారు.
శ్మశానంలో పాడె క్రిందకి దింపారు
మృతుని గురించి ప్రసంగం చెయ్యవలసి ఉంది
వక్తకి కళ్ళు చెమరుస్తున్నాయి
అతని మాటలు శాంతగంభీరంగా ఉన్నాయి.
కాని, కాల్చడానికి కట్టెలూ,
వెలిగించడానికి ఇంధనం ఏవీ?
కవి ఆత్మకి శాంతి కూర్చేదెలా?
కొన్ని నిముషాలు దొర్లిపోయాయి
చందాలు వసూలు చెయ్యడానికి టోపీ కలదిరిగింది
కానీ, అందులో చేరుకున్న నాణేలు కొన్నే.

ఆరె! ఎవరది ఓ డొక్కు రిక్షాలోంచి
శ్మశానద్వారం దగ్గర దిగుతున్నది?
అతని వితంతువు అతని వ్రాతప్రతులన్నీ
కట్టగట్టి తీసుకు వచ్చింది.
ఇక మనం చితిముట్టిద్దాం రండి
మరి ఎంతమాత్రం ఆలస్యం చెయ్యలేం!

సమ్మోదము



గులాబీల గోముతనానికి
ఎవ్వరైనా గులాముల
వ్వాల్సిందే కదా!
ఏ రంగులో పూసినా ఆ
అందాన్ని ఎంత
గౌరవిస్తాము?
ఆ సుకుమారత్వాన్ని ఎంతగా ఆస్వాదిస్తాము?
మరి,రకరకాల మనుషులను కూడా అలా ఎందుకు
చూడలేకపోతున్నాము?
ఒక్కొక్కరూ ఒకో తెలియనితనాన్ని వెదజల్లుతారని
ఎందుకు అనుకోము?
ద్వేషించడానికి కారణముండాలేమో...
మానవ పరిమళాన్ని ఆఘ్రాణించడానకి అక్కర్లేదు.
నిద్రావస్థలోనున్న ప్రేమతత్వాన్ని మేల్కొలిపితే చాలు.
కనిపించే ముళ్లు గ్రుచ్చుకుంటాయని తెలుసు
అయితేనేం రోజాలను రోజూ ఆనందించడం లేదూ!
కనిపించనివన్నీ చిక్కుముళ్లేనని ఎందుకు భావించాలి?
మానవ మానస సరోవరాలెందుకు కాకూడదూ!?
పూచిన పూలకు కూడా
సొట్టదీ గుడ్డిదీ అని పేర్లు పెట్టే నైజాన్ని
ఎప్పుడు వదల్చుకుంటామో అప్పుడు
సహజంగానే మానవతా మంజరిగా గుబాళిస్తాము...

-డా.మాటూరి శ్రీనివాస్
98490 00037

చదువుతో పాటు
క్రీడలు అవసరమే
జాయింట్ కలెక్టర్ సృజన



డాబాగార్డెన్స్, న్యూస్‌లీడర్ : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రానించడం వలన వారి మానసిక ఉల్లాసంతో మరింత సాధించగలరని జాయింట్ కలెక్టర్ సృజనా అన్నారు. అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో పెన్‌స్కూలు ఆధ్వర్యంలో పెన్ మినీ ఒలింపిక్స్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జేసీ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ క్రీడలకు శారీరక ఎదుగుదలకు, ఎంతగానో దోహదపడతాయన్నారు. ఇటువంటి మంచి కార్యక్రమం ఏర్పాటు చేసిన యాజమాన్యాన్ని అభినందించారు. పెన్ స్కూలు చైర్‌పర్సన్ అనిత పెరిరా మాట్లాడుతూ గత 36 సంవత్సరాలుగా క్రమశిక్షణతో నైతిక విలువలతో కూడిన విద్యను అందిస్తున్నామని చెప్పారు. ముందుగా విద్యార్థులు చేసిన విభిన్న సాంస్కతిక కార్యక్రమాలు, క్రీడలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ తేజ్ పెరిరా , అద్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మలబార్‌లో వడ్డాణాల ప్రదర్శన




డాబాగార్డెన్స్,న్యూస్‌లీడర్ : మగువుల అందాలను మరింత మైమరిపించే వడ్డాలను ప్రత్యేక శ్రేణిలో వుంచామని మలబార్‌గోల్డ్ అసిస్టెంట్ స్టోర్ మేనేజర్ శ్రీనువాస్ తెలిపారు. నగరంలో ఆశీలమెట్ట మలబార్ స్టోర్‌లో ఈ వడ్డానాల ప్రదర్శనను ప్రారంభించారు. ఈ మేరకు మోడల్స్ వివిధ రకాల వడ్డానాలును ధరించి ఫోటోలకు ఫోజులిచ్చారు. అనంతరం వినియోగదారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినియోగదారుల ఆధరణతోనే అనేక కార్యక్రమాలు నిర్వహించ గలుగుతున్నామని, వారి అభిరుచులమేరకు విభిన్న రకాల ఆభరణాల ప్రదర్శనలు ఏర్పాటు చేసి వారి ఆదరణ పొందుతున్నామని అన్నారు. మార్చి 18 వరకు వడ్డాణాలపై 10 శాతం తరుగు అందిస్తున్నామని వెల్లడించారు. వివాహ శుభాకార్యలు కావడంతో ప్రత్యేక ప్రదర్శన ఆకట్టుకుంటుందని తెలిపారు.

1600 మందికి
వైద్య పరీక్షలు
బ్రాండిక్స్ ఆధ్వర్యంలో 8వ ఆడపిల్లల వైద్య శిబిరం



అచ్యుతాపురం, న్యూస్‌లీడర్: అచ్చుతాపురం మండల కేంద్రంలో ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలల్లో ఆదివారం బ్రాండిక్స్ ఆధ్వర్యంలో 8వ ఉచిత ఆడపిల్ల వైద్య శిబిరం జరిగింది. ఇప్పటి వరకూ ఈ వైద్య శిబిరానికి 16 వందల మంది పరీక్షలు చేయించుకోగా వారిలో కొంతమందికి క్యాన్సర్ పై అవగాహన కల్పించారు. క్యాన్సర్ సూచనలు ఉన్నవారిని విశాఖపట్నం మహాత్మా గాంధీ ఆస్పటల్ తీసుకెళ్లి వైద్యం అందిస్తారు. బ్రాండిక్స్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ మంచి సేవ కార్యక్రమాలు ప్రజలందరూ వినియోగించు కోవాలని బ్రాండిక్స్ ఇండియన్ పార్ట్నర్ దొరైస్వామి తెలిపారు.

వివాహంలో ఆకట్టుకున్న
గోవర్ధనగిరి సెట్



ఆకట్టుకున్న గోవర్ధనగిరి సెట్



అనకాపల్లి, న్యూస్‌లీడర్ : గవరపాలెం దిబ్బవీధికి చెందిన ఆడారి సంతోష్ – భార్గవిల వివాహం ఆది వారం రాత్రికి దిబ్బవీధి కొబ్బరితోట కల్యాణ మండపంలో జరగనున్నది. ఈ కల్యాణ మండపంలో వరుడు ఆడారి సంతోష్ తన సొంత తెలివితేటలతో తన వివాహ కల్యాణ మండపం అయిన గోవర్ధనగిరి సెట్‌ను తానే స్వయంగా తయారుచేసుకొని వివాహానికి విచ్చేసిన బంధువులు మన్ననలను పొందారు. అదేవిధంగా దశావతారములు స్వాగతం ద్వారాల సెట్‌ను కూడా స్వయంగా వరుడు సంతోష్ ఏర్పాటు చేసుకున్నారు.

వైభవంగా మలేషియా తెలుగు ఫౌండేషన్
వార్షిక ప్రశంసల విందు









మలేషియా : మలేషియాలోని మలేషియా తెలుగు ఫౌండేషన్ వార్షిక విందు ఘనంగా నిర్వహించారు. ట్యూన్ సమి వెల్లూతో ప్రశంసలు విందు ఏర్పాటు చేశారు. ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో మలేషియా తెలుగు ఫౌండేషన్ ఏజీఎం ప్రతిపాదించిన అంశాలు ఆమోదించారు. దీపావళికి అదనపు పబ్లిక్ హాలిడే, జీఎల్‌సీ కంపెనీ కమ్యూనిటీ కోసం అధనంగా బోర్డు ఆఫ్ డైరెక్టర్లు నియామకం, టీఎన్‌బీ, ప్లస్, పీవోస్ మలేషియా, నెస్టల్, తదితర కంపెనీలు కూడా. ప్రభుత్వ శాఖలో విద్య, ఉద్యోగాల పర్యవేక్షణ, యూనిటీ ఫెస్టివల్ వేడుకలు (సంగక్కరరి (పొంగల్), న్యూ ఇయర్, దీపావళి సంబరాలు నిర్వహణ, యూత్ జెనరేషన్, స్పోర్ట్స్ అండ్ బిజినెస్ డెవలప్‌మెంట్, తదుపరి 10 సంవత్సరాల ప్రణాళిక తదితర అంశాలపై నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మలేషియా తెలుగు ఫౌండేషన్ అధ్యక్షుడు దాతో ఆర్.కాంతారావు ఆకునాయుడు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో తెలుగు కమ్యూనిటీ, తెలుగు ఎన్జీవో నాయకులు తెలుగు పాటలతో విందు వేడుక ఘనంగా జరిగింది. మలేషియా తెలుగు కమ్యూనిటీ సభ్యులు, ఎక్స్ కోమెంబర్స్, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో
ప్రజలు భాగస్వామ్యం కావాలి
అవగాహన ర్యాలీలో జీవీఎంసీ కమిషనర్



విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : స్వచ్ఛ సర్వేక్షణ్–2018లో మహావిశాఖనగరపాలక సంస్థ ప్రథమ స్థానంలో నిలిచే విధంగా నగర ప్రజలు భాగస్వామ్యం కావాలని జీవీఎంసీ కమిషనర్ హరినారాయణన్ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ నివాసితుల సంక్షేమ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఆర్కేబీచ్ వద్ద ర్యాలీనుద్దేశించి కమిషనర్ మాట్లాడుతూ జీవీఎంసీ "స్వచ్ఛ సర్వేక్షణ్–2018" పోటీలో ప్రథమ ర్యాంకు రావడానికి ఇంకా 1400 మార్కులకు అవకాశం వుందన్నారు. మరో అడుగు ముందుకు వేస్తే అది సాధ్యమౌతుందని, అందుకు ప్రజా సహకారం అవసరమన్నారు. ప్రతి ఒక్కరు తమ వద్ద





వున్న మొబైల్ ఫోన్ నుండి 1969 నంబర్‌కు మిస్డ్ కాల్ చేస్తే ఒకటి,రెండు నిమషాల్లో వారి వద్ద నుండి ఒక ఫోన్ వస్తుందని, ఈ సందర్భంగా వారు ఆరు ప్రశ్నలు వేస్తారని వివరించారు.వాటికి "యస్" అనుకుంటే 1 ప్రెస్ చేయాలని, "నో" అనుకుంటే 2 ప్రెస్ చేయాలన్నారు. ఆ ఆరు ప్రశ్నలు గత ఏడాది నుండి ఇప్పటి వరకు విశాఖపట్నం, స్వచ్ఛత విషయంలో ఎంతవరకు ప్రతి సాధించిందనే విషయంపైన వుంటుందన్నారు.వారు ఏ ప్రాంతంలో నివాసం వుంటున్నా కూడా విశాఖపట్నం పిన్ కోడ్ 530 001 అని చెప్పాలన్నారు.ఈ నెల 10 వ తేదీలోగా తమ అభిప్రాయాలు తెలియచేయాల్సి వుంటుందన్నారు.ఈ ర్యాలీలో పలువురు జీవీఎంసీ అధికారులు,స్వచ్ఛభారత్ అంబాసిడర్లు,విద్యార్థినీ, విద్యార్థులు, నివాసితుల సంక్షేమ సంఘాల సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కమిషనర్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. బీచ్‌రోడ్డులోని కాళీమాత ఆలయం నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ వైఎంసీఏ వరకు కొనసాగింది.





Printed, Published and Owned by V.V.Ramana Murthy and Printed at LEADER PRESS, 58-14-109/5, Block No. 113 A, VUDA Layout, Marripalem, Visakhapatnam - 530009, A.P. and Published at 47-10-7/3, Diamond Park Junction, Visakhapatnam - 530016, A.P.
EDITOR - V.V. RAMANA MURTHY, **RNI NO: 72163/99, Registered Postal Regd. No. - VSP/211/2015-17 E-MAIL andhraleader@gmail.com, Telephone Nos. 0891-6660599, 98488 49832**

సంచలన వార్తాపత్రిక
లీడర్ విశాఖ రూరల్
విశాఖపట్నం
సోమవారం 5-3-2018

8న మరిడిమాంబ విగ్రహ ప్రతిష్ఠ

రోలుగుంట, న్యూస్‌లీడర్: రోలుగుంట మండలం ఎంకె.పట్నం గ్రామంలో ఈ నెల 8వ తేదీన మరిడిమాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ జరగనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ఆ రోజు ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయని చెప్పారు. మధ్యాహ్నం అన్నసమారాధాన ఉంటుందన్నారు. అలాగే సాయంత్రం నుంచి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.

అగ్నిమాపక శకటానికి సుస్తి

డీజిల్ లేక మూలకు చేరిన అగ్నిమాపక వాహనం

రావికమతం, న్యూస్‌లీడర్: మండల కేంద్రంలోని అగ్నిమాపక వాహనంకు డీజిల్ లేకపోవడంతో మూలన పడింది. దీంతో మండలంలో ఎక్కడ అగ్ని ప్రమాదం జరిగినా చోడవరం, మాడుగుల, నర్సీపట్నం నుంచి శకటాలను రప్పిస్తున్నారు. అవి దూరం నుంచి రావడంతో జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. ఇక్కడ అగ్నిమాపక కేంద్రం సర్వీస్ ప్రొవైడ్ కాంట్రాక్టు గడువు గత ఏడాది డిసెంబరుతో ముగిసింది. దీన్ని కొనసాగింపునకు ఇష్టం లేని సదరు కాంట్రాక్టర్ ఆరు నెలల నుంచి రావికమతం అగ్నిమాపక కేంద్రం నిర్వహణను పట్టించుకోవడం లేదు. ఫలితంగా వాహనం మరమ్మత్తుకు గురై మూలకు చేరింది. ట్యాంకు మొత్తం రంధ్రాలతో నిండటంతో నీరు ఉండటం లేదు. ఒక వేళ నింపుకొని వెళ్లినా ప్రమాదస్థలికి వెళ్లేసరికి సగానికి పైగా ఖాళీ అయిపోతుంది. వాహనం ఇంజన్ కూడా పాడవడంతో తరచూ మొరాయిస్తుంది. లైట్లు లేకపోవడంతో



రాత్రులు వెళ్లేందుకు సిబ్బంది తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. లైట్లు లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. అలాగే కాంట్రాక్టర్ మూడు రోజులుగా డీజిల్ కూడా పంపించకపోవడంతో వాహనం పూర్తిగా మూలకు చేరింది. సిబ్బంది వేతనాలు సైతం నాలుగు నెలలుగా అందలేదు. అత్యవసర సేవలకు ఏర్పాటు చేసిన అగ్నిమాపక కేంద్రం నిర్వహణను ప్రభుత్వం పట్టించుకోకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత మూడు రోజుల్లో గుడివ, గొంప, పిల్లవానిపాలెం గ్రామాల్లో జరిగిన అగ్ని ప్రమాదాలకు డీజిల్ లేకపోవడం వల్లే వాహనం సేవలు అందలేదు. ఈ విషయమై కేంద్రం ఇన్‌చార్జి వరహాలురావును వివరణ కోరగా కొత్త కాంట్రాక్టర్ ఈ నెల 10వ తేదీ నుంచి కేంద్రాన్ని స్వాధీనం చేసుకుంటారని, అంత వరకూ పాత కాంట్రాక్టర్‌ను కేంద్రం నిర్వహణకు అవసరమైన నిదులు కేటాయించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. కానీ ఆయన పట్టించుకోవడం లేదన్నారు.

2019 మార్చి నాటికి

5లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి

రాష్ట్ర పురపాలకశాఖా మంత్రి నారాయణ



ఎన్టీఆర్ హౌసింగ్ పథక శిలాఫలాకానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

నర్సీపట్నం, న్యూస్‌లీడర్: 2019 మార్చి నాటికి 5లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి పేదలకు అందజేస్తామని రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి పి.నారాయణ అన్నారు. ఆదివారం నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలోని బయపురెడ్డి పాలెంలో సమీపంలోని ఎన్టీఆర్ హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ముందుగా ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన శిలాఫలకాన్ని రాష్ట్ర రోడ్లు భవనాలశాఖా మంత్రి అయ్యన్నపాత్రుడుతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్టీఆర్ హౌసింగ్ పథకం కింద పేదలకు ఇళ్లు అందించడం గొప్పవిషయమన్నారు. దీనికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ఇప్పటికే దాదాపు కొన్ని చోట్ల ఈ ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. నూతన టెక్నాలజీతో కడుతున్న ఈ ఇళ్లను చూసి ఇతర రాష్ట్రాల వారు వస్తున్నారన్నారు. ఇటీవల గోవా హౌసింగ్ మంత్రి కూడా ఇటీవల నెల్లూరులోని ఎన్టీఆర్ హౌసింగ్ పథకానికి సంబంధించిన ఇళ్లను చూశారన్నారు. టాటా కంపెనీ మంచి కంపెనీ అని వచ్చే ఏడాది మార్చి నాటికి ఈ ఇళ్లను ఖచ్చితంగా అందజేస్తారన్నారు. వాటి ప్రారంభానికి కూడా తాను వస్తారని ఈ సందర్భంగా మంత్రి నారాయణ తెలిపారు. రాష్ట్ర రోడ్లు భవనాలశాఖా మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ నర్సీపట్నం జీవితంలో గుర్తిండిపోయే మంచి కార్యక్రమమన్నారు. అర్హులైన వారికి ఖచ్చితంగా ఈ ఇళ్లను ఇస్తామన్నారు. ఈ పథకం వద్దే పార్కు, కళ్యాణ మండపం తదితర సౌకర్యాలు కూడా కల్పిస్తామన్నారు. మీ ఇళ్లు నిర్మాణం జరుగుతున్నాయి కాబట్టి ఎప్పటికప్పుడు వచ్చి చూసుకోవాలని సూచించారు. నర్సీపట్నం, యలమంచిలి మున్సిపాలిటీలోను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మున్సిపల్ చైర్ పర్సన్ చింతకాయల అనిత, యలమంచిలి చైర్ పర్సన్ రమాకుమారి, నర్సీపట్నం మున్సిపల్ వైస్ చైర్మన్ సన్యాసిపాత్రుడు, ఆర్డీవో కె.సూర్యారావు, ఎంపిపి సుకల రమణమ్మ, టీడీపీ కౌన్సిలర్లు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ప్రజలు



భూమి పూజ చేస్తున్న మంత్రులు నారాయణ, అయ్యన్న



మాట్లాడుతున్న మంత్రి నారాయణ

తాండవలో రొయ్యల వేట ప్రారంభం

గొలుగొండ, న్యూస్‌లీడర్: తాండవ జలాశయంలో రొయ్యల వేట ప్రారంభమైంది. జూన్ మొదటి వారం వరకు సాగుతుందని మత్స్యకారులు తెలిపారు. జలాశయం దగ్గర కిలో రొయ్య ధర రూ.200 నిర్ణయించినట్లు వారు వివరించారు. ఈ జలాశయంపై గాదంపాలెం, విప్పలపాలెం, సాలికమల్లవరం, పొగచెట్లపాలెం, వెంకటాపురం, జోగుంపేట, గొలుగొండ ప్రాంతాలకు చెందిన 450 జాలర్లు ఆధారపడి జీవనం సాగిస్తున్నారు.

ఎస్సీ కేటగిరికి వంటర్లపాలెం రేషన్ డిపో

మాడుగుల, న్యూస్‌లీడర్: ఈ నెల 17వ తేదీలోగా మాడుగుల మండలంలో వంటర్లపాలెం రేషన్ డిపోను ఎస్సీ కేటగిరికి కేటాయించడం జరిగిందని తహశీల్దార్ లోకవరపు రామారావు తెలిపారు. పదవ తరగతి పాసై స్థానికులైన అభ్యర్థులు ఈ పోస్టుకు దరఖాస్తులు చేసుకోవాలని తహశీల్దార్ విజ్ఞప్తి చేశారు. అర్హులైన అభ్యర్థులకు ఈ నెల 25వ తేదీన రాత పరీక్ష, 29న మౌఖిక పరీక్ష అనకాపల్లి ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అర్హత పొందినవారి జాబితా ఈ నెల 30వ తేదీన ఆర్డీవో కార్యాలయంలో తెలియజేయడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు మాడుగుల మీసేవాలో దరఖాస్తులు చేయాలని కోరారు.

ఘనంగా నూకాంబిక అమ్మవారి వార్షికోత్సవం

రావికమతం, న్యూస్‌లీడర్: కొత్తకోట గ్రామస్థుల ఆరాధ్యదైవం నూకాంబిక అమ్మవారి 4వ వార్షికోత్సవాన్ని గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నుండే కొత్తకోటతో పాటు కన్నంపేట, మర్రివలస, కొత్తపట్నం, వమ్మవరం తదితర గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే ప్రతీ ఏడాది ఘటాల ఊరేగింపు కార్యక్రమంలో వేలాది మంది మహిళలు తలపై ఘటాలు పెట్టుకొని గ్రామంలో ఊరేగింపు చేశారు. తదనంతరం అమ్మవారి ఆలయం వద్ద భారీ అన్నసమారాధాన కార్యక్రమం చేపట్టారు. భక్తుల తాకిడి అధికంగా ఉండటంతో ఆలయం వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. అలాగే వృద్ధులకు, మహిళలకు ప్రత్యేక కౌంటర్ ద్వారా అమ్మవారి దర్శనానికి అవకాశం కల్పించారు.

ఉచిత వైద్య శిబిరం



ఎన్ఏడీ, న్యూస్‌లీడర్: స్థానిక జీవీఎంసీ 43 వార్డు కంచరపాలెం శ్రీ దుర్గా యువసేన సేవా సంఘం ఆధ్వర్యంలో సెవెన్‌హిల్స్ ఆసుపత్రి వారి సౌజన్యంతో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భముగా చికిత్స నిమిత్తం సాధారణ వైద్యపరీక్షలు, కంటి వైద్య వైద్య పరీక్షలు నిర్వహించారు. వచ్చిన వారికి సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో సుమారు 500 ల మందికి పైగా వైద్యపరీక్షలు నిర్వహించినారు .ఈ కార్యక్రమంలో వైద్యులు మరియు సంఘ చైర్మన్ కుప్ప పైడిరాజు, మల్ల వెంకటసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మధ్యలో రంధ్రం...

వాహనదారులకు గండం



ఆటోవాలాలు కట్టిన కర్రకు వస్త్రం

నాతవరం, న్యూస్‌లీడర్: మూడు ప్రధాన రహదారులు కలిసే తాండవ కూడలిలో రోడ్డు మధ్యలో రంధ్రం పడింది. నిత్యం వందలాది వాహనాలు ఇక్కడి నుంచి వెళ్లి వస్తుంటాయి. ద్విచక్ర వాహనాల సంఖ్య మరింత అధికంగా ఉంటుంది. ఇలాంటి కీలక రోడ్డు మధ్యలో రంధ్రం పడటంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇది రోజురోజుకూ పెరుగుతోంది. ఇక్కడి ఆటో డ్రైవర్లు చిన్నకర్రను ఇందులో ఉంచి, ఎర్రని వస్త్రం దీనికి చుట్టారు. ఈ రోడ్డుపై లేటరైట్ వాహనాలు అధిక లోడుతో తిరగడంతో ఈ రోడ్డు లోలోపల గుల్ల బారుతుందని పలువురు చెబుతున్నారు. ఆర్అండ్‌బి అధికారులు ముందు రోడ్డును పక్కాగా సిద్ధం చేసిన తర్వాతనే భారీ వాహనాలకు అవకాశం ఇవ్వాలని వీరంతా కోరుతున్నారు.

ఫ్యాక్టరీకి జీవం పోయండి సారూ....



సమావేశంలో మాట్లాడుతున్న కనిశెట్టి సురేష్‌బాబు


అనకాపల్లిరూరల్, న్యూస్‌లీడర్: 2014 ఎన్నికల నాటికి 28వేల టన్నుల క్రషింగ్‌తో ది అనకాపల్లి వీవీ రమణ కో-ఆపరేటివ్ చక్కెర కర్మాగారం గానుగాటతో నడుస్తుండేదని ప్రజా రాజకీయవేదిక కన్వీనర్ కనిశెట్టి సురేష్‌బాబు అన్నారు. స్థానిక చదువులవారివీధిలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలు జరిగిన 2015 సీజన్ ముగిసే నాటికి 15వేల టన్నుల చెరకు గానుగాట జరిగి నడుస్తుండేదని, 2015-2016 సీజన్ ముగిసేనాటికి ఒక కోటి 50లక్షల రూపాయలు కర్మాగారంలో ఉండేదని, అదేవిధంగా ఒక లక్షా 50వేల టన్నుల చెరకు ఈ కర్మాగారం పరిధిలో అందుబాటులో ఉండేదన్నారు. కార్మికులు విధుల్లోనే ఉన్నప్పటికీ ఏ కారణం చేత కర్మాగారాన్ని గానుగాట చేయకుండా నిలిపివేశారని ఆరోపించారు. అప్పటికీ జన్మభూమి సభలకు హాజరైనటువంటి అనాటి కలెక్టర్ కర్మాగారం గానుగాడుతుందని ఆధునీకరణ చేస్తామని హామీ ఇచ్చారని, ఎమ్మెల్యే గానుగాడుతుంది అని పదే పదే ప్రకటనలు చేస్తూనే వచ్చారు అయినప్పటికీ కర్మాగారంలో గానుగాట నిలిచిపోయిందని ఆరోపించారు. అనాటి నుంచి 2016-17 సీజన్, 2017-18 సీజన్ పూర్తిగా గానుగాటకు నిలిపివేశారని ఆరోపించారు. అప్పటికే పంచదార ధరలు విపరీతంగా పెరిగి కర్మాగారాలు లాభపడే పరిస్థితిలో ఉన్నాయని, గానుగాట నిలిపివేసిన మూడు సీజన్లు కనుక గానుగాట జరిగి ఉంటే ఖచ్చితంగా ఈ కర్మాగారం అభివృద్ధిలోకి కొనసాగి ఉండేదని, కనీసం అనాటి ఉన్న అప్పులు పూర్తిస్థాయిలో తీర్చేసి ఈ రోజు నడుస్తూనేనైనా ఉండేదని, 2014లో గెలుపొందిన ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అనాటి ఎన్నికల ప్రచారంలో ఈ షుగర్‌ఫ్యాక్టరీని ఆధునికరిస్తామని హామీ ఇచ్చి గెలుపొందినప్పటికీ అనాటి నుంచి ఎమ్మెల్యే ఏదో ఒక పత్రికా ప్రకటన ఇచ్చి కాలం వెళ్లదీస్తున్నారని ఆరోపించారు. ఒక సందర్భంలో ఆధునీకరణ చేయకపోతే రాజీనామా చేసి ముఖ్యమంత్రి ఇంటి ముందు టెంట్ వేస్తానని ప్రకటించడం జరిగిందని సురేష్‌బాబు గుర్తు చేశారు. మీకున్న ఆఖరి అవకాశం ఇప్పుడు ప్రవేశపెడుతున్న చివరి బడ్జెట్ సమావేశంలోనైనా ఇక్కడ ఉన్నటువంటి రైతుకార్మిక కుటుంబాలకు , అలానే కర్మాగారం మీద ఆధారపడినటువంటి అసంఘటిత కార్మికవర్గానికి భరోసాతో , హామీ రాని పక్షంలో వచ్చే ఏడాదికి గాను గానుగాటకు అవసరమైనటువంటి రెండు కోట్ల రూపాయలు అదేవిధంగా కార్మిక జీవితాలకు సరైన హామీని తీసుకొని రావాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ చివరి బడ్జెట్ సమావేశంలో ఇప్పుడున్న అధికార తెలుగుదేశంపార్టీ కేటాయింపులో ఈ కర్మాగారానికి మొండిచెయ్యి చూపిస్తే తెలుగుదేశంపార్టీకి ఈ ప్రాంతంలో సూకలు చెల్లినట్లేనని, మరో రైతు ఉద్యమం , మరో సహకార ఉద్యమాన్ని ఎదుర్కొవడానికి సిద్ధం ఉండాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో సహకార ఐక్యవేదిక సభ్యులు ఆళ్ళ ప్రవీణ్‌కుమార్, బొట్టా చిన్నియాదవ్, కొవ్వాడ వాసు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాలమ్మ తీర్థం



మాడుగుల, న్యూస్‌లీడర్: మాడుగుల గిరిజన కార్పొరేషన్ ఆవరణలో వెలసి ఉన్న దుర్గాలమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం ఆదివారం ఉదయం ఘనంగా జీసీసీ మేనేజర్ ఎ.నమశ్శివాయ, జీసీసీ సిబ్బంది ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజార్లు జి.ప్రమోద్‌కుమార్ శర్మ, పవన్‌కుమార్ శర్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మాడుగులకు చెందిన పూలతోట దుర్గాప్రసాద్ అమ్మవారి ఆలయంలో ప్రసాదం పంపిణీ చేశారు. మధ్యాహ్నం 12గంటలకు గ్రామస్థుల ఆర్థిక సహాయంతో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. తీర్థంలో నేలవేషాలు ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా డ్యాన్సుబేబీ డ్యాన్సు కార్యక్రమం ఏర్పాటు చేశారు.

పాత బస్టాండ్‌లో పబ్లిక్ టాయిలెట్స్ ప్రారంభం



పబ్లిక్ టాయిలెట్లు ప్రారంభిస్తున్న మంత్రి నారాయణ

నర్సీపట్నం, న్యూస్‌లీడర్: నర్సీపట్నం మున్సిపాలిటీ 22వ వార్డులోని పాతబస్టాండ్ వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన పబ్లిక్ టాయిలెట్లను రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి నారాయణ ప్రారంభించారు. స్వచ్ఛభారత్ మిషన్ ఉద్దేశించి మన నర్సీపట్నం స్వచ్ఛ నర్సీపట్నంగా ఉండాలని ఆలోచన మేరకు దీన్ని ఏర్పాటు చేయడం మంచిందని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ చింతకాయల అనిత, వైస్ చైర్మన్ సన్యాసిపాత్రుడు, ఎంపిపి సుకల రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోలిపల్లి అమ్మవారి జాతర

అమ్మవారిని దర్శించుకున్న పరుచూరి భాస్కరరావు



అనకాపల్లిరూరల్, న్యూస్‌లీడర్: మండలంలో రేబాక గ్రామంలో శ్రీ పోలిపల్లి అమ్మవారి పరుచూరి భాస్కరావు ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ వంతు సహాయ సహకారాలుంటాయన్నారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ అన్నసమారాధనలో అధికసంఖ్యలో పాల్గొన్న భక్తులకు భాస్కరరావు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మామిడి చిన్నారావు, గాంధీ, కోటి, పెద్దాడ రామశంకర్, భాస్కర యువసేన తదితరులు పాల్గొన్నారు.



మహిళా దినోత్సవ పోస్టర్ విడుదల

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ కళా ప్రదర్శనలను ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో 6,7తేదీలలో కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించనున్నట్టు ఆపార్టీ అధ్యక్ష, కార్యదర్శులు దండు నాగేశ్వరరావు, జి.రమణ ఒక ప్రకనటలో తెలిపారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ప్రజానాట్యమండలి నగర సహాయ కార్యదర్శులు సుభాషిణీ, ఎం.చంటి.ఉపాధ్యక్షులు కె.వెంకటేష్, బొబ్బాది అప్పారావు, దాసరి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సీఆర్‌పీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక



విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : విశాఖ ఫోరం చైల్డ్ రైట్స్ నూతన కమిటీ ఎన్నిక ఆంధ్రా యూనివర్సిటీ ఎస్ఎస్ఎస్ భవనంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో జరిగింది. ఫోరం నూతన అధ్యక్షునిగా ప్రొఫెసర్ ఆర్డీ.సంపత్ కు మార్, ఉపాధ్యక్షునిగా నరవ ప్రకాశరావు, కార్యదర్శిగా బి.హరి, సహకార్యదర్శులుగా రహిమున్నీసా బేగం, డి.వీరభద్రరావు, ట్రెజరర్‌గా వి. హేమాసుందరరావు, సభ్యులుగా ఉజ్వల స్వరూపకుమార్, డేవిడ్‌రాజు, డాక్టర్ శశిప్రభ, డాక్టర్ వై.రమేష్, దిలీప్‌కుమార్ పాత్రో, అబ్దుల్ రఫీక్ ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు గొందు సీతారం, కె.గౌస్ తదితరులు పాల్గొన్నారు.

మరుగు దొడ్ల నిర్మాణాలపై కలెక్టర్ అసంతృప్తి




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : నిర్ణీత గడువులో మరుగు దొడ్ల నిర్మాణాలను పూర్తిచేసి బహిరంగ మలవిసర్జన రహిత జిల్లాగా విశాఖను తీర్చిదిద్దలేకపోయారని మండలాల ప్రత్యేక అధికారులు, రెవిన్యూ డివిజనల్ అధికారులు, మండల స్థాయి అధికారులపై జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ తీవ్ర అసంతృప్తిని, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. రానున్న వారం రోజుల్లో 10 వ తేదీకల్లా మరుగుదొడ్ల నిర్మాణాలను అన్నింటినీ పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రతి రోజూ టెలీ కాన్ఫరెన్సు నిర్వహిస్తూ మరుగుదొడ్ల నిర్మాణాల ప్రగతిని సమీక్షిస్తాని, వీటి నిర్మాణాల్లో ఏమాత్రం అలక్ష్యం వహించినా పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. శనివారం మండలాల ప్రత్యేక అధికారులు, రెవిన్యూ డివిజనల్ అధికారులు, మండల స్థాయి అదికారులతో కలెక్టర్ వీడియోకాన్ఫరెన్సు నిర్వహించి మరుగుదొడ్ల నిర్మాణం, జియోట్యాగిం గ్‌పనుల ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 15 కల్లా మరుగుదొడ్ల నిర్మాణాలను పూర్తిచేయాలని గడువు విధించినప్పటికీ నేటి వరకూ పూర్తిచేయకపోవడానికి కారణాలేంటని అధికారులను ఆయన నిలదీశారు. మండల ప్రత్యేక అధికారులు, రెవిన్యూ డివిజనల్ అధికారులు క్షేత్ర స్థాయిలో తరచుగా పర్యటిస్తూ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, సకాలంలో పూర్తయ్యేలా పర్య వేక్షించాలని ఆదేశించారు.

ప్రత్యేక హోదా కోసం సీపీఎం ఛలో ఢిల్లీ

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని హక్కులు, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ 20 ఫిబ్రవరి 2014న రాజ్యసభ సాక్షిగా ఇచ్చిన హామీలు, 2014 ఎన్ని కల వేళ భారతీయ జనతాపార్టీ ఆంధ్రప్రదేశ్ మెనిపెస్టోలో పొందు పరి చిన అంశాలు నాలుగు సంవత్సరాలు పూర్తి కావొస్తున్నా ఇప్పటికీ అమలుకు నోచు కోలేదు. అందుకే ప్రత్యేహోదా, విభజన హామీలు అమలు చేయాలని వామపక్ష పార్టీల ఆందోళనలో భాగంగా మార్చి 6,7 తేదీల్లో ఛలో ఢిల్లీ కార్యక్రమానికి సిపిఎం విశాఖ జిల్లా కమిటీ సభ్యులు వి.వి.శ్రీనివాసరావు, ఎస్.వి. నాయుడు, కార్యకర్తలు కె.నర్సయ్య, పి.రామన్న బయలుదేరి వెళుతున్నట్టు ఆపార్టీ జిల్లా కార్యదర్శి లోకనాథం తెలిపారు.



ఉత్తరాంధ్ర అభివృద్ధి జాతా పోస్టర్ ఆవిష్కరణ

అనకాపల్లిరూరల్, న్యూస్‌లీడర్: స్థానిక కార్మిక కర్షక భవనంలో ఆదివారం ఉత్తరాంధ్ర అభివృద్ధి జాతా పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మళ్ల సత్యనారాయణ, బాలకృష్ణ, బుద్ద శ్రీనివాసరావు లు మాట్లాడుతూ స్థానిక నెహ్రూచౌక్ వద్ద జరిగే జాతా కార్యక్రమానికి అజిత్‌శర్మ కన్వీనర్‌గా వ్యవహరిస్తారన్నారు. అలాగే రాష్ట్రానికి ప్రత్యేక హెూదా ఇవ్వాలని, ఉత్తరాంధ్రకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజి ఇవ్వాలని , అలాగే గిరిజన యూనివర్సిటీ, రైల్వేజోన్ ఇతర అంశాలపై ఈ జాతా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు

